epaper.samayamdaily.net APTEL/2006/18267

SAMAYAM

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

**విలేకరులు కావలెను**

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

**7036644111, 9490140565**

సంపుటి: 19 | సంచిక: 190 | ఎడిటర్ : విక్రం కుమార్ | మంగళవారం 19 మే 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 14 | వెల:రూ.10 |



# విపత్తులపై తెలంగాణ అప్రమత్తం!

"ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడడం, వీలైనంత వరకూ ఆస్తులకు నష్టం కలగకుండా చూడడమే లక్ష్యంగా ప్రభుత్వ పని చేస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. సిఎం రేవంత్ రెడ్డి సూచనల మేరకు ప్రపంచస్థాయి సాంకేతికతతో విపత్తు రక్షణ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని అన్నారు. వివిధ రాష్ట్రాలలో అమలు చేస్తున్న అత్యుత్తమ విధానాలకు అనుగుణంగా తెలంగాణలో విపత్తు నిర్వహణ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని మంత్రి వెల్లడించారు. ప్రకృతి విపత్తులు, అగ్నిప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కొవడానికి ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్న అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని, అత్యాధునిక పరికరాలను పరిశీలించి, వాటి వివరాలతో కూడిన సమగ్ర నివేదికను, ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలని అధికారులను ఆదేశించారు."

**హైదరాబాద్:** ప్రకృతి విపత్తులు, అత్యవసర సమయాల్లో ప్రజల ప్రాణాలను కాపాడడం, వీలైనంత వరకు ఆస్తులకు నష్టం కలగకుండా చూడడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి సూచనల మేరకు ప్రపంచస్థాయి సాంకేతికతతో రాష్ట్రంలో విపత్తు రక్షణ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని ఆయన వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న విపత్తు నిర్వహణ మాక్ ఎక్సర్‌సైజ్‌లలో భాగంగా, హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్ హెచ్‌ఎండీఏ గ్రౌండ్స్ వద్ద సోమవారం నిర్వహించిన భారీ మాక్ డ్రిల్‌ను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. అనంతరం కమాండ్ కంట్రోల్ సెంటర్ నుండి వివిధ శాఖల ఉన్నతాధికారులతో విపత్తు నిర్వహణపై ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న అత్యుత్తమ విధానాలకు అనుగుణంగా తెలంగాణలో విపత్తు నిర్వహణ వ్యవస్థను

మిగతా 2 లో

- ప్రమాదాల సమయంలో గోల్డెన్ అవర్ కీలకం
- తక్షణం స్పందిస్తే ప్రమాదాల నివారణ సాధ్యం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- నెక్లెస్‌రోడ్‌లో మాక్ డ్రిల్ ప్రారంభం



# రూ.20 లక్షల కోసం బిడ్డను అమ్మేసిన కన్నతండ్రి

## 45 ఏళ్ల లీడర్‌తో బలవంతపు పెళ్లి!

## కన్యాశుల్కాన్ని తలపించే ఘోరం

## మహిళా కమిషన్‌లో బాధితురాలి ఫిర్యాదు

## జనగామ జిల్లా బచ్చన్నపేటలో దారుణం



ఆ గుడిలో పెళ్లి బాజాలు మోగాయి.. అందరూ నవ్వుతూ అక్షింతలు వేశారు.. కానీ, ఆ పెళ్లి పీటల వెనుక రూ.20 లక్షల భయానక వ్యాపారం దాగుందని అక్కడున్న వారెవరికీ తెలియదు! కన్నకూతురి వయసున్న పడుచుపిల్లను అప్పుల కోసం అంగడి వస్తువులా మార్చిన కన్నతండ్రి, సవతి తల్లి.. 45 ఏళ్ల లీడర్‌తో బలవంతపు పెళ్లి.. కానీ, ఆ మరుసటి రోజే సీన్ రివర్స్!



2



# నక్సల్స్ రహిత రాష్ట్రంగా తెలంగాణ

- కృషి చేసిన పోలీస్ అధికారులను సన్మానం
- వారి కృషి అసామాన్యమని అమిత్‌షా కితాబు

4

# కేరళ సీఎంగా సతీశన్ ప్రమాణం

- ఆయనతో పాటు 20 మంది మంత్రులకు ఛాన్స్
- హాజరైన రాహుల్, ప్రియాంక, ఖర్గే, రేవంత్ రెడ్డి



4

# గడువులోగా ప్రాజెక్టులు

- ఇరిగేషన్ క్యాలెండర్ ప్రకారం ప్రాజెక్టుల పనులు
- పోలవరం ఎడమ కాల్వ లింక్‌పై అధ్యయనం
- 2027 ఏప్రిల్ నాటికి నిర్వాసితుల తరలింపు
- సీజన్ ఆలస్యం కాకుండా కాల్వలకు నీటి విడుదల
- జలవనరుల శాఖ సమీక్షలో చంద్రబాబు దిశానిర్దేశం



వివరాలు 5వ పేజీలో

# ప్రజలకు నమ్మకం కలిగేలా పనిచేయాలి

- 40 వేల మంది క్షేత్రస్థాయి సిబ్బంది, కలెక్టర్లతో సీఎం ముఖాముఖి

# భగీరథ్‌పై అదనపు సెక్షన్లు!



3

- పకడ్బందీగా పోక్సో కేసు విచారణ
- రంగంలోకి ప్రత్యేక అధికారి డీసీపీ రితిరాజ్
- నిందితుడికి జీవిత ఖైదు పడే అవకాశం

3

## జస్టిస్ మాధవీదేవిపై దుష్ప్రచారం.. వ్యక్తి అరెస్ట్!



# వేగంగా గ్రీన్‌ఫీల్డ్ పోర్టు

- మంత్రి జనార్దన్ రెడ్డి

5



# న్యూక్లియర్ ఆర్థిక వ్యవస్థలో ఏపీ అగ్రగామి

## యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్ షిప్ ఫోరంలో లోకేశ్

5



# ఈ-గవర్నెన్స్‌తోనే మెరుగైన సేవలు

### తమిళనాడు అనుసరిస్తున్న విధానం అనుసరణీయం

### రాష్ట్రాలకు కేంద్ర కేబినేట్ కార్యదర్శి సోమనాథన్ సూచన

**హైదరాబాద్, మే 18:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సింపుల్ ఈ-గవర్నెన్స్ ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని కేంద్ర ప్రభుత్వ కేబినెట్ సెక్రెటరీ డాక్టర్ టివి సోమనాథన్ ఆయా రాష్ట్రాల చీఫ్ సెక్రెటరీలను ఆదేశించారు. సోమవారం కేంద్ర కేబినెట్ సెక్రెటరీ తమిళనాడు ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ-గవర్నెన్స్ విధానాన్ని ఇతర రాష్ట్రాలు కూడా ఆయా రాష్ట్రాల్లో ఉన్న నిబంధనల మేరకు ప్రజలకు సరళతరమైన,మెరుగైన ప్రభుత్వ సేవలను అందించేందుకు ప్రయత్నించాలని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూచించారు. సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ-గవర్నెన్స్ విధానాన్ని వివరించారు. ప్రజలకు పాదర్శకంగా సులభతరమైన పౌర సేవలను అందిస్తున్నామని, ఎప్పటికప్పుడు వివిధ విభాగాల వారీగా ఆన్‌లైన్‌లో డ్యాష్ బోర్డుల ద్వారా తెలియజేస్తున్నామన్నారు. మున్సిపల్, ఇండస్ట్రీస్, ఎడ్యుకేషన్, ఎనర్జీ, రెవెన్యూ తదితర శాఖల్లో ఈ-గవర్నెన్స్ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను వివరించారు. కేబినెట్ సెక్రెటరీ సిఎస్ కె.రామకృష్ణారావును ఈ-గవర్నెన్స్ విధానంపై అభినందించారు. తమిళనాడు ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని కూడా అధ్యయనం చేసి ప్రజలకు ఎలాంటి ఆర్థికభారం, ఇతర ఇబ్బందులు కలగకుండా రాష్ట్రంలో ఈ-గవర్నెన్స్ విధానాల్లో మార్పులు చేస్తామన్నారు. సమావేశంలో స్పెషల్ సిఎస్ నవీన్ మిట్టల్, ముఖ్యకార్యదర్శి యోగితారాణా, షీకాగోయల్, సెక్రెటరీలు రఘునందన్ రావు, ఇ.శ్రీధర్, అనితా రామచంద్రన్, హౌసింగ్ ఎం.డి వి.పి. గౌతం, సెర్పు సిఇఒ దివ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఇమామ్‌లు, పూజరులకు గౌరవ వేతనం రద్దు

### అన్నపూర్ణ పథకం కింద మహిళలకు 3వేల సాయం

### మత ఆధారిత సంక్షేమ పథకాలు రద్దు

### బెంగాల్ ప్రభుత్వం కీలక నిర్ణయం

**కోల్‌కతా, మే 18:** సువేందు అధికారి నేతృత్వంలోని వెస్ట్ బెంగాల్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో మత ఆధారిత సంక్షేమ పథకాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. సోమవారం సీఎం సువేందు అధికారి అధ్యక్షతన బెంగాల్ కేబినెట్ భేటీ జరిగింది. ఈ సమావేశంలో మత ఆధారిత సంక్షేమ పథకాలను నిలిపివేయాలని మంత్రి మండలి నిర్ణయించింది. 2026, జూన్ నుంచి ఈ పథకాలు నిలిపివేయనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. సంక్షేమ కార్యక్రమాలకు మతం రంగు పులమకూడదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. బెంగాల్‌లో మమతా బెనర్జీ నేతృత్వంలోని గత టీఎంసీ సర్కార్ ఇమామ్‌లు, ముఅజ్జిన్‌లు, ఆలయ పూజారులకు నెలవారీ గౌరవ వేతనాన్ని అందించిన విషయం తెలిసిందే. పశ్చిమ బెంగాల్ వ్యాప్తంగా ఉన్న ఇమామ్‌లకు ప్రభుత్వం నెలవారీ గౌరవ వేతనాన్ని అందించింది. ఈ పథకం కింద ఆర్థికంగా బలహీన వర్గాల నుంచి వచ్చిన ఇమామ్‌లు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం అందజేసేవారు. అలాగే, మసీదులలో భక్తులను ప్రార్థనకు పిలిచే ముఅజ్జిన్‌లకు కూడా ఇదే విధమైన ఆర్థిక సహాయ అందించారు. ఈ రెండు పథకాలకు నిధులనూ మైనారిటీ సంక్షేమ శాఖ నుంచి ఇచ్చేవారు. పంపిణీ చేశారు. ఇమామ్‌ల మాదిరిగానే హిందూ పూజారులు లేదా పురోహితుల కూడా ప్రభుత్వం ఆర్థిక సహయం అందించింది. ఈ పథకం కింద ప్రభుత్వ రికార్డుల్లో నమోదైన పురోహితులు నెలకు రూ.2 వేల గౌరవ వేతనాన్ని అందుకున్నారు. ఇటీవల జరిగిన బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ ఘోర పరాజయం పాలైంది. దీంతో బెంగాల్ తొలి బీజేపీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన సువేందు అధికారి పలు కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగానే గత టీఎంసీ సర్కార్ అమలు చేసిన మత ఆధారిత సంక్షేమ పథకాలను సువేందు అధికారి రద్దు చేశారు. ఇకపోతే బీజేపీ ప్రభుత్వం పలు ఇతర సంక్షేమ పథకాల అమలుకు సిద్ధమవుతోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపై నిర్ణయం తీసుకుంది.క్యాబినెట్ భేటీలో ప్రధానంగా ఐదు కీలక అంశాలపై చర్చ జరిపి, ఆమోదం తెలిపారు. జూన్ 1వ తేదీ నుంచి 'అన్నపూర్ణ' పథకం అమలకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. ఈ పథకం కింద అర్హులైన మహిళలకు నెలకు రూ.3,000 ఆర్థిక సాయం అందిస్తారు. అలాగే, ప్రభుత్వ బస్సుల్లో మహిళలకు జూన్ 1వ తేదీ నుంచి ఉచిత ప్రయాణం కల్పిస్తారు. ఇక, ప్రభుత్వ ఉద్యోగుల కోసం 7వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇక ఆరోగ్య రంగంలో కూడా పెద్ద మార్పులు తీసుకురానున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలు చేసేందుకు చర్యలు ప్రారంభించారు. పీఎం విశ్వకర్మ, పీఎమ్ ఫసల్ బీమా యోజన, పీఎం శ్రీస్కూల్స్ వంటి కేంద్ర పథకాలను కూడా పూర్తి స్థాయిలో అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కాగా, ప్రస్తుతం కొనసాగుతున్న సంక్షేమ పథకాలను ఒక్కసారిగా రద్దు చేయ-ంబోమని సీఎం సువేందు అధికారి ఈ సమావేశంలో స్పష్టం చేసినట్లు సమాచారం.

# చెట్ల నరికివేతపై సుప్రీం స్టే!

**న్యూఢిల్లీ, మే 18:** కేబీఆర్ పార్క్ పరిసరాల్లో చెట్ల నరికివేతపై సుప్రీం కోర్టు స్టే విధించింది. ఎకో సెన్సిటివ్ జోన్ లోపల చెట్లను ఎట్టి పరిస్థితుల్లోనూ నరకరాదని ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. కేబీఆర్ పార్క్ చుట్టూ ఫ్లై ఓవర్ల నిర్మాణాన్ని తెలంగాణ ప్రభుత్వం చేపట్టగా.. చెట్ల నరికివేతపై అభ్యంతరాలు వ్యక్తంచేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. సోమవారం జస్టిస్ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం ముందు ఈ పిటిషన్‌పై విచారణ జరిగింది. పర్యావరణ ప్రేమికుల తరఫున సీనియర్ కౌన్సిల్ కే. వివేక్ రెడ్డి కోర్టులో బలమైన వాదనలు వినిపించారు. చెట్ల నరికివేత వల్ల జరిగే పర్యావరణ నష్టాన్ని వివరించిన ఆయన, ప్రభుత్వ నిర్మాణ పనులపై స్టే విధించాలని కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న సుప్రీంకోర్టు చెట్ల నరికివేతపై స్టే ఇస్తూ, తదుపరి విచారణను జూలై 27కు వాయిదా వేసింది. సుప్రీంకోర్టు స్టే ఆదేశాలతో ఎస్ఆర్డీపీ పనులు తాత్కాలికంగా నిలిచిపోనున్నాయి. అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన ఈ ఉత్తర్వుల వల్ల ప్రధానంగా కేబీఆర్ జంక్షన్ పరిసరాల్లో చేపట్టదలచిన ఫ్లై ఓవర్ల నిర్మాణానికి భారీ ఆటంకం ఏర్పడింది.

# విపత్తులపై తెలంగాణ అప్రమత్తం!

మొదటి పేజీ తరువాయి

తీర్చిదిద్దుతామని మంత్రి పొంగులేటి తెలిపారు. ప్రకృతి విపత్తులు, అగ్నిప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కొవడానికి ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్న అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, రక్షణ పరికరాలను పరిశీలించి, వాటి వివరాలతో కూడిన సమగ్ర నివేదికను, ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలని అధికారులను ఆదేశించారు. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ సహకారంతో నిర్వహిస్తున్న ఈ మాక్ డ్రిల్ ద్వారా లభించే అనుభవాలతో అధికారులు విపత్తుల సమయంలో మరింత బాధ్యతాయుతంగా, సమర్థవంతంగా సేవలు అందించాలని సూచించారు. వరదలు, అగ్నిప్రమాదాలు, పారిశ్రామిక ప్రమాదాలు సంభవించినప్పుడు వేగవంతమైన స్పందన, వివిధ శాఖల మధ్య ముందస్తు సమన్వయం ఎంతో కీలకమన్నారు.



### గోల్డెన్ అవర్ విస్మరించొద్దు - తక్షణమే స్పందించాలి

ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు మొదటి గంట ఎంతో కీలకమైనదని, దానిని 'గోల్డెన్ అవర్'గా పరిగణించాలని మంత్రి పేర్కొన్నారు. ఆ సమయంలో రెస్క్యూ సిబ్బంది అంతా పూర్తి సమన్వయంతో పనిచేస్తూ, అందుబాటులో ఉన్న అత్యాధునిక ఎక్విప్‌మెంట్‌ను సరిగ్గా వినియోగించి బాధితులకు తక్షణ రక్షణ, వైద్య సేవలు అందించాలన్నారు. ప్రమాదం జరిగిందనే కాల్ రాగానే ఏమాత్రం ఆలస్యం చేయకుండా సరైన సమయంలో సంఘటనా స్థలానికి చేరుకోవడం అధికారుల బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన గత చరిత్రను గుర్తుచేస్తూ.. 1908లో సంభవించిన హైదరాబాద్ మహావరదలను, ఇటీవలి కాలంలో వచ్చిన గోదావరి, కృష్ణా నదుల వరదలను ప్రస్తావించారు. విపత్తుల విషయంలో అప్రమత్తత లేకపోతే ఎంతటి ఘోర నష్టం జరుగుతుందో చరిత్ర చెబుతోందని, అందుకే రెస్క్యూ బృందాలు ఎల్లప్పుడూ అలర్ట్‌గా ఉండాలని సూచించారు. అడవుల్లో సంభవించే అగ్నిప్రమాదాలు పచ్చదనాన్ని నాశనం చేస్తుంటే, పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్న అగ్నిప్రమాదాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

### ఉర్రూతలూగించిన రెస్క్యూ బృందాల ప్రదర్శన:

ఈ మాక్ డ్రిల్‌లో భాగంగా గాలితో నింపే లైఫ్ బోట్లు, నీటిలో చిక్కుకున్న వారిని రక్షించే అత్యాధునిక సాంకేతిక పద్ధతులు, అత్యవసర తరలింపు చర్యలు, సమన్వయంతో కూడిన రెస్క్యూ ఆపరేషన్‌లను ప్రత్యేక బృందాలు ప్రత్యక్షంగా ప్రదర్శించి చూపించాయి. అనంతరం మంత్రి నెక్లెస్ రోడ్ బోటింగ్ క్లబ్‌ను సందర్శించి అక్కడి రెస్క్యూ కార్యకలాపాలను స్వయంగా పరిశీలించారు. తెలంగాణలో ఇంత విస్తృత స్థాయిలో మాక్ ఎక్సర్‌సైజ్‌లు నిర్వహించడం అభినందనీయమని పేర్కొంటూ ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, విపత్తు నిర్వహణ శాఖ మరియు జిల్లా అధికారులను మంత్రి అభినందించారు. ఈ భారీ కార్యక్రమంలో విపత్తు నిర్వహణ శాఖ కార్యదర్శి దాసరి హరిచందన, తెలంగాణ రాష్ట్ర విపత్తు స్పందన మరియు అగ్నిమాపక శాఖ డీజీ విక్రమ్ సింగ్ మాన్, హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, ఎన్‌డీఎంఏ లీడ్ కన్సల్టెంట్ మేజర్ జనరల్ (రిటైర్డ్) సుధీర్ బెల్ పాల్గొన్నారు. వీరితో పాటు పోలీస్, ఫైర్, రెవెన్యూ, వైద్య ఆరోగ్య, జీహెచ్ఎంసీ, రవాణా తదితర శాఖల అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 20 లక్షల కోసం బిడ్డను అమ్మేసిన కన్నతండ్రి

### 45 ఏళ్ల లీడర్‌తో బలవంతపు పెళ్లి!

### కన్యాశుల్కాన్ని తలపించే ఘోరం

### మహిళా కమిషన్‌లో ఫిర్యాదు

### జనగామ జిల్లాలో దారుణం





**జనగామ:** ఆ యువతి వయసు కేవలం 18 ఏళ్లు. లోకం తెలియని వయసు, గుండె నిండా ఎన్నో కలలు. కానీ, ఆ కన్నతండ్రి కళ్లకు మాత్రం ఆమె కన్నబిడ్డలా కనిపించలేదు.. తాము చేసిన అప్పులను తీర్చే ఒక 'ఆస్తి'లా కనిపించింది! తనకు ఉన్న రూ.20 లక్షల అప్పు తీరిపోతుందంటే, కన్నబిడ్డ జీవితం ఏమైపోయినా పర్వాలేదనుకున్నాడు ఆ కిరాతక తండ్రి. పెళ్లి చేసుకోకపోతే విషమిచ్చి చంపేస్తామని సవతి తల్లితో కలిసి బెదిరించాడు. ఊపిరాడకుండా చేసిన ఆ నరకం నుండి తప్పించుకోవడానికి ఆ పసి ప్రాణం తాళి కట్టించుకుంది.. కానీ, ఆ తర్వాత ఏం జరిగిందనేదే ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. జనగామ జిల్లా బచ్చన్నపేటలో జరిగిన ఈ అమానుష ఘటన, ఆ తర్వాత జరిగిన హైడ్రామా వివరాల్లోకి వెళితే..

### అప్పుల కోసం గుడిలో బలవంతపు పెళ్లి

బచ్చన్నపేటకు చెందిన రాకేశ్ గౌడ్ కొన్నేళ్ల కిందట ఒక ఎస్టీ మహిళను వివాహం చేసుకోగా, వారికి ఈ 18 ఏళ్ల కూతురు జన్మించింది. ఆ తర్వాత మొదటి భార్యను వదిలించుకున్న రాకేశ్.. రెండో పెళ్లి చేసుకున్నాడు. జల్సాలు, అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాకేశ్.. ఇటీవల అత్యవసరంగా రూ.2 లక్షల కోసం స్థానిక బీఆర్ఎస్ లీడర్ ఆవుల ప్రశాంత్ రెడ్డి (45)ని ఆశ్రయించాడు. అక్కడే ఆ లీడర్ అసలు రంగు బయటపెట్టాడు. "నీకున్న రూ.20 లక్షల అప్పు అంతా నేనే క్లియర్ చేస్తా.. కానీ నీ 18 ఏళ్ల కూతురిని నాకు ఇచ్చి పెళ్లి చేయాలి" అని డీల్ మాట్లాడాడు. దానికి ఆ కన్నతండ్రి, సవతి తల్లి ఇద్దరూ పచ్చజెండా ఊపేశారు. యువతి నిరాకరిస్తే విషమిచ్చి చంపేస్తామని నరకం చూపించారు. దాంతో ప్రాణభయంతో లొంగిపోయిన ఆ యువతికి, ఈ నెల 8న స్థానిక గుడిలో 45 ఏళ్ల ప్రశాంత్ రెడ్డితో బలవంతంగా పెళ్లి జరిపించి, భర్త ఇంటికి పంపించేశారు.

### ట్విస్ట్ ఇస్తూ.. స్నేహితుల సాయంతో జంప్

కట్ చేస్తే.. కథ అక్కడితో ముగిసిపోలేదు, అసలు ట్విస్ట్ ఇక్కడే మొదలైంది! ఆ లీడర్ ఇంట్లో బందీగా మారిన ఆ యువతి ఎలాగైనా అక్కడి నుండి తప్పించుకోవాలని గట్టిగా నిశ్చయించుకుంది. తన నమ్మకమైన స్నేహితులకు రహస్యంగా సమాచారం అందించింది. వారు వేసిన పక్కా ప్లాన్‌తో, ప్రశాంత్ రెడ్డి కళ్లుగప్పి పెళ్లయిన మరుసటి రోజే ఆ ఇంట నుండి చాకచక్యంగా తప్పించుకుని హైదరాబాద్‌కు చెక్కేసింది. శనివారం నేరుగా హైదరాబాద్‌లోని రాష్ట్ర మహిళా కమిషన్‌ను ఆశ్రయించి తనకు జరిగిన ఘోరాన్ని వివరించి ఫిర్యాదు చేసింది.

### న్యాయం కోసం బాధితురాలి వేడుకోలు

ఆదివారం రంగారెడ్డి జిల్లా కోర్టు వద్దకు చేరుకున్న బాధిత యువతి.. మీడియా ముందు తన ఆవేదనను వెళ్లగక్కింది. కన్నతండ్రి, సవతి తల్లి కలిసి తన జీవితాన్ని ఎలా తాకట్టు పెట్టారో చెబుతూ కన్నీటి పర్యంతమైంది. తనకు ప్రశాంత్ రెడ్డి నుండి ప్రాణహాని ఉందని, మహిళా కమిషన్, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రక్షణ కల్పించాలని వేడుకుంది. ఇప్పటికే ఈ వ్యవహారంపై రాష్ట్ర డీజీపీ, జనగామ జిల్లా ఎస్పీ కార్యాలయాల్లో ఫిర్యాదులు చేసినట్లు బాధితురాలి తరపు న్యాయవాది గ్యార సతీష్ వెల్లడించారు. అయితే, యువతి తప్పించుకోవడానికి సహకరించిన ఆమె స్నేహితులపైనే రివర్స్‌లో స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసులు పెట్టించారని, దీనిపై తక్షణ విచారణ జరిపి బాధితురాలికి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# మ్యూజియాలు జ్ఞాన కేంద్రాలు!

- వారసత్వ సంపద రక్షణ మనందరి బాధ్యత
- అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవంలో మంత్రి జూపల్లి కృష్ణారావు



**హైదరాబాద్, మే 18:** మ్యూజియాలు అనేవి కేవలం పురాతన వస్తువుల నిల్వ కేంద్రాలు మాత్రమే కావని, అవి మన నాగరికత, సంస్కృతి, చరిత్ర, సంప్రదాయాలు, జీవన విధానానికి అద్దం పట్టే జ్ఞాన కేంద్రాలని పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ప్రపంచ వారసత్వ సంపదను రక్షించడం అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తు చేశారు. అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం సందర్భంగా సోమవారం పబ్లిక్ గార్డెన్ లోని రాష్ట్ర మ్యూజియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి జూపల్లి హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెలంగాణలో పరమార జగద్దేవుని శాసనాలు, స్టకో స్కప్చర్స్ ఇన్ సెంటెనరీ మ్యూజియం అనే పుస్తకాలతో పాటు బ్రోషర్లను మంత్రి జూపల్లి ఆవిష్కరించారు. సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. ఒక దేశ గొప్పతనం, నాగరికత, సంస్కృతి, సాంప్రదాయాలు అన్నీ మ్యూజియాలు, వారసత్వ సంపద ద్వారానే భావితరాలకు చేరుతాయని అన్నారు. ఎటువంటి సాంకేతిక పరిజ్ఞానం, పరికరాలు లేని కాలంలో అద్భుతమైన కట్టడాలను మన పూర్వీకులు నిర్మించారని, వాటిని చూసి తరించకపోతే జీవితం సంపూర్ణం కాదని తెలిపారు. ÷ామప్ప దేవాలయానికి ప్రపంచ వారసత్వ జాబితాలో స్థానం లభించడం తెలంగాణ చరిత్రకు అంతర్జాతీయ గుర్తింపును తీసుకువచ్చిందని, ఈ వారసత్వ కట్టడాలను ప్రపంచానికి పరిచయం చేయడం ద్వారా తెలంగాణను అంతర్జాతీయ పర్యాటక పటంలో మరింత ప్రతిష్టాత్మకంగా నిలపాలని ప్రభుత్వం సంకల్పించిందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం వారసత్వ సంపద పరిరక్షణ, మ్యూజియాల అభివృద్ధి, చారిత్రక కట్టడాల సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. చారిత్రక ప్రాంతాలు, పర్యాటక ప్రదేశాలలో స్థానిక యువతకు ఉపాధి కల్పించేందుకు, సందర్శకులకు మెరుగైన సమాచారం అందించేందుకు ప్రత్యేకంగా గైడ్‌లకు శిక్షణ ఇవ్వనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. దీని కోసం రూ. 5 కోట్లు కేటాయిస్తామని చెప్పారు. పర్యాటక, సాంస్కృతిక శాఖ స్పెషల్ సీఎస్ వాణి ప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్ర పురావస్తు శాఖ ఆధ్వర్యంలో ఆర్కియాలజీ, మ్యూజియాలజీ రంగాల్లో నూతన కోర్సులను అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని వారసత్వ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. చిన్నపిల్లలు, విద్యార్థులు, యువత మ్యూజియాలను సందర్శించి చరిత్రపై అవగాహన పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో వరల్డ్ మన్యూమెంట్ ఫండ్ బోర్డు మెంబర్ షాలిని భూపాల్, పర్యాటక అభివృద్ధి సంస్థ మెనేజింగ్ డైరెక్టర్ గౌతమి, పర్యాటక శాఖ డైరెక్టర్ లక్ష్మణ్ రంజిత్ నాయక్, పురావస్తు శాఖ డైరెక్టర్ అర్జున రావు, నిథమ్ డైరెక్టర్ వెంకటరమణ, కేంద్ర పురావస్తు శాఖ సూపరి÷-టనెండెంట్ నిఖిల్ దాస్, డెక్కన్ హెరిటేజ్ అకాడమీ చైర్మన్ వేద కుమార్, ఇంటాచ్ (ఎఔ÷ంఅఊ) కన్వీనర్ అనురాధ రెడ్డి, చరిత్రకారులు డా. ఈమని శివనాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# బండి భగీరథ్‌పై అదనపు సెక్షన్లు!

పకడ్బందీగా పోక్సో కేసు విచారణ

రంగంలోకి ప్రత్యేక అధికారి డీసీపీ రితిరాజ్

నిందితుడికి జీవిత ఖైదు పడే అవకాశం

**హైదరాబాద్, మే 18:** పోక్సో కేసులో అరెస్టయిన బండి భగీరథ్‌పై పోలీసులు మరో కఠినమైన సెక్షన్‌ను అదనంగా చేర్చారు. బాధితురాలిపై పలు మార్లు అత్యాచారం చేశాడనే ఆరోపణలపై బీఎన్ఎస్ 64(2)(జెడ్) సెక్షన్‌ను దర్యాప్తు అధికారులు జత చేశారు. దీని ప్రకారం నేరం రుజువైతే పదేళ్లకు పైగా జైలు శిక్ష లేదా జీవిత ఖైదు విధించే అవకాశం ఉంది. ఈ నెల 8న మైనర్ బాలికపై లైంగిక వేధింపులు జరిగాయంటూ ఆమె తల్లి పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్లారు. ఆ సమయంలో తీవ్ర హైడ్రామా మధ్య పోలీసులు కేవలం బీఎన్ఎస్ సెక్షన్లు 74, 75 తో పాటు పోక్సో చట్టం 2012 లోని సెక్షన్ 11 రెడ్ విత్ 12 కింద మాత్రమే కేసులు నమోదు చేశారు. ఆ తర్వాత బాధితురాలి నుంచి మహిళా అధికారులు వాంగ్మూలం తీసుకున్నారు. అయితే, పోలీసులు బాధితురాలితో నిజం చెప్పకుండా ఉండేలా ఒత్తిళ్లు తెచ్చారనే ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనపై అన్ని వైపుల నుంచి ప్రభుత్వంపై ఒత్తిడి పెరగడంతో.. సోమవారం కూకట్‌పల్లి జోన్ డీసీపీ రితిరాజ్‌ను ప్రత్యేక దర్యాప్తు అధికారిగా ప్రభుత్వం నియమించింది. వెంటనే రంగంలోకి దిగిన ఆమె సోమవారం సాయంత్రం పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఘటనపై ఆరా తీశారు. అప్పటికే పోలీసులు బాధితురాలి నుంచి తీసుకున్న వాంగ్మూలాన్ని పరిశీలించారు. అందులో స్పష్టత లేకపోవడంతో మరింత లోతుగా దర్యాప్తు ప్రారంభించారు. మంగళవారం డీసీపీ రితిరాజ్ నేరుగా బాధితురాలి ఇంటికి వెళ్లి ఆమెను కలిశారు. పోక్సో కేసు దర్యాప్తు నిబంధనల ప్రకారం ఫ్రెండ్లీ వాతావరణంలో బాధితురాలి నుంచి వివరాలు సేకరించారు. పోలీసులు నమోదు చేసిన సెక్షన్లకు, బాధితురాలు చెప్తున్న వివరాలకు పొంతన లేకపోవడాన్ని ఆమె గుర్తించారు. బాధితురాలి ఆరోపణలు పోక్సో చట్టంలోని సెక్షన్ 5(1), 6 పరిధిలోకి వస్తాయని నిర్ధారించారు. బాధితురాలిపై పలుమార్లు లైంగిక దాడి జరిగినట్లు ఆరోపణలు ఉన్నందున ఈ సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలని చట్టం సూచిస్తోంది. బాధితురాలు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా జరిగిన నేరం అత్యంత తీవ్రమైనదని గ్రహించిన డీసీపీ, ఆ మేరకు కేసులో సెక్షన్ 5(1) రెడ్ విత్ 6ను జోడించారు. ఈ సెక్షన్ల ప్రకారం నేరం రుజువైతే నిందితుడికి 20 ఏళ్లకు తగ్గకుండా జైలు శిక్ష లేదా జీవిత ఖైదు విధించే అవకాశాలు ఉన్నాయి.

# జస్టిస్ మాధవీదేవిపై దుష్ప్రచారం.. వ్యక్తి అరెస్ట్!


హైకోర్టు న్యాయమూర్తిపై సోషల్ మీడియాలో పోస్టులు

చార్మినార్ పోలీసులకు రిజిస్ట్రార్ ఫిర్యాదు

**హైదరాబాద్, మే 18:** పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న బండి సాయి భగీరథ్ ముందస్తు బెయిల్ పిటిషన్ విచారణ నేపథ్యంలో.. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టీ. మాధవీదేవిపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసిన దామోదర్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. బండి సంజయ్ కుమారుడికి బెయిల్ మంజూరు చేస్తే, తన భర్తకు చైర్మన్ పదవి ఇస్తారంటూ సదరు వ్యక్తి అసత్య ఆరోపణలు చేస్తూ ప్రచారం సాగించాడు. ఈ వ్యవహారంపై తీవ్రంగా స్పందించిన హైకోర్టు రిజిస్ట్రార్ బీ.ఎస్. చిరంజీవి చార్మినార్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు వెంటనే దర్యాప్తు చేపట్టి నిందితుడు దామోదర్‌ను అదుపులోకి తీసుకున్నారు. న్యాయమూర్తిపై జరిగిన ఈ దుష్ప్రచారంపై హైకోర్టు ఇప్పటికే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.

# ఇంధన, గ్యాస్ సరఫరా స్థిరం!

పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ కొరత లేదు: ఓఎంసీలు



**హైదరాబాద్, మే 18:** రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్, లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్ (ఎల్పీజీ) డిమాండ్‌కు అనుగుణంగా అందుబాటులో ఉన్నాయని, ఎక్కడా కొరత లేదని తెలంగాణలోని చమురు మార్కెటింగ్ కంపెనీలు (ఓఎంసీలు) స్పష్టం చేశాయి. సరఫరాను ప్రభుత్వ రంగ సంస్థలు నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని, రవాణా సేవలను మరింత వేగవంతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఓఎంసీల రాష్ట్ర కో-ఆర్డినేటర్ ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ నెల మొదటి 15 రోజుల్లోనే పెట్రోల్ సరఫరాలో 14.2 శాతం, డీజిల్ సరఫరాలో 15.7 శాతం వృద్ధి నమోదైంది. వేసవిలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా గృహావసర ఎల్పీజీ సిలిండర్ల బుకింగ్స్ తగ్గుముఖం పట్టాయి. ఆందోళనతో వినియోగదారులు ముందస్తు బుకింగ్స్ చేయడం లేదు. తెలంగాణలో ఈ నెలలో నిన్నటి వరకు మొత్తం 20.06 లక్షల గృహావసర సిలిండర్లను డెలివరీ చేశామని, ఈ సీజన్‌కు ఇది సాధారణమేనని ఓఎంసీలు తెలిపాయి. ఎస్ఎంఎస్, మిస్డ్ కాల్, ఐవీఆర్ఎస్, ఆన్‌లైన్ వేదికల ద్వారా సిలిండర్లు బుక్ చేసుకోవాలని వినియోగదారులను కంపెనీలు కోరాయి. ఎల్పీజీ సిలిండర్ల పంపిణీలో అక్రమాలను అరికట్టేందుకు, అసలైన లబ్ధిదారులకు అందేలా చూసేందుకు ఓటీపీ ఆధారిత విధానాన్ని (డెలివరీ అథెంటికేషన్ కోడ్ – డీఏసీ) అనుసరించాలని కంపెనీలు కోరుతున్నాయి. తెలంగాణలో ప్రస్తుతం ఈ విధానం 95 శాతానికి పైగా అమలవుతోంది. దీనిని వంద శాతానికి చేర్చేందుకు గ్యాస్ ఏజెన్సీలు వినియోగదారుల సహకారాన్ని కోరుతున్నాయి. నకిలీ వార్తలు, వదంతులను నమ్మి మోసపోవద్దని ఓఎంసీలు విజ్ఞప్తి చేశాయి.

# ఒకే రూపంలో జెండా గద్దెలు

- నెల రోజులు పార్టీ జెండా పండుగ
- టీఆర్ఎస్‌చీఫ్ కల్వకుంట్ల కవిత
- అధికారిక గద్దె మోడల్ ఆవిష్కరణ





**హైదరాబాద్:** తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ అస్తిత్వాన్ని, సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు వీలుగా రాష్ట్రవ్యాప్తంగా ఒకే మోడల్‌లో జెండా గద్దెలను నిర్మించ తలపెట్టినట్లు పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన టీఆర్ఎస్ రాష్ట్ర జనరల్ బాడీ సమావేశంలో ఆమె పాల్గొని, పార్టీ జెండా గద్దెల అధికారిక డిజైన్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తూ, ఈ నెల 20వ తేదీ నుండి జూన్ 20వ తేదీ వరకు నెల రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా 'టీఆర్ఎస్ జెండా పండుగ'ను అత్యంత వైభవంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఏ గ్రామానికి వెళ్లినా, ఏ కూడలిలో చూసినా పార్టీ జెండాలు, గద్దెలు ఒకే ఏకరూపంలో కనిపించాలని, అందుకోసం ప్రత్యేక కలర్ కోడ్, కొలతలను ఖరారు చేశామని కవిత వెల్లడించారు. ప్రతి జెండా గద్దెను మూడు ఫీట్ల ఎత్తు, రెండు ఫీట్ల వెడల్పుతోనే నిర్మించాలని సూచించారు. ఇందులో జెండా గద్దె బేస్ (అడుగు భాగం) ఒక ఫీట్ ఎత్తులో నిర్మించి దానికి గ్రీన్ కలర్ వేయాలని, ఆ గ్రీన్ కలర్ మధ్యలో తెలుగు అక్షరాల్లో 'తెలంగాణ రక్షణ సేన' అని రాయాలని స్పష్టం చేశారు. అలాగే పైభాగం మరో రెండు ఫీట్ల ఎత్తులో నిర్మించి దానికి ఎల్లో కలర్ వేయాలని, దాని మధ్యలో బ్లూ కలర్‌లో తెలంగాణ మ్యాప్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆ తెలంగాణ మ్యాప్ మధ్యలో ఇంగ్లీష్ అక్షరాల్లో 'టీఆర్ఎస్' అని స్పష్టంగా రాయాలని వివరించారు. పార్టీ జెండా కలర్ కోడ్స్, గద్దె డిజైన్లలో తాము ఇచ్చిన సూచనలను ఎక్కడా ఉల్లంఘించకుండా ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలని, అప్పుడే రాష్ట్రవ్యాప్తంగా జెండాలన్నీ ఏకరూపంలో ఉండి పార్టీకి ఒకే విధమైన బ్రాండ్ ఇమేజ్ వస్తుందని కవిత స్పష్టం చేశారు. ఈ నెల 20 నుండి ప్రారంభం కానున్న జెండా పండుగను పురస్కరించుకుని రాష్ట్రంలోని ప్రతి పల్లె, ప్రతి పట్టణంలో కొత్త గద్దెల నిర్మాణాలు పూర్తి చేసి, పార్టీ జెండాలను ఎగురవేయాలని పార్టీ శ్రేణులను ఆదేశించారు. నెల రోజుల పాటు సాగే ఈ ఉత్సవాల్లో నాయకులు, కార్యకర్తలు నిరంతరం ప్రజల్లో ఉంటూ పార్టీ ఆశయాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలన్నారు. ఈ రాష్ట్ర జనరల్ బాడీ సమావేశంలో పార్టీ ముఖ్య నాయకులు, జిల్లాల అధ్యక్షులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు మరియు భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్వగృహ ప్లాట్లకు భారీ డిమాండ్!

- తొర్రూర్‌లో గజం భూమి రూ. 45,500
- బహదూర్‌పల్లిలో 40,500 పలికిన ధర
- ప్రభుత్వానికి రూ. 83 కోట్ల ఆదాయం



**హైదరాబాద్, మే 18:** రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న ఓపెన్ ప్లాట్ల కొనుగోలుకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఎలాంటి వివాదాలు లేని, అన్ని వసతులతో అభివృద్ధి చెందిన 85 ప్లాట్లకు సోమవారం బహిరంగ వేలం నిర్వహించారు. రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల పరిధిలోని తొర్రూర్, కుర్మల్ గూడ, బహదూర్‌పల్లి ప్రాంతాల్లోని ఈ ప్లాట్ల కోసం బిడ్డర్లు పోటీ పడ్డారు. పెద్దఅంబర్‌పేటలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ వేలం ద్వారా ప్రభుత్వానికి సుమారు రూ. 83 కోట్ల ఆదాయం వచ్చినట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వీ.పీ. గౌతమ్ తెలిపారు. ఫ్యూచర్ సిటీ, ఔటర్ రింగ్ రోడ్డు, ఆదిభట్ల ఐటీ కారిడార్‌కు సమీపంలో ఉన్న తొర్రూర్ లేఅవుట్‌లో ప్లాట్ల కోసం తీవ్ర పోటీ నెలకొంది. ఇక్కడ చదరపు గజం కనీస ధర రూ. 25 వేలుగా నిర్ణయించగా, వేలంలో గరిష్టంగా రూ. 45,500 ధర పలికింది. సగటున గజానికి రూ. 32,500 లభించింది. తమకు నచ్చిన ప్లాట్లను దక్కించుకోవడానికి బిడ్డర్లు దాదాపు ఇరవై సార్లు రేట్లు పెంచడం ఇక్కడి భూములకున్న డిమాండ్‌ను తెలియజేస్తోంది. విమానాశ్రయానికి దగ్గరగా ఉన్న కుర్మల్ గూడలో గజం కనీస ధర రూ. 20 వేలు కాగా, గరిష్టంగా రూ. 27,500 పలికింది. అలాగే ఔటర్ రింగ్ రోడ్డును ఆనుకుని ఉన్న బహదూర్‌పల్లిలో గజం కనీస ధర రూ. 27 వేలు కాగా, వేలంలో గరిష్టంగా రూ. 40,500 ధర లభించింది. ఇక్కడ సగటున రూ. 33,800 చొప్పున బిడ్డర్లు ప్లాట్లను కొనుగోలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పారదర్శకంగా జరిగిన ఈ వేలంలో దాదాపు 150 మంది బిడ్డర్లు పాల్గొన్నారు.

# క్రీడా వారోత్సవాలు ప్రారంభం!

ఎల్బీ స్టేడియంలో మంత్రుల జుంబా డాన్స్..

ఐదు కిలోమీటర్ల వాకథాన్ ప్రారంభం




**హైదరాబాద్, మే 18:** ప్రజా పాలనలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మే 18 నుండి 23 వరకు యువజన, క్రీడా వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియం టెన్నిస్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన ప్రత్యేక జుంబా కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, ఏపీ జితేందర్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, నాయకులు మల్ రెడ్డి రాంరెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ సోనీ బాలాదేవి ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ వారోత్సవాల సందర్భంగా ఎల్బీ స్టేడియం వేదికగా ఏర్పాటు చేసిన ఐదు కిలోమీటర్ల వాకథాన్‌ను మంత్రులు, ఉన్నతాధికారులు జెండా ఊపి ప్రారంభించారు. యువతలో క్రీడా స్ఫూర్తిని నింపేందుకు, ఆరోగ్యంపై అవగాహన పెంచేందుకు ఈ ప్రగతి ప్రణాళిక ఎంతో దోహదపడుతుందని వారు పేర్కొన్నారు. వారం రోజుల పాటు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో విభిన్న క్రీడా పోటీలు, యువజన చైతన్య కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తామని అధికారులు వెల్లడించారు.






# సిరిసిల్లలో బీఆర్ఎస్, బీజేపీ శ్రేణుల ఘర్షణ!

బండి సంజయ్ బర్తరఫ్‌కు డిమాండ్ చేస్తూ నిరసన

నిరసనకారులపై దాడికి దిగిన బీజేపీ కార్యకర్తలు

రంగంలోకి దిగిన ఎస్పీ మహేష్, డీఎస్పీ నాగేంద్రాచారి

**రాజన్న సిరిసిల్ల, మే 18:** సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సోమవారం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ పోక్సో కేసులో అరెస్ట్ అయిన నేపథ్యంలో, మంత్రిని వెంటనే పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ పాత బస్టాండ్ వద్ద బీఆర్ఎస్ నాయకులు నిరసనకు దిగారు. ఈ సమయంలో అక్కడకు చేరుకున్న బీజేపీ శ్రేణులు బీఆర్ఎస్ నేతలపై ఒక్కసారిగా దాడికి పాల్పడ్డారు. ఈ ఘర్షణలో పలువురు బీఆర్ఎస్ నాయకులకు గాయాలయ్యాయి. బీజేపీ శ్రేణులు దాడికి దిగినప్పటికీ బీఆర్ఎస్ నాయకులు తమ నిరసనను ఆపలేదు. బండి సంజయ్‌ను మంత్రివర్గం నుండి తొలగించాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ప్లకార్డులను ప్రదర్శించారు. ఇరువర్గాలు పోటాపోటీగా ఘర్షణకు దిగడంతో పాత బస్టాండ్ పరిసర ప్రాంతాలు ఉద్రిక్తంగా మారాయి. పరిస్థితి చేయిదాటిపోతుండటంతో జిల్లా ఎస్పీ మహేష్ బి గిత్తే, డీఎస్పీ నాగేంద్రాచారి తమ సిబ్బందితో కలిసి రంగంలోకి దిగారు. ఇరుపక్షాల నాయకులను అడ్డుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. గొడవకు దిగిన బీజేపీ నాయకులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులను సముదాయించి అక్కడి నుండి పంపించి వేశారు. ప్రస్తుతం అక్కడ శాంతిభద్రతలను పోలీసులు పర్యవేక్షిస్తున్నారు.

# కేంద్ర మంత్రివర్గంలోకి ఈటల?

తెలంగాణ బీజేపీలో జోరుగా ప్రచారం

ఢిల్లీ వేదికగా మారుతున్న సమీకరణాలు

బండి సంజయ్ కుమారుడి వివాదం నేపథ్యంలో చర్చ

**న్యూఢిల్లీ / హైదరాబాద్, మే 18:** తెలంగాణ రాజకీయాల్లో సంచలనంగా మారిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ పోక్సో కేసు వ్యవహారం ఇప్పుడు ఢిల్లీ రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. రాష్ట్రంలో మారుతున్న రాజకీయ పరిణామాలు, కేంద్ర మంత్రివర్గంలో మార్పులపై ఊహాగానాల మధ్య తెలంగాణ నేతలకు కీలక బాధ్యతలు అప్పగించే అవకాశాలపై జోరుగా ప్రచారం జరుగుతోంది. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకోనున్న నేపథ్యంలో కేంద్ర మంత్రివర్గంలో భారీ మార్పులు జరిగే అవకాశమున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. రాష్ట్రాల వారీగా రాజకీయ సమీకరణాలు, సామాజిక వర్గాల ప్రాతినిధ్యం, రాబోయే ఎన్నికల వ్యూహాలను దృష్టిలో పెట్టుకుని కొన్ని కీలక మార్పులు ఉండొచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో తెలంగాణకు చెందిన పలువురు నాయకుల పేర్లు పరిశీలనలోకి వస్తుండగా, ముఖ్యంగా మల్కాజ్‌గిరి ఎంపీ, తెలంగాణ ఉద్యమకారుడిగా గుర్తింపు పొందిన ఈటల రాజేందర్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది.





# సంక్షోభాల సృష్టికర్తలు మన పాలకులు!

## కాన్వాయ్‌లలో కార్లు తగ్గించడం కాదు..

## అప్పుల ఊబి నుంచి రాష్ట్రాలను రక్షించడం ముఖ్యం!

## అప్పులతో సంక్షేమం.. ఆర్భాటాలతో పాలన..

## దేశ ఆర్థిక వ్యవస్థకు పెరుగుతున్న ముప్పు

ప్రపంచంలో ఎప్పుడూ ఏదో ఓ సంక్షోభం వస్తూనే ఉంటుంది. ఇరాన్ సంక్షోభం ఇంకా ముగియలేదు. ట్రంప్ మరోమారు రంకెలు వేస్తున్నారు. బాంబులు వేస్తామని బెదిరిస్తున్నారు. ఇదే జరిగితే మరింత ఆర్థిక సంక్షోభం తప్పేలా లేదు. ఈ సంక్షోభాలకు భయపడి సంసారం చేద్దామ లేక ఇల్లు చక్కబెట్టుకుందామా అన్నది పాలకులు ఆలోచన చేయాలి. ముఖ్యంగా ప్రధాని మోడీ ఆర్థిక చర్యలు దిద్దుబాటు లాగా లేవు. కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన వేళ కేవలం కాన్వాయ్‌లో కార్లు తగ్గించడంతో సరిపెట్టేస్తున్నారు. దేశ ఆర్థిక వ్యవస్త చిన్నాభిన్నం అవుతోంది. ప్రజల్లో కొనుగోలు శక్తి తగ్గుతోంది. సంక్షేమ పథకాల పేరిట ప్రభుత్వాలు అప్పులు చేస్తున్నాయి. వేలకోట్లు వడ్డీలు కట్టడానికే వెచ్చిస్తున్నాయి. ఇందులో తెలుగు రాష్ట్రాలు ముందు న్నాయి. అప్పులు చేసి మరీ పథకాలు అమలు చేస్తున్నారు. ఇంట్లోకి వెళ్లి వండిపెట్టడమే తరువాయి అన్నట్లుగా పథకాలను వండి వారు-స్తున్నారు. దీంతో ప్రభుత్వాన్ని నడపడానికి నిత్యం అప్పులు చేయడం, ఉన్న భూములను అమ్మేయడం అలవాటు చేసుకున్నారు. ఓట్ల కోసం నానాగడ్డి కరుస్తారనడానికి ఈ పథకాలే నిదర్శనం. ఇకపోతే పొదుపు విషయంలో ప్రజాప్రతినిధులకు లెక్కేలేదు. గతంలో మంత్రులు, ముఖ్యమంత్రులు సాధారణ ప్రజల్లాగా విమానాల్లో వెళ్లేవారు. ఇప్పుడు ఏకంగా ప్రత్యేక విమానాలను వాడుతున్నారు. హెలికాప్టర్లకు కొదవే లేదు. మంత్రులు, ఇతర ప్రముఖులు కూడా చీటికీ మాటికీ ప్రత్యేక విమానాలు, హెలికాప్టర్లు వాడుతున్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు అత్యవసరంగా వెళ్లడానికి వేరు. కానీ ప్రతి కార్యక్రమం కోసం విమానాలు, హెలికాప్టర్లు విచ్చలవిడిగా వాడేస్తున్నారు. చంద్రబాబు అయితే స్వచ్ఛాంధ్ర, పెన్షన్ల పంపిణీకి చేస్తున్న ఆర్భాటం అంతాఇంతాకాదు. వీటికి వెళ్లకుండా కార్యక్రమాలను నడిపించేవచ్చు. కానీ ఆయన నిత్యం ఏదో ఒక కార్యక్రమంతో ప్రజల్లో ఉండడం కోసం నానా తంటాలు పడుతుంటారు. ముందుగా ఏర్పాటు చేసుకున్న కార్యక్రమాలకు ప్రత్యేక విమానాల అవసరం ఏమిటన్నది బాబు చెప్పాలి. అంతెందుకూ, ఇదివరకు మంత్రులు రైళ్లలో ప్రయాణించేవారు. ఇప్పుడు ఎంతమంది రైలెక్కుతున్నారన్నది తెలియదు. అయితే విమానం లేదా భారీ కాన్వాయ్‌లు వేసుకొని ఊరేగుతున్నారు. మంత్రులు, అధికారులు వారాంతం వచ్చిందంటే చాలు హైదరాబాద్‌లో వాలిపోతున్నారు. ముఖ్యమంత్రి, మాజీ ముఖ్యమంత్రి కోసం అమరావతి, హైదరాబాద్, బెంగళూరులో ప్రత్యేకంగా భద్రతా సిబ్బంది ఉంటున్నారు. ఇలా చెప్పుకొంటూ పోతే ప్రభుత్వాలలో దుబారాకు అంతే ఉండదు. ఒకప్పుడు ప్రధానమంత్రి, ముఖ్యమంత్రుల కాన్వాయ్‌లలో ఇన్ని వాహనాలు ఉండేవి కావు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి సైతం మూడు వాహనాలే వినియోగించేవారు. వారి భద్రతను నలుగురైదుగురు సిబ్బంది మాత్రమే చూసేవారు. ఇప్పుడు పదుల సంఖ్యలో వాహనాలను కాన్వాయ్‌లో చేర్చారు. ముఖ్యమంత్రుల బహిరంగ సభలు, సమావేశాలకు వందలమంది పోలీసులను నియమిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నక్సలైట్ల ప్రభావం అధికంగా ఉన్నప్పుడు మంత్రులు, ముఖ్యమంత్రులకు అదనపు భద్రత అవసరమయ్యేది. ఇప్పుడు నక్సలైట్లు దాదాపుగా అంతరించిపోయారని కేంద్రమే ప్రకటించింది. అయినా భద్రతను కుదించడం లేదు. ఈ విషయంలో చంద్రబాబు ఆదర్శమని చెప్పాల్సిందే. హంగూ ఆర్భాటంలో ఆయన ముందుంటారు. ఆయిల్ సంక్షోభంతో ప్రధాని మోదీ పిలుపుతో దేశవ్యాప్తంగా ముఖ్యమంత్రులు తాము వినియోగించే వాహనాల సంఖ్యను తగ్గించుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఓ అడుగు ముందుకేసి మరింత జాగ్రత్తలు చేపట్టారు. మహానాడును సైతం వర్చువల్‌గా నిర్వహించాలని నిర్ణయించారు. ఏకంగా మంత్రివర్గ సమావేశంలోనే పొదుపు చర్యలపై చర్చలు జరిపారు. అయితే తమ కార్యక్రమాల్లో పొదుపు పాటించి, దుబారా ఖర్చులు తగ్గించుకోగలిగితే మంచిదే. కానీ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలలో దుబారా సర్వసాధారణం అయింది. ముఖ్యమంత్రులు పాల్గొనే కార్యక్రమాలకు హంగూ ఆర్భాటం పెరిగింది. దుబారా అని ఆలోచించకుండా మన సొమ్ము కాదు కదా అని మంచినీళ్ల ప్రాయంగా ఖర్చు చేస్తుంటారు. ఖర్చుల నియంత్రణ, పొదుపు అనేది ప్రజలకు ఆదర్శంగా ఉండాలన్నది కనిపించడం లేదు. మితిమీరిన ఖర్చులతో రాష్ట్రాలను అప్పుల ఊబిలోకి నెట్టేసారు. జగన్ ఉండగా అంతకు మించి అన్నట్లుగా డబ్బులను మంచినీళ్ల ప్రాయంగా ఖర్చు చేశారు. విశాఖలో అత్యాధునిక గెస్ట్ హౌజ్‌లు కట్టుకున్నారు. ఇప్పటికీ ఎక్కడికి వెళ్లినా మందీ మార్బలంతో పాటు, భారీ కాన్వాయ్‌లతో వెళుతుంటారు. ఇలా అప్పులు కావడానికి పాలకులు తీరు కారణం. ప్రజల జీవన ప్రమాణాలు పెరిగినా సంక్షేమ పథకాలతో వారిని నిర్వీర్యులను చేస్తున్నారు. రూపాయికే కిలో బియ్యం, ఉచిత సిలిండర్, ఉచిత కరెంట్, ఉచితంగా చీరలువంటి సంక్షేమ పథకాల అవసరమా అని ఆలోచించడం లేదు. ఉత్పాదక సాధించి, ప్రజలను స్వయం సమృద్ధి వైపు నడిపించాల్సింది పోయి అనుత్పాదక వ్యయం వైపు దేశంతో పాటు ప్రజలను మళ్లించడం ఏ తరహా అభివృద్ధి అన్నది పాలకులు చెప్పాలి. ప్రభుత్వాలు లక్షల కోట్ల అప్పులు చేస్తూ సంక్షేమ పథకాలు అమలు చేయడం ఎందుకో ప్రజలకు జవాబు ఇవ్వాలి. బడా పారిశ్రామికవేత్తలు అప్పులు ఎగవేస్తున్నా ఎందుకు చోద్యం చూస్తున్నారో చెప్పాలి. ఇవన్నీ సవరించుకో నంతవరకు దేశంలో అప్పులమీద ఆధారపడాల్సిందే. పాలకుల తీరు మారాలి. ప్రజలతీరూ మారాలి. కాన్వాయ్‌లలో కార్లు తగ్గించడం కాదు అని గుర్తించాలి. అప్పలుఉ చేయడం, దేశాన్ని అధోగతి పాలు చేయకుండా పాలన చేయడం అలవాటు చేసుకుంటే మంచిది.

# కేరళం సీఎంగా సతీశన్ ప్రమాణం

**ఆయనతోపాటు 20 మంది మంత్రులకు ఛాన్స్**

**హాజరైన రాహుల్, ప్రియాంక, ఖర్గే, రేవంత్ రెడ్డి**





**తిరువనంతపురం, మే 18:** కేరళ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వీడీ సతీశన్ కేరళం రాష్ట్ర కొత్త ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం ఉదయం గవర్నర్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే.. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. కాగా, మొత్తం 20 మందితో మంత్రివర్గం ఏర్పాటు అయింది. సతీశన్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయగా.. 20 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. 20 మందిలో 14 మంది తొలిసారిగా బాధ్యతలు చేపట్టినవారే కావడం గమనార్హం. సామాజిక, ప్రాంతీయ, మిత్రపక్షాల సమీకరణాలను పరిగణనలోకి తీసుకుని కాంగ్రెస్ అధిష్ఠానం మంత్రులను ఎంపిక చేసింది. దీంతో దశాబ్దం తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) తిరిగి అధికారంలోకి వచ్చింది. కేరళ ప్రతిపక్ష నాయకుడిగా బాధ్యతలు చేపట్టిన మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, సిద్ధరామయ్య, సుఖ్వీందర్ సింగ్ సుఖు, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తదితరులు హాజరయ్యారు. పార్టీ వర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారం.. సీఎం సతీశన్ ఆర్థిక, ఓడరేవుల శాఖలతో సహా పలు కీలక పోర్ట్‌ఫోలియోలను తనవద్దే ఉంచుకునే అవకాశం ఉంది. సీనియర్ కాంగ్రెస్ నేత రమేష్ చెన్నితాలకు విజిలెన్స్‌తో పాటు హోం శాఖ బాధ్యతలను అప్పగించనున్నట్లు తెలుస్తోంది. కేరళ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సన్నీ జోసెఫ్‌కు రెవెన్యూశాఖ కేటాయించాలని యూడీఎఫ్ నిర్ణయం తీసుకుంది. ఇకపోతే కొచ్చికి సమీపంలోని నెట్టూర్‌లో 1964లో వీడీ సతీశన్ జన్మించారు. వృత్తిరీత్యా న్యాయవాది అయిన ఆయన.. సామాజిక కార్యకర్తగానూ పేరొందారు. కేరళ విద్యార్థి విభాగంతో ఆయన రాజకీయ ప్రస్థానం మొదలైంది. తర్వాత యూత్ కాంగ్రెస్‌లో చేరి, పార్టీని బలంగా ముందుకు తీసుకెళ్లారు. తర్వాత కాంగ్రెస్‌లో ఒక్కో మెట్టూ ఎక్కుతూ ప్రజానేతగా, సంస్కరణాభిలాషిగా ఎదిగారు. 2001లో పరావుర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బరిలో నిలిచి, వరుసగా ఆరుసార్లు విజయం సాధించారు. 2021లో ఆయన కెరీర్ మలుపు తిరిగింది. ఆ ఎన్నికల్లో ఎల్‌డీఎఫ్ గెలుపొందగా.. యూడీఎఫ్ విపక్షానికే పరిమితమైంది. కానీ ఆయన అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా నియమితులయ్యారు. అవినీతి, గోల్డ్ స్మగ్లింగ్ వివాదం, శాంతి భద్రతలు, పరిపాలనాపరమైన వైఫల్యాలను ఎత్తిచూపి పినరయి విజయన్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టారు. అందుకే ప్రస్తుతం సీఎం ఎంపిక కోసం ఏఐసీసీ పరిశీలకులు జరిపిన అభిప్రాయ సేకరణలో కూడా ఎమ్మెల్యేలు, ప్రజలు సతీశన్‌కే మద్దతు ఇచ్చారు.

# మరింత పటిష్టంగా భారత్-నార్వే బంధం

- ఇంధనం, ఆవిష్కరణలు, సాంకేతికతలలో సహకారం
- ఇరు దేశాల మధ్య గ్రీన్ స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ ఏర్పాటు
- నార్వే పర్యటనలో ప్రధాని మోడీ కీలక ప్రకటన



**న్యూఢిల్లీ, మే 18:** భారత్-నార్వే సంబంధాలను కొత్త స్థాయికి తీసుకెళ్లే దిశగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక ప్రకటన చేశారు. ఇరు దేశాల మధ్య గ్రీన్ స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. అలాగే స్వచ్ఛ ఇంధనం, సముద్ర రంగం, ఆవిష్కరణలు, సాంకేతికతలలో సహకారాన్ని మరింత బలోపేతం చేయనున్నట్లు ప్రధాని తెలిపారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్‌కు మద్దతుగా నిలిచినందుకు నార్వే ప్రభుత్వానికి మోదీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా రాజకీయ, ఆర్థిక అస్థిరత పెరుగుతున్న సమయంలో భారత్-యూరప్ భాగస్వామ్యం మరింత కీలకమైందని మోదీ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం, అంతర్జాతీయ నిబంధనలు, శాంతి భద్రతల పరిరక్షణలో భారత్, యూరప్ కలిసి పనిచేస్తున్నాయని తెలిపారు. భారత్-ఈయూ మధ్య చారిత్రక ఒప్పందంతో భారత్, నార్వేకు అనేక ప్రయోజనాలున్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. భారత్-నార్వే మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం కుదిరిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇస్రో-నార్వే స్పేస్ ఏజెన్సీ మధ్య ఒప్పందం కుదిరిందని, పరిశోధనల కోసం నార్వే సహాయం తీసుకుంటామని పేర్కొన్నారు. నార్వే సంస్థలు భారతదేశంలో గ్రీన్ ఎనర్జీ, షిప్పింగ్, బ్లూ ఎకానమీ, డిజిటల్ టెక్నాలజీ రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని మోదీ ఆహ్వానించారు. అలాగే ఆర్కిటిక్ పరిశోధనలు, అంతరిక్ష రంగం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సెమీకండక్టర్లు, డిజిటల్ ఇన్నోవేషన్ వంటి రంగాల్లో కూడా భారత్-నార్వే కలిసి పనిచేయనున్నట్లు తెలిపారు.

# నక్సల్స్ రహిత రాష్ట్రంగా తెలంగాణ

- కృషి చేసిన పోలీస్ అధికారులను సన్మానం
- వారి కృషి అసామాన్యమని అమిత్‌షా కితాబు



**రాయ్‌పూర్, మే 18:** దేశాన్ని పట్టి పీడిస్తున్న వామపక్ష తీవ్రవాదానికి ముగింపు పలికి, నక్సలిజం రహిత సమాజాన్ని నిర్మించడమే కేంద్ర ప్రభుత్వ సంకల్పమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పునరుద్ఘాటించారు. ఛత్తీస్‌గడ్ లోని జగదల్పూర్‌లో సోమవారం తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలలో మావోయిస్టుల నిర్మూలనకు కృషి చేసిన పోలీస్ అధికారులను ఆయన సన్మానించారు .తెలంగాణ రాష్ట్రంలో నక్సలిజాన్ని సమూలంగా అణచివేసి, రాష్ట్రాన్ని నక్సల్స్ రహితంగా తీర్చిదిద్దడంలో ప్రతిభ కనబరిచిన తెలంగాణ పోలీస్ ఉన్నతాధికారులను సన్మానించారు. ప్రత్యేకించి తెలంగాణ రాష్ట్రంను ప్రస్తావించారు. ఈ సందర్భంగా తెలంగాణ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సివి ఆనంద్, రాష్ట్ర భద్రతా సలహాదారు,మాజీ డిజిపి బి.శివధర్ రెడ్డి, డీజీపీ ఆపరేషన్స్ (ఆక్టోపస్ / గ్రేహౌండ్స్) అనిల్ కుమార్, మల్కాజ్‌గిరి కమిషనర్ / మాజీ ఎస్‌ఐబీ ఐజీపీ సుమతితో పాటు ఆమె నేతృత్వంలోని ఎస్‌ఐబీ బృందాన్ని అమిత్ షా సత్కరించి, వారి విశేష సేవలను అభినందించారు. ఈ సందర్భంగా హోం మంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. జనవరి 2024లో ఒక అంతర్గత సమావేశంలో 31 మార్చి 2026 నాటికి దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా తుడిచిపెట్టాలని తాము కాలపరిమితిని నిర్దేశిరచుకున్నట్లు వెల్లడించారు.మేం ఈ నిర్ణయం తీసుకున్నప్పుడు చాలామంది ప్రైవేట్ చర్చల్లో ఇది సాధ్యం కాదంటూ సందేహాలు వ్యక్తం చేశారు. కానీ మేం స్పష్టమైన ప్రణాళికతో, పక్కా వ్యూహంతో ముందుకు సాగాం. మా దంతేశ్వరి అమ్మవారి ఆశీస్సులతో ఈ రోజు బస్తర్ ప్రాంతాన్ని నక్సల్స్ రహితంగా ప్రకటించడం ఎంతో సంతోషంగా ఉందని అమిత్ షా పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్ ఇప్పుడు నక్సలిజం మహమ్మారి నుంచి విముక్తి పొందిందని, వామపక్ష తీవ్రవాదానికి వ్యతిరేకంగా సాగిన సుదీర్ఘ పోరాటంలో ఇదొక చారిత్రాత్మక మైలురాయి అని ఆయన కొనియాడారు. 1970వ దశకం నుంచి 31 మార్చి 2026 వరకు దాదాపు మూడు తరాల పాటు దేశ ప్రజలు నక్సలిజం అనే ఒక పీడకలను చవిచూశారని అమిత్ షా ఆవేదన వ్యక్తం చేశారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో తీవ్ర రక్తపాతం, అభివృద్ధి నిలిచిపోవడం, య-ువత భవిష్యత్తు అంధకారమవ్వడం వంటి పరిస్థితులు ఉండేవని గుర్తుచేశారు. నక్సలిజం నిర్మూలన పోరాటంలో దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాలకు చెందిన జవాన్లు ప్రాణత్యాగం చేశారని, వారి బలిదానాల వల్లే నేడు ఈ విజయం సాధ్యమైందని హోం మంత్రి అన్నారు. క్సలిజం కేవలం ఒక ప్రాంతానికి పరిమితమైన సమస్య కాదని, తన సొంత రాష్ట్రమైన గుజరాత్‌తో పాటు దేశవ్యాప్తంగా దీనిపై ఆందోళన ఉండేదన్నారు.క జీవిత కాలంలో సాధించలేమనుకున్న అసాధ్యమైన లక్ష్యాన్ని, భద్రతా దళాల సమన్వయం మరియు పట్టుదలతో సాకారం చేశామని అమిత్ షా హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, భద్రతా దళాల ప్రతినిధులు పాల్గొన్నారు.


## ట్రక్కును ఢీకొన్న కంటెయినర్ పదిమంది మృతి

**మహారాష్ట్రలో ఘోర ప్రమాదం**

**ముంబై, మే 18:** మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లాలో రోడ్డు ప్రమాదం జరిగింది. పెళ్లిఒ బృందందతో వెళుతున్న ట్రక్కును కంటెయినర్ ఢీకొనడంతో పదిమంది దుర్మరణం చెందారు. ముంబై - అహ్మదాబాద్ జాతీయ రహదారిపై జరిగిన ఈ ప్రమాదంలో 10 మందికిపైగా మృతిచెందగా, మరో 25 మందికి పైగా గాయపడ్డారు. సమాచారం అందగానే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెళ్లి బృందంతో వెళ్తున్న ట్రక్కును వేగంగా వచ్చిన కంటైనర్ ఢీకొట్టింది. కంటైనర్ ఢీకొన్న తీవ్రతకు వాహనం పూర్తిగా దెబ్బతింది. ఘటనాస్థలిలోనే పదిమందికి పైగా మృతిచెందారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారిని సమీప ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. క్షతగాత్రుల్లో పలువురి పరిస్థితి విషమంగా ఉందని.. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని వైద్యులు తెలిపారు. ఈ ప్రమాదంతో హైవేపై ట్రాఫిక్‌కు అంతరాయం కలగగా, పోలీసులు వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. అతివేగం,



నిర్లక్ష్య డ్రైవింగ్ కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ విషాద ఘటనతో పెళ్లి ఇంట్లో తీవ్ర విషాదం నెలకొంది.



# బుల్లెట్ వేగంతో రాయల్ ఎన్‌ఫీల్డ్ ఫ్యాక్టరీ

## సీఎం చంద్రబాబుతో ప్రతినిధుల భేటీ

**అమరావతి, మే 18:** ఆంధ్రప్రదేశ్‌లో ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ రాయల్ ఎన్‌ఫీల్డ్ భారీ పెట్టుబడితో తయారీ యూనిట్ ఏర్పాటు చేయనుంది. ఈ నేపథ్యంలో ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థ ప్రతినిధులు సోమవారం రాష్ట్ర సచివాలయంలో సమావేశమయ్యారు. రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థ సీఈఓ గోవింద రాజన్ నేతృత్వంలోని బృందం సీఎంను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా బుల్లెట్ మోటార్ సైకిల్ మోడళ్లను సీఎం పరిశీలించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. బుల్లెట్ మోటార్ సైకిల్ తయారీ యూనిట్‌కు ఏపీ ప్రభుత్వం ప్రోత్సాహకాలను కల్పించటంపై ఆ సంస్థ ప్రతినిధులు సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. తిరుపతి జిల్లా సత్యవేడు మండలం రాళ్లకుప్పం, వానల్లూరు గ్రామాల వద్ద రూ.2500 కోట్ల పెట్టుబడితో రాయల్ ఎన్‌ఫీల్డ్ తయారీ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్లు కంపెనీ ప్రతినిధులు వెల్లడించారు. ఈ ప్రాజెక్టును వేగంగా పూర్తి చేసి 18 నెలల్లోనే ఉత్పత్తి ప్రారంభించాలని సూచించారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణలో ప్రభుత్వం వేగంగా ముందుకెళ్తోందని సీఎం పేర్కొన్నారు. రాయల్ ఎన్‌ఫీల్డ్ వంటి అంతర్జాతీయ స్థాయి సంస్థలు ఏపీలో పెట్టుబడులు పెట్టడం రాష్ట్ర అభివృద్ధికి కీలకమని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ తయారీ యూనిట్‌లో అత్యాధునిక సదుపాయాలు ఏర్పాటు చేయనున్నట్లు ఆ కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ప్రధాన తయారీ ప్లాంట్‌తో పాటు టెస్టింగ్ ట్రాక్, పరిశోధనా కేంద్రం, వెండార్ పార్క్ ఎకోసిస్టమ్ కూడా నిర్మించనున్నట్లు వెల్లడించారు. దీంతో రాష్ట్రంలో ఆటోమొబైల్ రంగానికి కొత్త ఊపు రానుందని భావిస్తున్నారు. ఈ ప్లాంట్ ద్వారా ఏడాదికి సుమారు 9 లక్షల మోటార్ సైకిళ్లు ఉత్పత్తి చేయనున్నట్లు ఆ కంపెనీ ప్రతినిధులు తెలిపారు. అలాగే ఈ యూనిట్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 15 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. రాయల్ ఎన్‌ఫీల్డ్ త్వరలో 'ఫ్లైయింగ్ ఫ్లీ అ6' పేరుతో ఎలక్ట్రిక్ వేరియంట్ మోడల్‌ను కూడా మార్కెట్‌లోకి తీసుకురానున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు సీఎంకు వివరించారు. భవిష్యత్తులో ఎలక్ట్రిక్ వాహనాల తయారీలో కూడా ఏపీ కీలక కేంద్రంగా మారే అవకాశం ఉందని ప్రతినిధులు పేర్కొన్నారు.

# న్యూక్లియర్ ఆర్థిక వ్యవస్థలో ఏపీ అగ్రగామి

## న్యూక్లియర్ ఎనర్జీ పరిశ్రమ కొత్త దశ

## యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్ షిప్ ఫోరంలో లోకేశ్

**న్యూఢిల్లీ, మే 18:** ఏపీని భవిష్యత్తు న్యూక్లియర్ ఆర్థికవ్యవస్థలో నమ్మకమైన గ్లోబల్ భాగస్వామిగా నిలబెట్టడం తమ ధ్యేయమని ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. ప్రపంచ న్యూక్లియర్ ఎనర్జీ పరిశ్రమ కొత్త దశలోకి ప్రవేశిస్తున్ననేపథ్యంలో ఇది కీలకంగా మారగలదని పేర్కొన్నారు. న్యూక్లియర్ ఎనర్జీ ఇనిస్టిట్యూట్, యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్ షిప్ ఫోరం సంయుక్తంగా యూఎస్ ఎగ్జిక్యూటివ్ న్యూక్లియర్ మిషన్ టు ఇండియా పేరిట యూఎస్ న్యూక్లియర్ ప్రతినిధులతో సోమవారం ఢిల్లీలో నిర్వహించిన సదస్సుకు మంత్రి నారా లోకేశ్ అతిథిగా హాజరై ప్రసంగించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ ఎకోసిస్టమ్ ఉందని తెలిపారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను అమలు చేస్తున్నామని అన్నారు. పారిశ్రామికీకరణలో వేగం, అమలు అత్యంత ముఖ్యమని చెప్పుకొచ్చారు. ఇందులో న్యూక్లియర్ ఎకోసిస్టమ్ ప్రముఖ పాత్ర వహించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వెల్లడించారు. స్మాల్ మాడ్యులర్ రియాక్టర్లు, తదుపరితరం రియాక్టర్ సిస్టమ్స్ వంటి ఆధునిక న్యూక్లియర్ సాంకేతికతలు, మాడ్యులర్ తయారీ, సప్లయ్ చైన్ పంపిణీ, స్కేలబుల్ వినియోగం నమూనాలకి విస్తృత అవకాశాలు ఉన్నాయని మంత్రి లోకేశ్ వివరించారు. భారత్‌లో ఇంజనీరింగ్ ప్రతిభ, తయారీరంగంలో విస్తృతి, ఖర్చు విషయంలో పోటీతత్వం ఉన్నాయని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలు పారిశ్రామిక ఇన్‌ఫ్రా, పోర్ట్స్, లాజిస్టిక్స్ కనెక్టివిటీ, అమలు సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయని చెప్పుకొచ్చారు. ఇది భారతదేశానికి, ఆంధ్రప్రదేశ్‌కు ఒక చరిత్రాత్మక అవకాశాన్ని కల్పిస్తుందని తెలిపారు. ఏపీకి అనేక అదనపు ప్రయోజనాలు ఉన్నాయని లోకేశ్ తెలిపారు. తమకు సువిశాలమైన తీరప్రాంతం, శక్తివంతమైన పోర్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, విస్తతమైన పారిశ్రామిక కారిడార్లు, ప్రతిష్మాత్మకమైన పవర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఉందని చెప్పుకొచ్చారు. పర్యావరణ వ్యవస్థ ఆలోచనా విధానం ముఖ్యమని అన్నారు. సాంకేతిక సహకారాలు, తయారీ భాగస్వామ్యాలు, సప్లై చైన్ అభివృద్ధి, ఇంజనీరింగ్ ఎకోసిస్టమ్స్, రీసెర్చ్ భాగస్వామ్యాలు, స్కిల్లింగ్, వర్క్‌ఫోర్స్ అభివృద్ధి, పారిశ్రామిక ప్రమాణాలు, భవిష్యత్తు సాంకేతికల అమలుకు విశ్వసనీయ గ్లోబల్ భాగస్వాములతో పనిచేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి యూఎస్ ? ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్ షిప్ ఫోరం మేనేజింగ్ డైరెక్టర్ నివేదిత మెహ్రా స్వాగతం పలుకగా, న్యూక్లియర్ ఎనర్జీ ఇన్‌స్టిట్యూట్ ప్రెసిడెంట్, సీఈవో మారియా కోర్స్నిక్ హాజరయ్యారు.




# గడువులోగా ప్రాజెక్టులు

- ఇరిగేషన్ క్యాలెండర్ ప్రకారం ప్రాజెక్టు పనులు
- పోలవరం ఎడమ కాల్వ లింక్ పై అధ్యయనం
- 2027 ఏప్రిల్ నాటికి నిర్వాసితుల తరలింపు
- జలధార-జలహారతి పనులకు ప్రాధాన్యత
- సీజన్ ఆలస్యం కాకుండా నీటి విడుదల
- మరో 11 ప్రాజెక్టులకు ప్రాధాన్యత
- జలవనరుల శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి

**అమరావతి, మే 18:** రాష్ట్రంలో సాగునీటి రంగమే పరమావధిగా ఇరిగేషన్ క్యాలెండర్ ప్రకారం ప్రాజెక్టుల నిర్మాణం, శంకుస్థాపనలు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. నిర్ణీత కాలవ్యవధిలో, ప్రాధాన్యతా క్రమంలో ఆయా ప్రాజెక్టులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో పోలవరం సహా రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై సీఎం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఇటీవల జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో 25 ఇరిగేషన్ ప్రాజెక్టులతో ఇరిగేషన్ క్యాలెండర్‌ను ప్రకటించిన విషయాన్ని గుర్తు చేస్తూ, వాటితో పాటు ప్రాధాన్యత కలిగిన మరో 11 ప్రాజెక్టుల పనులను కూడా ఇందులో చేర్చాలని స్పష్టం చేశారు. ఈ మొత్తం 36 ప్రాధాన్యతా ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, సివిల్ వర్క్స్ వంటి వాటికి ఎలాంటి నిధుల కొరత లేకుండా చూడాలని ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు.



### గడువులోగా పోలవరం పనులు:

సమీక్షా సమావేశం సందర్భంగా పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. పోలవరంలో సివిల్ వర్క్స్ 88 శాతం, భూసేకరణ 93 శాతం, నిర్వాసితుల తరలింపు 45 శాతం పూర్తయ్యాయని తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 2వ తేదీ నాటికి డయాఫ్రాం వాల్ నిర్మాణం విజయవంతంగా ముగియగా, ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్ (జుజ=ఖీ) గ్యాప్ 1, 2 పనులు 2027 మార్చి 31 నాటికి పూర్తి అవుతాయని ఇరిగేషన్ అధికారులు వెల్లడించారు. దీనిపై సీఎం చంద్రబాబు స్పందిస్తూ, ప్రతి నెలా తానే స్వయంగా పోలవరం పనుల పురోగతిపై సమీక్షిస్తానని, గ్యాప్ 1, 2 పనులు చెప్పిన సమయానికి పూర్తి కావాల్సిందేనని తేల్చి చెప్పారు. ఈ ఏడాది జూలై నెల నుంచే పురుషోత్తపట్నం ఎత్తిపోతల ద్వారా ఎడమ కాలువ నుంచి నీరు అందించాలని, మేఘాద్రిగడ్డకు పోలవరం జలాలు తీసుకువెళ్లాక అక్కడి నుంచి వంశధార-నాగావళి-చంపావతి వరకు నీరు వెళ్లేలా 'పోలవరం ఎడమ కాల్వ-చంపావతి లింక్' ప్రాజెక్ట్ వ్యయంపై తక్షణమే అధ్యయనం చేయాలన్నారు. పోలవరం ఆర్ అండ్ ఆర్ నిర్వాసితులకు పరిహారం అందించే విషయంలో చట్టప్రకారం ముందుకు వెళ్లాలని, ఎలాంటి వివాదాలు లేకుండా 2027 ఏప్రిల్ నాటికి నిర్వాసితుల తరలింపును పూర్తిగా ముగించాలని ఆదేశించారు. అలాగే పోలవరం స్పిల్ వే దిగువన బెస్ట్ టూరిజం ప్రాంతంగా నిలిచేలా ఒక 'ఐకానిక్ బ్రిడ్జి' నిర్మాణం చేపట్టాలని సూచించారు.

### వెలిగొండ, రాయలసీమ ప్రాజెక్టులకు హై ప్రయార్టీ

వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ జూలై నాటికి పూర్తి కావాలని సీఎం స్పష్టం చేశారు. హెడ్ వర్క్స్, కాలువలు, డిస్ట్రిబ్యూటరీలు, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, భూసేకరణ పనుల కోసం ఇంకా రూ.2,019 కోట్లు అవసరమని అధికారులు తెలపగా, టీబీఎంను తొలగించి అడ్డంకులు లేకుండా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. హంద్రినీవా ఫేజ్-1 లో భాగంగా కాలువల వెడల్పు 92 శాతం, ఫేజ్-2 కుప్పం-పుంగనూరు కాలువల లైనింగ్ 85 శాతం పనులు పూర్తయ్యాయని, మల్యాల లిఫ్ట్ నుంచి రాయలసీమ ప్రాంతానికి తొలిసారిగా 52 టీఎంసీల నీటిని తరలించి మొత్తంగా 432 చెరువులను పూర్తిగా నింపామని అధికారులు వివరించారు. దీనిపై సీఎం మాట్లాడుతూ, మైదుకూరు, మడకశిర లాంటి చివరి ప్రాంతాలకు నీళ్లు వెళ్లాలని, చింతలపూడి ఎత్తిపోతల ప్రాజెక్టు కాలువ పనులు వచ్చే ఏడాది జూలై నాటికి, వరికెపుడిశెలను కూడా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. నల్లమల సాగర్ విషయమై, అలాగే గోదావరి-కావేరి అనుసంధానం పైనా కేంద్రంతో సంప్రదింపులు జరుపుతామన్నారు.

### గత పాలకుల నిర్వాకంపై ముఖ్యమంత్రి ఆగ్రహం:

ఇరిగేషన్ రివ్యూలో భాగంగా లిఫ్ట్ స్కీంల పనితీరు మీద ముఖ్యమంత్రి సమీక్షించారు. 2014-19 మధ్య కాలంలో నాటి ప్రభుత్వం లిఫ్ట్ స్కీంలకు అవసరమైన కేటాయింపులు జరిపి మరమ్మత్తులకు తగినన్ని నిధులు వెచ్చించగా, 2019-24 మధ్య గత ఐదేళ్ల కాలంలో లిఫ్ట్ స్కీంలకు ఎలాంటి బడ్జెట్ కేటాయింపులు జరపలేదని అధికారులు వివరించారు. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా సుమారు 362 లిఫ్ట్ స్కీంలు పూర్తిగా నిర్వీర్యం అయ్యాయని అధికారులు వెల్లడించగా, గత పాలకుల నిర్వాకంపై ముఖ్యమంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

### ఖరీఫ్‌కు ముందస్తు ప్రణాళిక - జలధారకు ప్రాధాన్యత

ఎల్ నినో లాంటి పరిస్థితుల నేపథ్యంలో ముందస్తు అంచనాలను సిద్ధం చేసుకుంటూ పంటలు వేసేలా రైతులను సమాయత్తం చేయాలని సీఎం చెప్పారు. ఈసారి రెయిన్ ఫాల్ మైనస్ 3 శాతంగా ఉందని, భూగర్భ నీటి నిల్వలు 9.49 మీటర్లుగా ఉండి గతేడాదితో పోలిస్తే 0.5 మీటర్లు ఎక్కువగా ఉన్నాయన్నారు. ప్రస్తుత నీటి వనరుల్ని నింపేలా స్ట్రక్చర్ల నిర్మాణం జరగాలని, స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికలతో ముందుకు వెళ్లాలన్నారు. కృష్ణా డెల్టాలో గతంలో ఆలస్యంగా సాగు సీజన్ ఉండడం వల్ల తుపాన్ల ప్రభావంతో పంట నష్టపోవాల్సి వచ్చేదని, అందుకే ఈసారి సీజన్‌ను ముందుకు తీసుకువచ్చేలా కాలువలకు ముందస్తుగా నీటిని విడుదల చేయాలన్నారు. 'జలధార-జలహారతి' కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి భూగర్భ జలాలు పెంచితే, ప్రస్తుతం వ్యవసాయం కోసం ప్రభుత్వం భరిస్తున్న రూ.17 వేల కోట్ల విద్యుత్ భారం తగ్గుతుందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

# ప్రజలకు నమ్మకం కలిగేలా పనిచేయాలి

- మెరుగైన సేవల్లో నెల్లూరు, తూర్పుగోదావరి, పల్నాడు టాప్-3
- 23 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించాం..
- 40 వేల మంది క్షేత్రస్థాయి సిబ్బంది, కలెక్టర్లతో సీఎం ముఖాముఖి



**అమరావతి :** రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన దిశగా ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని సీఎం నారా చంద్రబాబు నాయుడు అన్నారు. అమరావతిలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి జిల్లా కలెక్టర్లు, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యోగులు, ఫీల్డ్ లెవల్ సిబ్బందితో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. సుమారు 40 వేల మందితో జరిగిన ఈ సమావేశంలో ప్రభుత్వ సేవల అమలు, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాలపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఫీల్డ్ స్థాయి అధికారులు నేరుగా ముఖ్యమంత్రితో మాట్లాడి పలు సూచనలు చేశారు. కాకినాడ జిల్లాకు చెందిన ఓ ఉద్యోగి గృహ నిర్మాణాలపై చేసిన సూచనను సీఎం అభినందిస్తూ అమలు చేస్తామని హామీ ఇచ్చారు. దిగువ స్థాయి ఉద్యోగులకు కూడా ముఖ్యమంత్రితో మాట్లాడే అవకాశం కల్పించడం పట్ల పలువురు ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేశారు. ప్రజలకు సంతృప్తికర సేవలు అందించడంలో నెల్లూరు, తూర్పుగోదావరి, పల్నాడు జిల్లాల కలెక్టర్లు టాప్-3లో నిలిచారని సీఎం వెల్లడించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ప్రభుత్వం 2047 నాటికి స్వర్ణాంధ్ర లక్ష్య సాధన కోసం పది సూత్రాలతో ముందుకెళ్తోందన్నారు. గత 23 నెలల్లో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించామని, 24 లక్షల ఉద్యోగ అవకాశాలు వచ్చినట్లు తెలిపారు. గూగుల్, ఆర్సెలర్ మిట్టల్, ఏఎంకేపి వంటి కీలక ప్రాజెక్టులు రాష్ట్రానికి వచ్చాయని, త్వరలో బీపీసీఎల్ తరహా ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. ఏఎంకేపి ప్రాజెక్టు ద్వారా పుట్టపర్తి-బెంగళూరు ప్రాంతాన్ని ఏరోస్పేస్ సిటీగా అభివృద్ధి చేస్తామని సీఎం పేర్కొన్నారు. ప్రభుత్వ యంత్రాంగం సమిష్టిగా పనిచేయడం వల్లే "బెస్ట్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్" అవార్డు రాష్ట్రానికి దక్కిందన్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం పెరిగేలా ప్రతి ఉద్యోగి పనిచేయాలని సీఎం సూచించారు. ప్రభుత్వ సేవలపై వచ్చిన ఫీడ్‌బ్యాక్ ప్రజల నమ్మకానికి నిదర్శనమన్నారు. పెన్షన్ల పంపిణీ కార్యక్రమం ప్రభుత్వ సేవల్లో అగ్రస్థానంలో నిలిచిందని, ప్రజలతో సత్సంబంధాలు ఉండటం వల్లే ఇది సాధ్యమైందన్నారు. జిల్లాల్లో పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాల్లో ఎలాంటి లోపాలు ఉండకూడదని, ప్రజా వినతుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు ఆదేశించారు. ఆర్థిక సమస్యలను వంద శాతం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాలన వేగంగా ప్రజలకు చేరేలా ప్రతి స్థాయిలో పనిచేయాలని సీఎం పేర్కొన్నారు. ఏఎంసీపి ప్రాజెక్టుకు కేవలం 36 రోజుల్లో అనుమతులు ఇవ్వడం ద్వారా శంకుస్థాపన దశకు తీసుకువచ్చామని, దీనిపై జాతీయ స్థాయిలో చర్చ జరుగుతోందన్నారు. అవినీతికి ఎలాంటి అవకాశం ఇవ్వకూడదని, పారదర్శకంగా వ్యవహరించాలని అధికారులను హెచ్చరించారు. వేసవిలో తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, చిన్న సమస్యలకైనా వెంటనే స్పందించి పరిష్కరించాలని సూచించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రభావం చూపే విధంగా పాలన సాగాలని, ప్రజలకు ప్రభుత్వం మీద నమ్మకం పెరిగేలా అందరూ కృషి చేయాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు.

# వేగవంతంగా గ్రీన్‌ఫీల్డ్ పోర్టు పనులు

## మూడు పోర్టుల పనులు ఏడాది చివరికి పూర్తి

## అధికారులతో సమీక్షలో మంత్రి జనార్ధన్ రెడ్డి

**అమరావతి, మే 18:** గ్రీన్‌ఫీల్డ్ పోర్టుల పనులు వేగవంతం చేయాలని ఏపీ పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని మూడు గ్రీన్‌ఫీల్డ్ పోర్టులు ఈ ఏడాది చివరి నాటికి పూర్తి చేసి.. అందుబాటులోకి తీసుకురావాలని దిశానిర్దేశర చేశారు. గ్రీన్‌ఫీల్డ్ పోర్టు అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు సీఎం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అన్నివిధాలుగా సహకరిస్తుందని తెలిపారు. పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల నిర్మాణంలో సమస్యలు వెంటనే పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. గ్రీన్‌ఫీల్డ్ పోర్టులు, పిషింగ్ హార్బర్ల పురోగతిపై మంత్రి సోమవారం సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. పోర్టులు, ఫిషింగ్ హర్బర్‌ల నిర్మాణంలో ఏదైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే, పరిష్కరిస్తామని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ క్రమంలో పోర్టులు, ఫిషింగ్ హార్బర్‌ల పనులు మరింత వేగవంతం చేసి, సకాలంలో పూర్తి చేయాలని మార్గనిర్దేశర చేశారు. మూలపేట పోర్టుకు సంబంధించి ప్రధానంగా ఉప్పు భూముల సమస్య, రోడ్డు, రైల్వే, ఆర్ అండ్ ఆర్ వంటి మౌలిక సదుపాయాల కల్పన సమస్యలు పరిష్కరించి పనులు వేగవంతం చేయాలని సూచించారు. మూలపేట గ్రామానికి పునరావాస కల్పనను వేగవంతం చేయడం ద్వారా డ్రెడ్జింగ్‌ను సకాలంలో పూర్తి చేయడంతో పాటు, ఈ ఏడాది ఆఖరు నాటికి పోర్టు నిర్మాణం పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. మచిలీపట్నం గ్రీన్‌ఫీల్డ్ పోర్టుకు సంబంధించి బ్రేక్ వాటర్, డ్రెడ్జింగ్ పనులు మరింత వేగవంతం చేయాలని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశించారు. మచిలీపట్నం పోర్టుకు రైల్వే అనుసంధానం, విద్యుత్, మంచినీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాల కల్పనను వేగవంతం చేయాలని దిశానిర్దేశర చేశారు. కూటమి ప్రభుత్వం అత్యంత ప్రతిష్మాత్మకంగా తీసుకుని గ్రీన్‌ఫీల్డ్ పోర్టులను చేపట్టిన క్రమంలో వాటిని సకాలంలో పూర్తి చేసేందుకు అధికారులు సహకరించాలని కోరారు. రామాయపట్నం గ్రీన్‌ఫీల్డ్ పోర్టులో డ్రెడ్జింగ్, పునరావాసం వంటి సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని మార్గనిర్దేశర చేశారు. మూడు గ్రీన్‌ఫీల్డ్ పోర్టులతో పాటు, ఫేజ్1 ఫిషింగ్ హర్బర్‌ల పనులు కూడా సకాలంలో పూర్తి చేయాలని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశించారు.



# దౌల్తాబాద్ లో రైతు మహా ధర్నా కార్యక్రమంలో

## పాల్గొన్న మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి







**దౌల్తాబాద్ మండలం, మే,18(సమయం న్యూస్)**

కొడంగల్ నియోజకవర్గం లో రైతులకు కనీసం గన్నీ బ్యాగులు కూడా పంపిణీ చేయలేకపోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వనికి వ్యతిరేకంగా దౌల్తాబాద్ మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేసిన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి,మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డిప్రభుత్వం సరైన సమయంలో వడ్లు కొనుగోలు చేయక సరిపడ గన్ని బ్యాగుల సరఫరా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.కొనుగోలు కేంద్ర నిర్వాహకులు వడ్లలో తాలు ఉంది అని చెప్పి ఒక క్వింటాలకు 10 కిలోల చొప్పున షూట్ తియ్యడం జరుగుతుంది.. ఒక క్వింటాలుకు 10 కిలోల చొప్పున తీస్తే రైతులు తీవ్రంగా నష్టపోతారు అలాగే అమలి చార్జీలు అని ఒక సంచికి 30/- రూపాయలు వసూలు చేస్తున్నారు అని హెచ్చరించారు.వెంటనే రైతులకు సరిపడ గన్ని బ్యాగులు అందించి వడ్లు కొనుకోలు చేసి రెండు రోజుల్లో డబ్బులు అకౌంట్లో జమ చేయాలని కాంగ్రెస్ సర్కార్ ను రేవంత్ రెడ్డిని డిమాండ్ చేస్తున్నాము అని తెలిపారు.కనీసం సొంత నియోజకవర్గం కొడంగల్ రైతులకు గన్నీ బ్యాగులు కూడా పంపిణీ చేయలేకపోతున్నరంటే రాష్ట్రంలో రైతుల పరిస్థితి ఏవిధంగా ఉందో ప్రజలు గ్రహించాలి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ధర్నాలో మండలాల నాయకులు కార్యకర్తలు రైతులు తదితరులు పాల్గొన్నారు

# ఏపీకే ఫైల్స్, తెలియని వెబ్సైట్లతో జాగ్రత్తగా ఉండాలి.

- అప్రమత్తతో సైబర్ నేరాల బారిన పడకుండా అడ్డుకోగలం.
- ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్స్, ఏపీకే ఫైల్స్, నకిలీ వెబ్సైట్స్,
- స్టాక్ మార్కెట్ ఫ్రాడ్ లాంటి నూతన పద్ధతులలో మోసం చేస్తున్న సైబర్ క్రైమ్ నేరగాళ్లు
- మోసపోయామని గ్రహించిన వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కి సంప్రదించాలి.
- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS.



**నారాయణపేట, మే,18(సమయం న్యూస్) :** ప్రస్తుత సమాజంలో సైబర్ నేరగాళ్లు నూతన పద్ధతులను ఉపయోగించి ప్రజలను మోసగిస్తున్న సందర్భంలో నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ప్రజలందరికీ అవగాహన, అప్రమత్తతతోనే సైబర్ నేరాలను అడ్డుకోగలమని ఒక ప్రకటన తెలియజేశారు. ప్రస్తుతం సమాజంలో ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్లు, స్టాక్ మార్కెటింగ్ అంటూ లాభాలు చూపిస్తామంటూ ప్రైవేటు వ్యక్తులు చేస్తున్న మోసాలు సామాన్య ప్రజలకు తెలియాలని అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అదేవిధంగా వాట్సాప్ నందు టెలిగ్రామ్ నందు సోషల్ మీడియాలలో ఏపీకే ఫైల్స్ రావడం వాటి ద్వారా మొబైల్ కంట్రోల్ సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లడం లాంటి సంభవిస్తుందని వాటిని అడ్డుకోవడానికి అప్రమత్తత ప్రధానాస్త్రంగా ఉంటుందని తెలిపారు. ఒకవేళ మోసగాళ్ల చేత మోసపోయినట్లయితే వెంటనే (గోల్డెన్ హవర్) లో జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930కి లేదా సైబర్ క్రైమ్ వెబ్సైట్ నందు ఫిర్యాదు చేయడం మొదటి కర్తవ్యం గా వ్యవహరిస్తుందని తెలిపారు.ముఖ్యంగా సైబర్ క్రైమ్ నేరస్తులు వినియోగిస్తున్న నూతన పద్ధతులు ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్, లోన్ ఫ్రాడ్, యూపీఐ ఫ్రాడ్, ఏపీకే ఫైల్స్, నకిలీ వెబ్సైట్లు, స్టాక్ మార్కెట్ ఫ్రాడ్ లాంటివి జరుగుతున్న నేపథ్యంలో ప్రజలందరూ ముఖ్యంగా యువత మాయమాటలకు నమ్మి మోసపోకుండా ఉండాలని తెలిపారు. సైబర్ క్రైమ్ నేరగాళ్లు వినియోగిస్తున్న పద్ధతిని తెలియజేస్తూ ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్లు ముఖ్యంగా డబ్బులను వారి సొంత వెబ్సైట్ ల నందు ఇన్వెస్ట్మెంట్ చేసిన దానికన్నా ఎక్కువగా చూపిస్తారని ఒకవేళ డబ్బులను తీయాలి అనుకుంటే రాకుండా ఉంటాయని తెలియచేశారు.జిల్లా పరిధిలో ప్రజలకు సైబర్ నేరాల పైన విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పోలీసు అధికారులకు ఎస్పీ తెలిపారు.

# వడ్లు కొంటేనే ఇంటికి వెల్తాం..!

- లారీల కోసం రైతుల రాస్తారోకో
- గంటపాటు స్థంభించిన గజ్వేల్--రామాయంపేట రహదారి



**రాయపోల్, మే 18:** ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన రైతులకు ఇప్పుడు లారీల కొరత కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. కొనుగోలు కేంద్రాల్లో రోజుల తరబడి వడ్లు పేరుకుపోయినా అధికారులు పట్టించుకోవడం లేదని మండలంలోని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే లారీలు పంపించి వడ్లను కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం లింగారెడ్డిపల్లి చౌరస్తా వద్ద రైతులు భారీ ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా గజ్వేల్--రామాయంపేట ప్రధాన రహదారిపై రైతులు సుమారు గంటపాటు రాస్తారోకో నిర్వహించారు. దీంతో రెండు వైపులా భారీగా వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ పూర్తిగా స్థంభించింది. రోడ్డుపైనే కూర్చొని "వడ్లు కొనాలి.. రైతును ఆదుకోవాలి" అంటూ రైతులు నినాదాలు చేశారు.ఆందోళనకు చిన్నమాసంపల్లి సర్పంచ్ నర్సింహారెడ్డి మద్దతు తెలుపుతూ రైతుల పక్షాన నిలిచారు. రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా కొనుగోలు ప్రక్రియలో జాప్యం కొనసాగడం బాధాకరమన్నారు. ప్రభుత్వం, అధికారులు వెంటనే స్పందించి లారీలు ఏర్పాటు చేసి ధాన్యాన్ని తరలించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.సమాచారం తెలుసుకున్న ఏపీఎం యాదగిరి, రాయ-పోల్ ఎస్సై మానస సంఘటనా స్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడారు. లారీలు పంపించి కొనుగోళ్లను వేగవంతం చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

# కరీంనగర్‌లో 50% ధాన్యం కొనుగోళ్లు పూర్తి

- రైతుల ఖాతాల్లో రూ.237 కోట్లు జమ



**కరీం నగర్ మే18( సమయం న్యూస్) :** కరీంనగర్ జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు వేగంగా కొనసాగుతున్నాయని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. జిల్లాలో 319 కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 1.58 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో రూ.237 కోట్లు జమ చేసినట్లు వెల్లడించారు.వారం రోజుల్లోనే 80 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, వచ్చే వారంలో లక్ష మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.

# పర్యాటక, చారిత్రక, పరిశోధన కేంద్రంగా మూడ్ మల్ నిలువు రాళ్ళు

- నిలువురాళ్ల ప్రాంతాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిది.
- జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఐఏఎస్.





**నారాయణపేట, మే,18(సమయం న్యూస్) :** ముడుమల్ నిలువు రాళ్లకు యునెస్కో గుర్తింపు కోసం ప్రపంచ వారసత్వ తాత్కాలిక జాబితాలో చోటు దక్కడం తెలంగాణకు గర్వకారణమని నారాయణపేట జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక అన్నారు. సోమవారం నారాయణపేట జిల్లా కృష్ణా మండలం ముడుమల్ నిలువు రాళ్ల (మెన్హిర్స్) ను ఆమె సందర్శించారు.నిలువు రాళ్లు, సప్తర్షి మండలంతో ఖగోళ పరిజ్ఞానాన్ని, కాలాలను, వాతావరణ మార్పులను ఆనాడే తెలుసుకునేవారని, కాలాలను గుర్తించడానికి ఆది మానవులు నిలువురాళ్లను ఓ క్రమంలో ఏర్పాటు చేసినట్లు ఆర్కియాలజీ శాఖకు చెందిన అధికారులు కలెక్టర్ కు వివరించారు. ఎలాంటి సాంకేతికత లేని 4 వేల సంవత్సరాల క్రితమే రాళ్ల ద్వారా తెలుసుకోవడం అనేది ఆబ్బురపరిచేలా, అద్భుతంగా ఉందని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ లో భాగంగా ఈ నెల 18 నుంచి 23 వరకు యువజన క్రీడా/పర్యాటక వారోత్సవాలను జిల్లాలో ఘనంగా నిర్వహించాలని ఆమె సూచించారు. రాష్ట్ర పర్యాటక శాఖ కు సంబంధించిన వారోత్సవాల టూరిస్ట్ గైడ్ పోస్టర్ తో పాటు మూడ్ మల్ నిలువు రాళ్ళ విశిష్టత ను తెలిపే ప్రచార పత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీపీ ఆర్ వో రషీద్, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి వెంకటేశ్ శెట్టి, మూడ్ మల్ సర్పంచి, పురావస్తు శాఖ అధికారులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# బంగారు నగలతో అప్రమత్తంగా ఉండాలి

- చైన్ స్నాచర్ల కదలికలపై పోలీసుల హెచ్చరిక.



**రాయపోల్, మే 17:** "క్షణిక నిర్లక్ష్యం.. జీవితాంతం బాధకు కారణం కాకూడదు" అంటూ ప్రజలకు రాయపోల్ ఎస్ఐ మానస అప్రమత్తత సూచనలు జారీ చేశారు. జిల్లాలో ఇటీవల చైన్ స్నాచింగ్ ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంత ప్రజలు, ముఖ్యంగా మహిళలు మరింత జాగ్రత్తగా ఉండాలని ఆమె సూచించారు.ఆదివారం ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో పోలీసులు నిరంతరం గస్తీ నిర్వహిస్తున్నప్పటికీ ప్రజలు కూడా తమ భద్రతపై శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. బంగారు ఆభరణాలు ధరించి ఒంటరిగా వెళ్లే మహిళలు అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. రాత్రివేళల్లో ఇళ్ల ముందు లేదా ఆరుబయట నిద్రించే వారు నగలు ధరించకపోవడం మంచిదన్నారు.గ్రామాల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తే వారి వివరాలు తెలుసుకోవాలని, అనుమానాస్పద కదలికలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. "నేరస్తులు ప్రజల నిర్లక్ష్యాన్నే అవకాశంగా తీసుకుంటారు. అప్రమత్తతే పెద్ద ఆయుధం" అని ఎస్ఐ మానస పేర్కొన్నారు.ప్రజలు పోలీసులకు సహకరిస్తే చైన్ స్నాచింగ్‌లు, చోరీలను సమర్థంగా అరికట్టవచ్చని ఆమె తెలిపారు. "మన జాగ్రత్త.. మన కుటుంబ రక్షణ" అనే భావనతో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.

# నిజామాబాద్ జిల్లాలోని చేనేత సహకార సంఘాలకు తుది ఓటర్ల జాబితా విడుదల

**నిజామాబాద్ మే18( సమయం న్యూస్) :** నిజామాబాద్ జిల్లాలోని ప్రాథమిక చేనేత సహకార సంఘాల ఎన్నికల ప్రక్రియలో భాగంగా, అర్హులైన ఓటర్లతో కూడిన తుది ఓటర్ల జాబితా సిద్ధం చేయబడిందని జిల్లా చేనేత మరియు వస్త్ర పరిశ్రమల శాఖ సహాయ సంచాలకులు (ఇూణ) ఒక ప్రకటనలో తెలిపారు.

**ప్రకటనలోని ముఖ్యాంశాలు:సభ్యత్వాల ఖరారు:**

సంబంధిత సహకార సంఘాలకు చెందిన సభ్యుల వివరాలు మరియు అర్హతా ప్రమాణాలను సహాయ సంచాలకులు (ఇూణ) స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, తుది సభ్యత్వ జాబితాను అధికారికంగా ఆమోదించారు.

**సవరణల పూర్తి:** నిబంధనలకు కట్టుబడి ఉంటూ, గతంలో విడుదల చేసిన ప్రాథమిక ఓటర్ల జాబితాకు సంబంధించి వచ్చిన అభ్యంతరాలు, పేర్ల సవరణలు మరియు చేర్పులను పరిష్కరించి, ఈ తుది జాబితాను రూపొందించారు.

**జాబితా ప్రదర్శన:** సభ్యుల సమాచారం కోసం, ఈ ఖరారైన వివరాలను నిజామాబాద్‌లోని జిల్లా చేనేత మరియు వస్త్ర పరిశ్రమల శాఖ కార్యాలయ నోటీసు బోర్డుపై, అలాగే సంబంధిత ప్రాథమిక చేనేత సహకార సంఘాల కార్యాలయాల్లో అందుబాటులో ఉంచారు.

**ఎన్నికల అధికారులకు ప్రతిపాదనల సమర్పణ:** ఎన్నికలు సజావుగా జరిగేలా చూసేందుకు, సహాయ సంచాలకులు (ఇూణ) స్థాయిలో ఆమోదించబడిన ఈ తుది ప్రతిపాదనలను రాష్ట్ర సహకార ఎన్నికల అధికారులకు వీలైనంత త్వరగా సమర్పిస్తామని ఆ అధికారి స్పష్టం చేశారు. తదుపరి ఎన్నికల ప్రక్రియ అంతా కేవలం ఈ తుది జాబితా ఆధారంగానే నిర్వహించబడుతుందని నొక్కిచెప్పిన సహాయ సంచాలకులు, అర్హులైన సభ్యులందరూ ఈ ప్రకటనను గమనించాలని కోరారు.

# విపత్తులపై తెలంగాణ అప్రమత్తం

- నెక్లెస్ రోడ్‌లో భారీ వరద మాక్ డ్రిల్ పరిశీలించిన మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, మే 18 (సమయం న్యూస్):** ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న విపత్తు నిర్వహణ మాక్ ఎక్సర్‌సైజ్‌లలో భాగంగా హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లో జరిగిన భారీ వరద మాక్ డ్రిల్‌ను ఆయన పరిశీలించారు.విపత్తుల సమయంలో "గోల్డెన్ అవర్" అత్యంత కీలకమని, ముందస్తు సన్నద్ధతతోనే ప్రాణనష్టం నివారించవచ్చని మంత్రి అన్నారు. వరదలు, అగ్నిప్రమాదాలు, పారిశ్రామిక ప్రమాదాల సమయంలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, వేగవంతమైన సహాయక చర్యలు చేపట్టడం కోసం మాక్ డ్రిల్‌లు ఉపయోగపడతాయని తెలిపారు.మాక్ డ్రిల్‌లో భాగంగా లైఫ్ బోట్లు, రెస్క్యూ ఆపరేషన్‌లు, అత్యవసర తరలింపు చర్యలను ప్రత్యేక బృందాలు ప్రదర్శించాయి. ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, ఫైర్, పోలీస్, వైద్య ఆరోగ్య, జీహెచ్‌ఎంసీ తదితర శాఖలు పాల్గొన్నాయి. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఇవన్నీ ముందస్తు సన్నద్ధతలో భాగమని మంత్రి స్పష్టం చేశారు.

# మద్దూర్ పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా బిజ్జా శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరించారు



**మద్దూర్ మున్సిపల్,(మం)18(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా పోలీసు విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఎస్సై బిజ్జా శ్రీనివాసులు మద్దూర్ పోలీస్ స్టేషన్ (ఐూ) ఎస్సై గా బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా నూతన ఎస్సై బిజ్జా శ్రీనివాసులు మాట్లాడుతూ... మద్దూర్ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ స్నేహపూర్వక పోలీసింగ్ అమలు చేస్తామని పేర్కొన్నారు. ప్రజలు ఎలాంటి సమస్యలైనా నేరుగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి తెలియజేయాలని సూచించారు. గ్రామాల్లో అక్రమ కార్యకలాపాలు, మత్తు పదార్థాల వినియోగం, పేకాట, గంజాయి రవాణా, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని తెలిపారు. మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, యువత చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. మద్దూరు మండల ప్రజల సహకారంతో శాంతియుత వాతావరణం కొనసాగించేలా కృషి చేస్తామని ఎస్సై తెలిపారు.

# మైనర్ బాలికకు న్యాయం చేయాలంటూ సిరిసిల్లలో బీఆర్ఎస్ రాస్తారోకో

**సిరిసిల్ల మే18( సమయం న్యూస్) :** సిరిసిల్లలో మైనర్ బాలికకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. బండి సంజయ్ తనయుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి బండి సంజయ్ రాజీనామా చేయాలని నాయకులు డిమాండ్ చేశారు.

పోక్సో కేసు నమోదైన అనంతరం బండి భగీరథ్‌ను తొమ్మిది రోజుల పాటు దాచిపెట్టడం సిగ్గుచేటని విమర్శించారు. కేంద్ర మంత్రి పదవిలో ఉండి బాధిత కుటుంబాన్ని బెదిరించడం క్షమించరాని నేరమని ఆరోపించారు. కేసు విచారణ నిష్పక్షపాతంగా జరగాలంటే బండి సంజయ్‌ను కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు.

# ఐనపూర్ లో ఉపాధి హామీ సబ్యులకు అవగాహన కల్పించిన పరిగి "షీ" టీమ్ పోలీసులు

- జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా, (IPS) మరియు పరిగి డీఎస్పీ శ్రీనివాస్ ఆదేశానుసారం



**దోమ మండలం, మే,18(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా దోమ పోలీస్ స్టేషన్ పరిధి లోని ఐనపూర్ గ్రామము లో సబ్ డివిజన్ "షీ" టీమ్ ఇంచార్జ్ నర్సిములు ఉపాధి హామీ వర్కర్లకు మహిళల పై జరుగుతున్న నెరలపై అవగాహన కార్యక్రమము నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం.మహిళ పై జరుగుతున్న నేరాలు.నిర్భయ చట్టం, POCSO Act గురించి.100డయాల్, "షీ" టీమ్ నం - 181. సీసీ కేమెరాలు.బాల్య వివాహాలు.బాల కార్మిక వ్యవస్థ.కమ్యూనిటీ పోలిసింగ్. మానవ అక్రమ రవాణా.మద్యపాన నిషేధం.బ్యాంకింగ్ ఆన్లైన్ మోసాలు.గంజాయి నిర్మూలన, డ్రగ్స్ నిషేధం.Cyber crimes No:1930 పై అవగాహన.వివిధ అంశాలపై ఐనపూర్ గ్రామ ఉపాధి హామీ సబ్యులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో "షీ" టీమ్ సభ్యులు శోభ, బి.సావిత్రి ఉన్నారు.

# తెలంగాణ రక్షణ సేన జెండా గద్దె మోడల్ ఆవిష్కరణ

- మే 20 నుంచి జూన్ 20 వరకు నెల రోజుల పాటు జెండా పండుగ



**హైదరాబాద్:మే18(సమయం న్యూస్) :** రాష్ట్రవ్యాప్తంగా ఒకే నమూనాలో తెలంగాణ రక్షణ సేన జెండా గద్దెలు నిర్మించనున్నట్లు ఆ పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత తెలిపారు.

బంజారాహిల్స్‌లోని టీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన రాష్ట్ర జనరల్ బాడీ సమావేశంలో జెండా గద్దె నమూనాను ఆమె ఆవిష్కరించారు. మూడు అడుగుల ఎత్తు, రెండు అడుగుల వెడల్పుతో జెండా గద్దెలు నిర్మించాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

గద్దె బేస్‌ను ఒక అడుగు ఎత్తులో గ్రీన్ కలర్‌లో, పైభాగాన్ని రెండు అడుగుల ఎత్తులో ఎల్లో కలర్‌లో నిర్మించాలని తెలిపారు. పైభాగంలో బ్లూ కలర్‌లో తెలంగాణ మ్యాప్ ఏర్పాటు చేసి, మ్యాప్ మధ్యలో ఇంగ్లీష్ అక్షరాల్లో "ఎ=ా" అని రాయాలని సూచించారు. బేస్ గ్రీన్ కలర్ మధ్యలో తెలుగులో "తెలంగాణ రక్షణ సేన" అని రాయాలని పేర్కొన్నారు.పార్టీ ఇచ్చిన కలర్ కోడ్స్ ప్రకారమే జెండా గద్దెలు, జెండాలు రూపొందించాలని, అప్పుడే రాష్ట్రవ్యాప్తంగా ఏకరూపత ఉంటుందని కవిత స్పష్టం చేశారు. ఈ నెల 20 నుంచి జూన్ 20 వరకు జెండా పండుగను ఘనంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

# జిల్లా ఎస్పీని కలిసిన మద్దూర్ నూతన ఎస్సై (SHO) శ్రీనివాసులు

నూతన ఎస్సై కి శుభాకాంక్షలు తెలిపిన ఎస్పీ డాక్టర్. వినిత్ ఐపీఎస్



**మద్దూర్, మే,18(సమయం న్యూస్) :** మద్దూర్ పోలీస్ స్టేషన్ నూతన ఎస్‌హెచ్‌వోగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై శ్రీనివాసులు సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ డాక్టర్ వినీత్ IPS ని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ నూతన ఎస్సై కి శుభాకాంక్షలు తెలిపి మద్దూర్ మండల పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి భద్రతపై భరోసా కల్పించాలని ఎస్సై కి సూచించారు. అలాగే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని తెలిపారు.

# గిరిజన గ్రామాలలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు

జిల్లా కలెక్టర్ కె. హరిత



**ఆసిఫాబాద్మే 18,( సమయం న్యూస్) :** జిల్లాలోని మారుమూల గిరిజన గ్రామాలలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల పాలనాధికారి చాంబర్ లో భారత ప్రభుత్వ గిరిజన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జన జాతీయ గ్రామ ఉత్సవ్ 2026 సంబంధిత గోడ ప్రతులను జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రమాదేవి తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ లో భాగంగా గిరిజన గ్రామాలలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గ్రామాలలో రహదారి, త్రాగునీరు, గిరిజనుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, ప్రతి ఇంటికి విద్యుత్ సౌకర్యం, ప్రతి గ్రామానికి ఇంటర్నెట్ సేవలు అదే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పక్కా ఇండ్లు లేని గిరిజనులకు గృహాలు మంజూరు చేస్తామని, గిరిజనుల అభివృద్ధికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా ప్రభుత్వం కృషి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల మే 18( సమయం న్యూస్) :** ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని ఐ. బి. చౌరస్తా నుండి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా క్రీడాధికార సంస్థ మైదానం వరకు చేపట్టిన తెలంగాణ మారథాన్-ఫిజికల్ లీటరసి కార్యక్రమంలో డి సి పి భాస్కర్,గుడిపేట 13వ పటాలము కమాండెంట్ వెంకటేశ్వర్లు, జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి హనుమంత రెడ్డి, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్, ఎ. సి. పి. ప్రకాష్, యువతీ యువకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మన దేశం యువ భారతదేశం అని, దేశంలో యువ జనాభా అధికంగా ఉందని తెలిపారు. రాష్ట్ర, దేశ అభివృద్ధిలో యువత అత్యంత కీలకమని, దేశ అభివృద్ధి కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొనాలని తెలిపారు. ఆరోగ్యం, క్రమశిక్షణ కలిగి ఉండాలని, వ్యాయామం, యోగ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని తెలిపారు. మాదక ద్రవ్యాలు, మద్యం వల్ల కలిగే అనర్థాలను తెలుసుకొని యువత వాటికి దూరంగా ఉండాలని, మాదకద్రవ్య రహిత తెలంగాణగా సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. "నో టు డ్రగ్స్ - ఎస్ టు ఎక్సర్సైజ్" నినాదం దిశగా ప్రతి ఒక్కరు ఆరోగ్యం వైపు అడుగులు వేయాలని, ప్రతి ఒక్కరికి ఆరోగ్యం ఆవశ్యకతపై అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతిరోజు వ్యాయామం చేయడం ద్వారా శారీరక రుగ్మత, మానసిక ఆందోళనల నుంచి బయటపడవచ్చు అని, అనారోగ్యం దరిచేరకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, యువతి యువకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి సమస్యల సత్వర పరిష్కారంపై దృష్టి సారించాలి

- అడిషనల్ కలెక్టర్ సంగీత



**సంగారెడ్డి సమయం న్యూస్, మే 18:--** ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించే దిశగా అధికారులు దృష్టి సారించాలని అడిషనల్ కలెక్టర్ సంగీత అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే ప్రతి ఫిర్యాదును బాధ్యతగా స్వీకరించి, నిర్ణీత గడువులో పరిష్కరించాలని సూచించారు.సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలోఅదిషనల్ కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి వివరాలు తెలుసుకుని, సమస్యల పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు తగిన సూచనలు జారీ చేశారు.జిల్లాలో డివిజన్ వారీగా నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల్లో మొత్తం 80 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. అందులో కలెక్టరేట్‌కు 38, సంగారెడ్డి డివిజన్‌కు 12, ఆందోల్ డివిజన్‌కు 03, నారాయణఖేడ్ డివిజన్‌కు 19, జహీరాబాద్ డివిజన్‌కు 08 ఫిర్యాదులు అందినట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమం లో జిల్లా అధికారులు, రెవెన్యూ అధికారులు,, మున్సిపల్ కమిషనర్లు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నూతన పీ హెచ్ సీ ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఐఏఎస్





**కృష్ణా మండలం, మే,18(సమయం న్యూస్) :** నారాయణ పేట జిల్లా కృష్ణా మండల కేంద్రంలో 15 వ ఆర్థిక సంఘం నిధులు రూ. కోటి 43 లక్షల తో నిర్మించిన నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ సీహెచ్. ప్రియాంక పరిశీలించారు. కేంద్రంలోని వివిధ విభాగాల గదులను చూశారు. ఇంత వరకు కృష్ణా మండలానికి పీ హెచ్ సీ లేదా అని ప్రశ్నించగా కృష్ణా మండలం కొత్తగా ఏర్పడిందని, గతంలో మాగనూరు పీ హెచ్ సీ లోనే కృష్ణ మండలానికి చెందిన ప్రజలు సేవలు పొందేవారని, ఇప్పుడు కొత్తగా నిర్మించిన పీ హెచ్ సీ అందుబాటులోకి రానుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జయ చంద్రమోహన్ కలెక్టర్ కు తెలిపారు. నూతన పీ హెచ్ సీ లో ఇంకా ఏమైనా పనులు మిగిలి పోయాయా? అని కలెక్టర్ అడగడంతో .. పనులన్నీ పూర్తయ్యాయని డీ ఎం అండ్ హెచ్ ఓ తెలిపారు. అయితే జూన్ 2 న నూతన పీ హెచ్ సీ ప్రారంభోత్సవానికి జిల్లా మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి సమయం తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో కృష్ణ తహాసిల్దార్ శ్రీనివాస్, డిపివో బిక్షపతి, కృష్ణా గ్రామ సర్పంచి నగేష్, తదితరులు పాల్గొన్నారు.

# వేసవి కాలం నేపథ్యంలో రైల్వే భద్రతా చర్యలపై సమీక్ష

- అగ్నిమాపక భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి:
- దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ



**సికింద్రాబాద్, మే 18( సమయం న్యూస్) :** వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని రైలు కార్యకలాపాల్లో భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ అధికారులను ఆదేశించారు. సోమవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో నిర్వహించిన జోన్ స్థాయి సమీక్ష సమావేశంలో ఆయన భద్రతా అంశాలపై విస్తృతంగా చర్చించారు.వేసవి కాలంలో అగ్నిప్రమాదాల నివారణకు సిబ్బందికి నిరంతర అవగాహన కల్పించాలని, ఫైర్ అండ్ స్మోక్ డిటెక్షన్ సిస్టమ్ నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. రైల్వే పట్టాల వెంట అగ్ని ప్రమాదాలు జరగకుండా గస్తీని ముమ్మరం చేయాలని తెలిపారు.రోలింగ్ స్టాక్ భద్రత, భారీ లోడింగ్ సమయంలో మార్గదర్శకాల అమలు, అసమాన లోడింగ్ నివారణపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ట్రాక్ భద్రత, కేబుల్ డ్యామేజ్‌లు, అనధికార ప్రవేశాల నివారణ, యార్డ్ పునర్నిర్మాణం, సిగ్నల్ అప్‌గ్రేడేషన్, వంతెనలపై కాలి నడక మార్గాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు.

# మక్కజొన్న కొనుగోళ్లను వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి

**కామారెడ్డి, మే 18( సమయం న్యూస్) :** యాసంగి 2025-26 సీజన్‌లో జిల్లాలో కొనసాగుతున్న మక్కజొన్న కొనుగోలు ప్రక్రియపై జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టరేట్‌లో జరిగిన ఈ సమావేశంలో అదనపు కలెక్టర్, జిల్లా సహకార అధికారి, జిల్లా మార్కెటింగ్ అధికారి, మార్క్‌ఫెడ్, తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 1,28,307 క్వింటాళ్ల మక్కజొన్న కొనుగోలు చేయగా, అందులో 86,917 క్వింటాళ్లను గిడ్డంగులకు తరలించినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. రైతులు తీసుకువస్తున్న మక్కజొన్నను వేగంగా కొనుగోలు చేసి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మండలాల వారీగా నిల్వలను నిరంతరం పర్యవేక్షిస్తూ కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా సహకార అధికారికి సూచించారు. సొసైటీ స్థాయిలో హమాలీల సంఖ్యను పెంచి, కొనుగోలు చేసిన మక్కజొన్నను ప్రతిరోజూ గిడ్డంగులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటికే గుర్తించిన గోడౌన్లను వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ అధికారులకు సూచించారు. అన్‌లోడింగ్ పాయింట్ల వద్ద హమాలీల సంఖ్య పెంచడంతో పాటు, లారీల సంఖ్యను కూడా పెంచి రవాణా ప్రక్రియలో ఆలస్యం లేకుండా చూడాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అదనపు నిల్వ సామర్థ్యం గల గోడౌన్లను గుర్తించి వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# ప్రపంచస్థాయి సాంకేతికతతో విపత్తు రక్షణ వ్యవస్థ బలోపేతం

- ప్రమాదాల సమయంలో 'గోల్డెన్ అవర్'కీలకం
- హైదరాబాద్‌లో భారీ విపత్తు నిర్వహణ మాక్ డ్రిల్ ప్రారంభించిన మంత్రి పొంగులేటి







**హైదరాబాద్ మే18( సమయం న్యూస్) :** ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడడం, వీలైనంత వరకూ ఆస్తులకు నష్టం కలగకుండా చూడడమే లక్ష్యంగా ప్రభుత్వ పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సూచనల మేరకు ప్రపంచస్థాయి సాంకేతికతతో విపత్తు రక్షణ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న విపత్తు నిర్వహణ మాక్ ఎక్సర్‌సైజ్‌లలో భాగంగా, హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్ హెచ్‌ఎండీఏ గ్రౌండ్స్ వద్ద సోమవారం నిర్వహించిన మాక్ డ్రిల్‌ను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. అనంతరం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో వివిధ శాఖల ఉన్నతాధికారులతో విపత్తు నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ... వివిధ రాష్ట్రాలలో అమలు చేస్తున్న అత్యుత్తమ విధానాలకు అనుగుణంగా తెలంగాణలో విపత్తు నిర్వహణ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని మంత్రి వెల్లడించారు. ప్రకృతి విపత్తులు, అగ్నిప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కొవడానికి ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్న అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని, అత్యాధునిక పరికరాలను పరిశీలించి, వాటి వివరాలతో కూడిన సమగ్ర నివేదికను, ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలని అధికారులను ఆదేశించారు. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ (చీణహీూ) సహకారంతో నిర్వహిస్తున్న ఈ మాక్ డ్రిల్ ద్వారా లభించే అనుభవాలతో అధికారులు విపత్తుల సమయంలో మరింత బాధ్యతాయుతంగా, సమర్థవంతంగా సేవలు అందించాలని సూచించారు. వరదలు, అగ్నిప్రమాదాలు, పారిశ్రామిక ప్రమాదాలు వంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు వేగవంతమైన స్పందన, వివిధ శాఖల మధ్య సమన్వయం, ముందస్తు సన్నద్ధత ఎంతో కీలకమని ఆయన అన్నారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు మొదటి గంట ఎంతో కీలకమైనదని, దానిని 'గోల్డెన్ అవర్'గా పరిగణించాలని పేర్కొన్నారు. ఆ సమయంలో సిబ్బంది అంతా పూర్తి సమన్వయంతో పనిచేస్తూ, అందుబాటులో ఉన్న అత్యాధునిక ఎక్విప్‌మెంట్‌ను సరిగ్గా వినియోగించి ప్రజలకు తక్షణ సేవలు అందించాలన్నారు. అగ్నిప్రమాదాలు, వరదల సమయంలో అన్ని వ్యవస్థలు సకాలంలో స్పందించి ఆస్తి, ప్రాణ నష్టాలను కనిష్ట స్థాయికి తగ్గించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రమాదం జరిగిందనే కాల్ రాగానే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా సరైన సమయంలో, సరైన ప్రాంతానికి చేరుకుని బాధిత ప్రజలకు సకాలంలో వైద్య, రక్షణ సేవలు అందించడం అధికారుల బాధ్యత అని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు వరదలు, అగ్నిప్రమాదాలు, ఆకస్మిక ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, వేగంగా సహాయక చర్యలు చేపట్టడం, అత్యవసర సేవలను సమన్వయం చేయడం కోసం ఇటువంటి మాక్ డ్రిల్‌లు ఎంతో ఉపయోగపడతాయని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గత చరిత్రను గుర్తుచేశారు. 1908లో సంభవించిన హైదరాబాద్ మహావరదలను, ఇటీవలి కాలంలో వచ్చిన గోదావరి--కృష్ణా నదుల వరదలను ప్రస్తావిస్తూ... విపత్తుల విషయంలో అప్రమత్తత లేకపోతే ఎంతటి ఘోర నష్టం జరుగుతుందో చరిత్ర చెబుతోందన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక పరికరాలు, శిక్షణ పొందిన రెస్క్యూ బృందాలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా సిద్ధంగా ఉండాలని సూచించారు. అడవుల్లో సంభవించే అగ్నిప్రమాదాలు పచ్చదనాన్ని నాశనం చేస్తుంటే, పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్న అగ్నిప్రమాదాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయంగా విపత్తుల సమయంలో చేపట్టిన రక్షణ చర్యలను అధ్యయనం చేస్తూ తెలంగాణలో అత్యుత్తమ విపత్తు నిర్వహణ వ్యవస్థను రూపొందిస్తున్నామని స్పష్టం చేశారు.

**కనువిందు చేసిన రెస్క్యూ ఆపరేషన్లు**

మాక్ డ్రిల్‌లో భాగంగా గాలితో నింపే లైఫ్ బోట్లు, నీటిలో చిక్కుకున్న వారిని రక్షించే అత్యాధునిక సాంకేతిక పద్ధతులు, అత్యవసర తరలింపు చర్యలు, సమన్వయంతో కూడిన రెస్క్యూ ఆపరేషన్‌లను ప్రత్యేక బృందాలు ప్రత్యక్షంగా ప్రదర్శించి చూపించాయి. అనంతరం మంత్రి నెక్లెస్ రోడ్ బోటింగ్ క్లబ్‌ను సందర్శించి అక్కడి రెస్క్యూ కార్యకలాపాలను స్వయంగా పరిశీలించారు. తెలంగాణ రాష్ట్రంలో ఇంత విస్తృత స్థాయిలో మాక్ ఎక్సర్‌సైజ్‌లు నిర్వహించడం అభినందనీయమని పేర్కొంటూ ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, విపత్తు నిర్వహణ శాఖ ,జిల్లా అధికారులను మంత్రి అభినందించారు. రాష్ట్రంలో జరుగుతున్న ఈ ప్రదర్శనలు కేవలం ముందస్తు సన్నద్ధతలో భాగంగా నిర్వహిస్తున్న మాక్ డ్రిల్‌లేనని, ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని మంత్రి స్పష్టం చేశారు. మీడియా, సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రజలకు ఎల్లప్పుడూ బాధ్యతాయుతమైన, నిజమైన సమాచారమే చేరాలని, పుకార్లను నమ్మవద్దని ఆయన కోరారు. ఈ భారీ మాక్ డ్రిల్ కార్యక్రమంలో విపత్తు నిర్వహణ శాఖ కార్యదర్శి దాసరి హరిచందన, తెలంగాణ రాష్ట్ర విపత్తు స్పందన మరియు అగ్నిమాపక శాఖ డీజీ విక్రమ్ సింగ్ మాన్, హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్, ఎన్‌డీఎంఏ లీడ్ కన్సల్టెంట్ మేజర్ జనరల్ (రిటైర్డ్) సుధీర్ బెల్ పాల్గొన్నారు. వీరితో పాటు పోలీస్, ఫైర్, ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ , రెవెన్యూ, వైద్య ఆరోగ్య, జీహెచ్‌ఎంసీ , హైడ్రా, పరిశ్రమలు, రవాణా, పశుసంవర్ధక, వెటర్నరీ తదితర శాఖల అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని మాక్ డ్రిల్‌ను విజయవంతం చేశారు.

# ఘనంగా విద్యా వారోత్సవాల ముగింపు వేడుకలు

**ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



**అదిలాబాద్ మే18( సమయం న్యూస్) :** అన్ని శాఖల సహకారంతో విద్యా వారోత్సవాలు విజయవంతం అయ్యాయని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ప్రజాపాలన - ప్రగతిప్రణాళిక విద్యా వారోత్సవాలలో భాగంగా ఆదివారం జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన “విద్యా విజయోత్సవం” ముగింపు వేడుకల్లో ఆయన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ఇంచార్జి జిల్లా విద్యాశాఖ అధికారి రాజేశ్వర్ తో కలిసి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో మే 11 నుండి మే 17 వరకు వారం రోజుల పాటు అత్యంత వైభవంగా విజయవంతంగా ముగిశాయని, వారం రోజుల పాటు జరిగిన ఈ విద్యా వారోత్సవాలలో స్కూల్ ఎడ్యుకేషన్, ఇంటర్మీడియట్, టెక్నికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్లు ఉమ్మడిగా సమన్వయంతో ఎంతో కృషి చేశాయని అభినందించారు. రాబోయే విద్యా సంవత్సరంలో విద్యా ప్రమాణాలు, ఫలితాలు మెరుగుపడాలంటే విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడం అత్యంత కీలకమని, ప్రతి విద్యార్థికి కనీసం 75 శాతం హాజరు ఉండేలా ఉపాధ్యాయులు, జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. పాఠశాలలకు సరిగ్గా రాని విద్యార్థుల ఇళ్లను ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్ స్వయంగా సందర్శించి, వారి సమస్యలను తెలుసుకుని, వారిలో ఉన్న ప్రతికూలతలను తొలగించి క్రమం తప్పకుండా బడికి వచ్చేలా ప్రోత్సహించాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కేవలం సాంప్రదాయ కోర్సులైన ఇంజనీరింగ్, మెడిసిన్ మాత్రమే కాకుండా మారుతున్న కాలానికి అనుగుణంగా సరికొత్త కెరీర్ గైడెన్స్ అందించాలని ఉపాధ్యాయులను కోరారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ూ×), డేటా సైన్స్, కోడింగ్, స్టాటిస్టిక్స్ వంటి సరికొత్త సాంకేతిక విభాగాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే విద్యార్థుల ప్రగతిని సమీక్షించడానికి క్రమం తప్పకుండా తల్లిదండ్రుల సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. రాబోయే విద్యా సంవత్సరం నుండి పాఠశాల విద్యాశాఖలో 'సీఎం బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్' ను, ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 'మిడ్ డే మీల్స్' ను ప్రభుత్వం ప్రారంభించనుందని, ఇది విద్యార్థుల ఆరోగ్యానికి, హాజరు శాతానికి ఎంతో తోడ్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వారం రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన విద్యాశాఖల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు తల్లిదండ్రులకు కలెక్టర్ రాజర్షి షా తన హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం గత విద్యాసంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను (టాపర్స్), విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులను, కళాశాల ప్రిన్సిపాల్లను కలెక్టర్, అదనపు కలెక్టర్ ఘనంగా శాలువాతో సత్కరించి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఆ తదుపరి బాల కేంద్రం పుస్తక నిధి పోస్టర్ ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి గణేష్ జాదవ్, ఏఎంఓలు లక్ష్మణ్, అజయ్ జిల్లాలోని పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్ లు, ఉపాధ్యాయులు, బోధన సిబ్బంది, విద్యార్థులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో యూత్ అండ్ స్పోర్ట్స్ థీమ్

- గోడపత్రికను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ కే. హరిత



**ఆసిఫాబాద్, మే 18( సమయం న్యూస్) :** ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మే 18 నుంచి 23 వరకు నిర్వహించనున్న 'యూత్ అండ్ స్పోర్ట్స్ థీమ్' కార్యక్రమాల గోడపత్రికను జిల్లా కలెక్టర్ కే. హరిత సోమవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. యువతలో క్రీడలపై ఆసక్తి, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాలు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. యువత, యువజన సంఘాలు, క్రీడా సంఘాలు, క్రీడాకారులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ నెల 18న ఫిట్ అండ్ యాక్టివ్ తెలంగాణ పేరుతో 2కే రన్, 19న కెరీర్, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, 20న నాయకత్వ లక్షణాలపై అవగాహన, 21న స్పోర్ట్స్ డే, 22న స్వచ్ఛ తెలంగాణలో భాగంగా శ్రమదానం, 23న ఉద్యోగ సాధన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ప్లానింగ్ అధికారి, జిల్లా యువజన క్రీడల అధికారి అశ్వక్ అహ్మద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అడవుల రక్షణకు అందరూ కృషి చేయాలి

- జిల్లా అటవీ శాఖ అధికారి బాలామణి
- అటవీ అగ్నిప్రమాదాల నియంత్రణ కోసం మాక్ డ్రిల్



**ఆసిఫాబాద్ మే18( సమయం న్యూస్) :** అడవులు కాపాడడం అందరి బాధ్యత అందరూ ఈ విషయములో బాధ్యతగా మెలగాల్సిన అవసరం ఉందని జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ బాలామణి అన్నారు. ఆకస్మిక విపత్తు అటవీ అగ్నిప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన చర్యలు పై వివిధ శాఖల సమన్వయాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో కాగజ్‌నగర్ డివిజన్‌లోని వేంపల్లి ఫారెస్ట్ లో సోమవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. ఇందులో జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ బాలామణి పాల్గొని మాట్లాడారు. నేషనల్ డిజాస్టర్ మేనేజ్మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా విపత్తు నిర్వహణ మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అడవిలో అగ్నిప్రమాదాలు జరిగితే ఎలా స్పందించాలి ,వాటి కంట్రోల్ ఎలా అన్నది తెలుసుకునేందుకు ఈ మాక్ డ్రిల్ నిర్వహించడం జరుగుతోందని అన్నారు. అటవీ శాఖ, అగ్నిమాపక శాఖ, ఎస్ డీ ఆర్ ఎఫ్,రెవెన్యూ, పంచాయతీ రాజ్, పోలీస్, వెటర్నరీ, వైద్య ఆరోగ్య శాఖలు సహా మొత్తం 19శాఖలు మాక్ డ్రిల్ లో పాల్గొన్నాయి. పర్యావరణ సమతుల్యం కాపాడేందుకు అందరూ అటవీ శాఖ కు సహకరించాలని అన్నారు .మాక్ డ్రిల్ కోసం సమీపం లోని పెద్దబండ , కోసినీ గ్రామాలకు చెందిన 80 మందిని వేంపల్లి హరిణి పార్క్ రీ హ్యాబిటేషన్ సెంటర్ లో తరలించారు. జిల్లా ఫైర్ ఆఫీసర్ సురేశ్ కుమార్, ఎస్ డీ ఆర్ ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ నాగభూషణం, కాగజ్ నగర్ ఎఫ్ డీ ఓ అప్పయ్య, ఏఎంవీఐ రాజశేఖర్, అబ్జర్వర్ క్రాంతి, డీ పీఆర్వో సంపత్ కుమార్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పోతంగల్ తహసిల్దార్‌గా చల్లా సందీప్ బాధ్యతల స్వీకరణ

- పారదర్శక సేవలే లక్ష్యం



**పోతంగల్, మే 18 (సమయం న్యూస్ )** నిజామాబాదు జిల్లా పోతంగల్ మండల నూతన తహసిల్దార్‌గా చల్లా సందీప్ నేడు అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ నుండి బదిలీపై ఇక్కడికి వచ్చిన ఆయనకు, కార్యాలయానికి చేరుకోగానే రెవెన్యూ అధికారులు మరియు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం నూతన తహసిల్దార్ చల్లా సందీప్ మాట్లాడుతూ.. మండల ప్రజలకు రెవెన్యూ సేవలను మరింత వేగంగా, పారదర్శకంగా అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యాలయానికి వచ్చే అర్జీదారుల మరియు రైతుల సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇస్తానని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూస్తానని పేర్కొన్నారు. మండల అభివృద్ధి కోసం స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు ప్రజలు తమకు పూర్తి సహకారం అందించాలని ఆయన కోరారు.

# కొడంగల్ సబ్ డివిజన్ పరిధిలోని పలు వరి కొనుగోలు

- గోదాములు,రైస్ మిల్లులను సందర్శించి,పరిశీలించిన
- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి,జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా..





**కొడంగల్ నియోజకవర్గం,మే,18(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ తో కలిసి కోడంగల్ సబ్ డివిజన్ పరిధిలోని పలు వరి కొనుగోలు కేంద్రాలు (ఫ్రాజలు), గోదాములు మరియు రైస్ మిల్లులను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా బొంరాస్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బొంరాస్‌పేట్ గ్రామం మరియు బురన్‌పూర్ గ్రామ పరిధిలో ఉన్న పిపిసి కేంద్రాలను పరిశీలించారు. అనంతరం దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దౌల్తాబాద్ గ్రామంలోని పిపిసి కేంద్రం, గోదాంను సందర్శించి ధాన్యం నిల్వలు, రవాణా మరియు కొనుగోలు ప్రక్రియపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అలాగే దుద్యాల పోలీస్ స్టేషన్ పరిధిలోని గౌరారం గ్రామంలో ఉన్న రైస్ మిల్‌ను పరిశీలించి అక్కడి నిర్వహణ విధానాలను తెలుసుకున్నారు.జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ మాట్లాడుతూ, రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా తమ ధాన్యాన్ని విక్రయించే సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొనకుండా అన్ని శాఖల సమన్వయంతో చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా, వేగవంతంగా జరిగేలా ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగుతోందన్నారు. రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం, ధాన్యం తరలింపులో జాప్యం లేకుండా చూడడం మరియు గోదాముల నిర్వహణపై సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేసినట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా మాట్లాడుతూ, రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సక్రమంగా కొనుగోలు చేయించేందుకు పోలీస్ శాఖ అన్ని విధాల సహకారం అందిస్తోందన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, మధ్యవర్తుల జోక్యం లేకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ధాన్యం రవాణాలో జాప్యాన్ని నివారించడం వంటి కీలక అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తాము ఇప్పటికే డీఎస్పీ స్థాయి అధికారులకు స్పష్టమైన సూచనలు జారీ చేసినట్లు వారు వెల్లడించారు.ఇట్టి కార్యక్రమం లో పరిగి డీఎస్పీ శ్రీనివాస్ , కోడంగల్ సిఐ శ్రీధర్ రెడ్డి లు,ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొనడం జరిగింది.

# ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్
- బూర్గంపాడులో వివిధ శాఖల సమన్వయంతో మాక్ డ్రిల్ నిర్వహణ
- జిల్లా కలెక్టర్ అంకిత్
- బూర్గంపాడులో వివిధ శాఖల సమన్వయంతో మాక్ డ్రిల్ నిర్వహణ



**బూర్గంపహాడ్ మే18( సమయం న్యూస్) :**తెలంగాణ రాష్ట్రంలో విపత్తుల నిర్వహణ, వరదలు, అగ్నిప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలు మరియు సహాయక చర్యలపై సోమవారం రాష్ట్రవ్యాప్తంగా 11 జిల్లాల్లో నిర్వహించిన మాక్ డ్రిల్ కార్యక్రమాన్ని రాష్ట్ర రెవెన్యూ, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, విపత్తు నిర్వహణ శాఖ కార్యదర్శి హరిచందన, రాష్ట్ర విపత్తు స్పందన మరియు అగ్నిమాపక శాఖ డీజీ విక్రమ్ సింగ్ మాన్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఎన్‌డీఎంఏ లీడ్ కన్సల్టెంట్ మేజర్ జనరల్ (రిటైర్డ్) సుధీర్ బెల్, ఎన్‌డీఆర్‌ఎఫ్ (చీణ=ఖీ), ఎస్‌డీఆర్‌ఎఫ్ (ాణ=ఖీ) ఉన్నతాధికారులతో కలిసి జూమ్ మీటింగ్ ద్వారా పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో విపత్తుల నిర్వహణ వ్యవస్థను మరింత పటిష్టం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా మాక్ డ్రిల్స్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రాణనష్టాన్ని నివారించడమే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికావద్దని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు తక్షణ సహాయం అందించేలా యంత్రాంగం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఐడీఓసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ (జుూజ) నుండి జిల్లా కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన తో కలసి పాల్గొని, బూర్గంపాడులో నిర్వహిస్తున్న మాక్ డ్రిల్ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తూ వివిధ శాఖల అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. అనంతరం బూర్గంపాడు మండలంలోని అంబేద్కర్ నగర్, ఎస్సీ కాలనీ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి రెస్క్యూ, పునరావాస చర్యలను పరిశీలించారు.ఫైర్ శాఖ అధికారి క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మాక్ డ్రిల్‌కు ఆరవ బెటాలియన్ టీజీఎస్పీకి చెందిన కే. శంకర్, సీఆర్పీఎఫ్ కమాండర్ రాజేష్ దోగ్రా అబ్జర్వర్లుగా వ్యవహరించారు. వరద ప్రభావిత ప్రాంతాల నుంచి ప్రజలను లైఫ్ జాకెట్లు, బోట్లు సహాయంతో సురక్షిత ప్రాంతాలకు తరలించడం, అంబులెన్స్‌ల ద్వారా పునరావాస కేంద్రాలకు చేర్చడం, బాధితులకు త్రాగునీరు, భోజనం, వైద్య సేవలు, తాత్కాలిక నివాస సదుపాయాలు కల్పించడం వంటి చర్యలను డెమో రూపంలో ప్రదర్శించారు.ఈ కార్యక్రమంలో భాగంగా బూర్గంపాడు ఎస్సీ కాలనీ నుంచి 10 మంది గర్భిణీలు, 45 మంది చిన్నారులు సహా మొత్తం 200 మందిని, 26 పశువులను సురక్షితంగా బూర్గంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. అక్కడ బాధితులకు తక్షణ వైద్య సేవలు, ఆశ్రయం, త్రాగునీరు, ఆహార సదుపాయాలు కల్పించారు.వివిధ శాఖల అధికారులు ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేసి అత్యవసర పరిస్థితుల్లో చేపట్టాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఫైర్, రెవెన్యూ, ఇరిగేషన్, వైద్య, పశుసంవర్ధక శాఖల సిబ్బంది సమన్వయంతో సేవలు అందించారు. గజఈతగాళ్ల సహాయంతో చేపట్టే రెస్క్యూ విధానాలను కూడా ప్రాక్టికల్‌గా ప్రదర్శించారు.బూర్గంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రం, ఆపరేషన్ సెంటర్లు, వైద్య శిబిరాలను జిల్లా కలెక్టర్ అంకిత్ పరిశీలించారు. బాధితులకు అందిస్తున్న త్రాగునీరు, భోజనం, తాత్కాలిక నివాస సదుపాయాలు, అత్యవసర వైద్య సేవలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. వైద్య శిబిరాల ద్వారా అందిస్తున్న సేవలు, మందుల పంపిణీ, అత్యవసర పరిస్థితుల్లో చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు తగిన సూచనలు చేశారు. పునరావాస కేంద్రంలో ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరాన్ని కూడా పరిశీలించి, పశువులకు అవసరమైన వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ సిబ్బంది (జువీజ), రెవెన్యూ సిబ్బంది బాధితులకు సమన్వయంతో సేవలు అందించాలన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు అధికారులు, సిబ్బంది, యువత, విద్యార్థులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ముందస్తు అప్రమత్తత, శాఖల మధ్య సమన్వయం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టాలను తగ్గించవచ్చన్నారు. ఎన్‌సీసీ విద్యార్థులతో మాట్లాడి అత్యవసర పరిస్థితుల్లో వారు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. విపత్తుల సమయంలో "గోల్డెన్ అవర్"లో తీసుకునే చర్యలు ప్రాణ రక్షణకు కీలకమని, శాఖల మధ్య సమన్వయం ద్వారా తక్షణ సహాయం అందించాల్సిన అవసరం ఉందని తెలిపారు.మాక్ డ్రిల్ ద్వారా జిల్లా యంత్రాంగం అత్యవసర పరిస్థితుల్లో సమన్వయంతో, క్రమశిక్షణతో పనిచేసే సామర్థ్యాన్ని ప్రదర్శించిందని, భవిష్యత్తులో సంభవించే ప్రకృతి వైపరీత్యాలను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ఇలాంటి మాక్ డ్రిల్‌లు ఎంతో ఉపయోగకరమని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. కార్యక్రమంలో జెడ్పి సీఈవో నాగలక్ష్మి, జిల్లా వైద్య శాఖ అధికారి తుకారాం రాథోడ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, బూర్గం పహాడ్ తాసిల్దార్, ఎంపీడీవో, సంబంధిత శాఖల అధికారులు,ఎన్ డి ఆర్ ఎఫ్,ఎస్ డి ఆర్ ఎఫ్,ఎన్ ఎన్ సి సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

# పారిశ్రామిక ప్రమాదాలపై విజయవంతంగా ముగిసిన మాక్ డ్రిల్

- పాశమైలారం బయోకాన్ లిమిటెడ్‌లో అత్యవసర పరిస్థితులపై వినూత్న విన్యాసాలు
- సమన్వయంతో పనిచేసిన రెస్క్యూ బృందాలు
- అప్రమత్తతతో ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించవచ్చు: అదనపు కలెక్టర్ పాండు



**సంగారెడ్డి: మే18( సమయం న్యూస్) :** పారిశ్రామిక ప్రమాదాల సమయంలో చేపట్టాల్సిన సహాయక చర్యలు, ముందస్తు జాగ్రత్తలపై అవగాహన పెంపొందించేందుకు సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని బయోకాన్ లిమిటెడ్‌లో సోమవారం నిర్వహించిన మాక్ డ్రిల్ విజయవంతంగా ముగిసింది.అదనపు కలెక్టర్ పాండు, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ మాక్ ఎక్సర్‌సైజ్‌లో జిల్లా యంత్రాంగం అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని ఆచరణాత్మకంగా ప్రదర్శించారు.అంబులెన్స్‌లు, అగ్నిమాపక శకటాలు, వైద్య బృందాలు, పోలీస్, రెవెన్యూ, ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది సమన్వయంతో చేపట్టిన సహాయక చర్యలు ప్రజల్లో, పరిశ్రమ కార్మికుల్లో నమ్మకాన్ని పెంపొందించాయి.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పాండు మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో అప్రమత్తతతో వ్యవహరిస్తే ప్రాణ, ఆస్తి నష్టాన్ని గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. అన్ని శాఖల అధికారులు, కంపెనీ యాజమాన్యం, సహాయక బృందాల సమన్వయంతో మాక్ డ్రిల్ విజయవం తమైందన్నారు.అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి మాట్లాడుతూ కంపెనీలో ఏర్పాటు చేసిన ఫైర్ ప్రొటెక్షన్ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేస్తోందని తెలిపారు. ప్రమాదం సంభవించిన వెంటనే పోలీసులకు, సంబంధిత ప్రభుత్వ శాఖలకు సమాచారం అందించాలని సూచించారు. తొలి దశలో వేగంగా స్పందించడం ద్వారా ప్రమాద తీవ్రతను తగ్గించవచ్చని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రాజేందర్, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి నాగేశ్వరరావు, పోలీస్, వైద్య ఆరోగ్య, పరిశ్రమలు, రెవెన్యూ, విద్యుత్ శాఖల అధికారులు, బయోకాన్ కంపెనీ ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు.

# సోలార్ పవర్ షాప్ ప్రారంభించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**అదిలాబాద్ మే18( సమయం న్యూస్). :** పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగాన్ని పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా కలెక్టర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని రాంనగర్ నూతనంగా ఏర్పాటు చేసిన 'సోలార్ పవర్ షాప్'ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రస్తుతం పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు కాలుష్య నివారణకు ప్రత్యామ్నాయంగా సౌర శక్తి ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ప్రజలు తమ ఇండ్లపై, వ్యాపార సముదాయాలపై సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేసుకోవడం ద్వారా కరెంట్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవచ్చని, అలాగే పర్యావరణానికి మేలు చేసినవారవుతారని పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో ఇలాంటి అధునాతన సోలార్ పరికరాల దుకాణం అందుబాటులోకి రావడం అభినందనీయమని, ప్రజలకు సౌర శక్తిపై మరింత అవగాహన కల్పించేలా నిర్వాహకులు కృషి చేయాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో యజమానులు జలీల్, వ్యాపారస్తులు సిబ్బంది పాల్గొన్నారు.

# దివ్యాంగుల సాధికారతకు సహాయ ఉపకరణాలు ఎంతో దోహదం

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష
- జడ్పీహెచ్‌ఎస్ బాలికల పాఠశాలలో ఉచిత ఉపకరణాల పంపిణీ కార్యక్రమం
- 75 మంది దివ్యాంగులకు 94 సహాయ ఉపకరణాల పంపిణీ
- దివ్యాంగుల స్వావలంబనకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు



**పెద్దపల్లి, మే-18స్( సమయం న్యూస్) :**దివ్యాంగుల సాధికారతకు సహాయ ఉపకరణాలు ఎంతో దోహదం అవుతాయని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు.

పెద్దపల్లి పట్టణంలోని జడ్పీహెచ్‌ఎస్ బాలికల పాఠశాలలో ాూ×వీజూ సంస్థ ఆధ్వర్యంలో, సమగ్ర శిక్ష మరియు జిల్లా విద్యాశాఖ కార్యాలయం పెద్దపల్లి సంయుక్తంగా నిర్వహించిన దివ్యాంగులకు ఉచిత సహాయ ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొన్నారు.ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించి దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, దివ్యాంగుల సాధికారత కోసం ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. దివ్యాంగులు విద్య, ఉపాధి రంగాల్లో ముందుకు రావడానికి అవసరమైన సహకారం అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సహాయ ఉపకరణాలు వారి దైనందిన జీవితాన్ని సులభతరం చేయడంతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.ఈ క్యాంప్‌లో మె-ొత్తం 75 మంది దివ్యాంగులకు 94 ఉపకరణాలు అందజేశారు. వాటిలో ట్రై సైకిళు,, 6 సీపీ చెయిర్లు, 40 టీఎల్‌ఎం కిట్లు, 1 విజువల్లి ఇంపెయర్డ్ కిట్ (సుగమ్య కేన్), 18 వీల్ చెయిర్లు, 28 హియరింగ్ ఎయిడ్స్, 1 రోలేటర్ పంపిణీ చేశారు.దివ్యాంగులకు అవసరమైన సహాయక ఉపకరణాలు అందించడం ద్వారా వారి దైనందిన జీవితంలో మరింత స్వావలంబన కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి శారద, సీఎంఓ కవిత, కోఆర్డినేటర్ మల్లేష్ గౌడ్, హెచ్‌ఎం అరుణ , అన్ని మండలాల ఐఈఆర్పీలు పాల్గొన్నారు.

# ముగ్గురు చిన్నారుల మృతి బాధాకరం

- మంత్రి దామోదర్ రాజనర్సింహ



**ఆంధోల్ మే18( సమయం న్యూస్). :** ఆందోల్ నియోజకవర్గం రాయికోడ్ మండలం పిపడ్‌పల్లి పరిధిలోని రామోజీపల్లిలో ఈతకు వెళ్లిన ముగ్గురు చిన్నారులు వాగులోని లోతైన నీటి గుంటలో పడి మృతి చెందడం తీవ్ర విషాదకరమని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు.ఈ ఘటనపై మంత్రి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చిన్నారుల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇలాంటి దుర్ఘటనలు మళ్లీ జరగకుండా ప్రజలు, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు.




# ఐపీఎల్ ప్లే ఆఫ్స్ రేసు రసవత్తరం

**హైదరాబాద్, మే 18:** ఐపీఎల్ 2026 సీజన్ లీగ్ దశ ముగింపుకు చేరుకుంటున్న వేళ ప్లే ఆఫ్స్ సమీకరణాలు అత్యంత ఉత్కంఠభరితంగా మారాయి. ఇప్పటివరకు మొత్తం 62 లీగ్ మ్యాచ్‌లు పూర్తికాగా, పాయింట్ల పట్టికలో 18 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఇప్పటికే అధికారికంగా ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించింది. ఆర్సీబీ తన తదుపరి మ్యాచ్‌లో కూడా విజయం సాధిస్తే టాప్-2లో నిలిచి క్వాలిఫైయర్-1 ఆడే అవకాశాలు మరింత బలపడనున్నాయి. మరోవైపు ముంబై ఇండియన్స్, లక్నో సూపర్ జెయింట్స్ జట్లు పేలవ ప్రదర్శనతో ఇప్పటికే టోర్నీ నుంచి నిష్క్రమించాయి. ఇక మిగిలిన మూడు ప్లే ఆఫ్స్ స్థానాల కోసం ప్రస్తుతం ఏడు జట్ల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. పాయింట్ల పట్టికలో 16 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్న గుజరాత్ టైటాన్స్ ప్లే ఆఫ్స్ చేరడం దాదాపు ఖాయమైనట్లే కనిపిస్తోంది. గణాంకాల ప్రకారం ఆ జట్టుకు 99.20 శాతం అవకాశాలు ఉన్నాయి. మరో మ్యాచ్ గెలిస్తే గుజరాత్ క్వాలిఫైయర్-1కు అర్హత సాధించే అవకాశం ఉంది. ఇక 14 పాయింట్లతో మూడో స్థానంలో ఉన్న సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ప్రస్తుతం 75 శాతం అవకాశాలు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. సన్‌రైజర్స్ తన మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో గెలిస్తే ఇతర జట్ల ఫలితాలతో సంబంధం లేకుండా నేరుగా ప్లే ఆఫ్స్‌కు చేరుకుంటుంది. ఈ నేపథ్యంలో చెన్నైలో జరగబోయే సన్‌రైజర్స్ హైదరాబాద్, చెన్నై సూపర్ కింగ్స్ మ్యాచ్ అత్యంత కీలకంగా మారింది. ఈ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ విజయం సాధిస్తే ప్లే ఆఫ్స్ దారి మరింత సులువవుతుంది. ఒకవేళ ఓడిపోతే చివరి మ్యాచ్‌లో ఆర్సీబీపై భారీ తేడాతో గెలవాల్సిన పరిస్థితి రావచ్చు. అప్పుడు రన్‌రేట్ సమీకరణాలు కూడా కీలకంగా మారనున్నాయి. లీగ్ దశ చివరి మ్యాచ్‌లు దగ్గరపడుతున్న కొద్దీ ప్లే ఆఫ్స్ రేసు మరింత ఆసక్తికరంగా మారుతుండటంతో అభిమానుల్లో ఉత్కంఠ పెరుగుతోంది.

# 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ సంచలనం

## ఐపీఎల్‌లో కొత్త చరిత్ర




**న్యూఢిల్లీ, మే 18 :** ఐపీఎల్ 2026 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ తన విధ్వంసకర బ్యాటింగ్‌తో ప్రపంచ క్రికెట్ దృష్టిని ఆకర్షిస్తున్నాడు. కేవలం 15 ఏళ్ల వయసులోనే ఐపీఎల్ వేదికపై సీనియర్ బౌలర్లను ఉతికి ఆరేస్తూ అరుదైన రికార్డులు సృష్టిస్తున్నాడు. ఆదివారం ఢిల్లీ క్యాపిటల్స్‌తో అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ కేవలం 21 బంతుల్లోనే 46 పరుగులు చేసి మరోసారి మెరుపులు మెరిపించాడు. ఈ ఇన్నింగ్స్‌తో ఐపీఎల్ చరిత్రలో ఒకే సీజన్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన భారతీయ బ్యాటర్‌గా కొత్త రికార్డు నెలకొల్పాడు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు వైభవ్ ఏకంగా 43 సిక్సర్లు బాదాడు. ఇంతకుముందు 2024 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆటగాడు అభిషేక్ శర్మ 42 సిక్సర్లతో ఈ రికార్డు సృష్టించగా.. ఇప్పుడు వైభవ్ ఆ ఘనతను అధిగమించాడు. వైభవ్ కొట్టిన 43 సిక్సర్లలో 35 సిక్సర్లు పవర్‌ప్లేలోనే రావడం అతని దూకుడు బ్యాటింగ్‌కు నిదర్శనంగా నిలుస్తోంది. మొదటి ఆరు ఓవర్లలోనే ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడుతూ రాజస్థాన్‌కు అదిరిపోయే ఆరంభాలు అందిస్తున్నాడు. ఢిల్లీతో జరిగిన మ్యాచ్‌లో లుంగీ ఎంగిడి వేసిన తొలి బంతికే భారీ సిక్సర్ బాదిన వైభవ్ మరో అరుదైన ఘనతను కూడా అందుకున్నాడు. ఐపీఎల్ చరిత్రలో ఒకే సీజన్‌లో మూడుసార్లు తొలి బంతికే సిక్సర్ కొట్టిన ఆటగాళ్ల జాబితాలో చోటు సంపాదించాడు. ఇంతకుముందు షారుఖ్ ఖాన్, సునీల్ నరైన్, దేవదత్ పడిక్కల్ ఈ ఘనత సాధించగా.. ఇప్పుడు వైభవ్ కూడా వారి సరసన నిలిచాడు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 12 మ్యాచ్‌లు ఆడిన వైభవ్ సూర్యవంశీ 486 పరుగులు సాధించాడు. ముఖ్యంగా 234.78 స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేస్తూ ప్రత్యర్థి బౌలర్లకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాడు. కేవలం 14 పరుగుల తేడాతో 500 పరుగుల మైలురాయిని చేజార్చుకున్నప్పటికీ.. అతని విధ్వంసకర ఆటతీరు చూసి భవిష్యత్తులో భారత జట్టుకు గొప్ప స్టార్ దొరికాడని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ప్లేఆఫ్స్‌కు సన్‌రైజర్స్!



## చెన్నయ్ సూపర్ కింగ్స్‌పై 5వికెట్ల తేడాతో అద్భుత విజయం

### పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి చేరిన హైదరాబాద్ జట్టు

**ఐపీఎల్ టోర్నీలో సన్‌రైజర్స్ హైదరాబాద్ అదరగొట్టింది. సోమవారం చెన్నయ్‌లోని ఎమ్ఏ చిదంబరం స్టేడియంలో జరిగిన ఉత్కంఠ పోరులో చెన్నయ్ సూపర్ కింగ్స్‌పై 5 వికెట్ల తేడాతో అద్భుత విజయం సాధించింది. ఈ గెలుపుతో సన్‌రైజర్స్ ప్లేఆఫ్స్‌లో తమ స్థానాన్ని మరింత పదిలపర్చుకోగా.. ఓటమి పాలైన చెన్నయ్ సూపర్ కింగ్స్ ప్లే ఆఫ్స్ అవకాశాలను సంక్లిష్టం చేసుకుంది.**

**చెన్నయ్ :** ఎమ్ ఏ చిదంబరం స్టేడియం వేదికగా సోమవారం 2026 మే 18 న జరిగిన మ్యాచ్ లో టాస్ గెలిచిన చెన్నయ్ సూపర్ కింగ్స్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 180 పరుగుల భారీ స్కోరు సాధించింది. లక్ష్య ఛేదనలో హైదరాబాద్ బ్యాటర్లు సమష్టిగా రాణించడంతో ఆ జట్టు 19 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 181 పరుగులు చేసి ఘన విజయం సొంతం చేసుకుంది. మరో 6 బంతులు మిగిలి ఉండగానే సన్ రైజర్స్ సునాయాసంగా గెలుపొందింది.



#### రాణించిన బ్రెవిస్, విజృంభించిన కమిన్స్..

తొలుత బ్యాటింగ్ చేసిన చెన్నయ్ బ్యాటర్లలో డెవాల్డ్ బ్రెవిస్ 27 బంతుల్లో 44 పరుగులు, కార్తీక్ శర్మ 19 బంతుల్లో 32 పరుగులు, సంజు శాంసన్ 13 బంతుల్లో 27 పరుగులతో రాణించి జట్టుకు గౌరవప్రదమైన స్కోరు అందించారు. హైదరాబాద్ బౌలర్లలో కెప్టెన్ పాట్ కమిన్స్ 4 ఓవర్లలో 28 పరుగులిచ్చి 3 కీలక వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి నడ్డివిరిచాడు. సాకిబ్ హుస్సేన్ 4 ఓవర్లలో 34 పరుగులిచ్చి 2 వికెట్లు, ఇషాన్ మలింగ 4 ఓవర్లలో 26 పరుగులిచ్చి ఒక వికెట్ తమ ఖాతాలో వేసుకుని చెన్నయ్ స్కోరును కట్టడి చేశారు.

#### కదంతొక్కిన ఇషాన్, క్లాసెన్..

181 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సన్ రైజర్స్ హైదరాబాద్ కు బ్యాటర్లు అద్భుతమైన శుభారంభం అందించారు. ఓపెనర్ ఇషాన్ కిషన్ 47 బంతుల్లో 70 పరుగులు చేసి విజయానికి బాటలు వేయగా, హెన్రిచ్ క్లాసెన్ 26 బంతుల్లో 47 పరుగులు చేసి విధ్వంసం సృష్టించాడు. అభిషేక్ శర్మ సైతం 21 బంతుల్లో 26 పరుగులు చేసి సత్తా చాటాడు. దీంతో సన్ రైజర్స్ సునాయాసంగా లక్ష్యాన్ని చేరుకుంది. చెన్నయ్ బౌలర్లలో ముకేష్ చౌదరి 4 ఓవర్లలో 36 పరుగులిచ్చి 2 వికెట్లు తీశాడు. అకేల్ హొస్సేన్ 3 ఓవర్లలో 21 పరుగులిచ్చి ఒక వికెట్, నూర్ అహ్మద్ 4 ఓవర్లలో 40 పరుగులిచ్చి ఒక వికెట్ దక్కించుకున్నారు.

#### పదిలంగా హైదరాబాద్ స్థానం..

ఈ అద్భుత విజయంతో సన్ రైజర్స్ హైదరాబాద్ ప్లే ఆఫ్స్ రేసులో తన స్థానాన్ని మరింత పదిలపర్చుకుంది. పాయింట్ల పట్టికలో 13 మ్యాచ్ లు ఆడిన హైదరాబాద్ 8 విజయాలు, 5 ఓటములతో 16 పాయింట్లు సాధించి మూడో స్థానానికి చేరుకుంది. మరోవైపు సొంత గడ్డపై కీలక మ్యాచ్ లో ఓడిన చెన్నయ్ సూపర్ కింగ్స్ పరిస్థితి కష్టంగా మారింది. ఇప్పటివరకు 13 మ్యాచ్ లు ఆడిన ఆ జట్టు 6 విజయాలు, 7 ఓటములతో 12 పాయింట్లు మాత్రమే సాధించి ఆరో స్థానంలో నిలిచింది. దీంతో చెన్నయ్ ప్లే ఆఫ్స్ అవకాశాలు బాగా సంక్లిష్టంగా మారాయి. తదుపరి మ్యాచ్ లో తప్పక భారీ తేడాతో గెలవాల్సిన పరిస్థితిలో చెన్నయ్ పడిపోయింది.



# ధోని ఆడతాడా? గావస్కర్ ఆసక్తికర వ్యాఖ్యలు





**చెన్నై, మే 18 :** ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ కీలక దశకు చేరుకోవడంతో ప్లే ఆఫ్స్ సమీకరణాలు మరింత ఉత్కంఠగా మారాయి. 12 మ్యాచ్‌ల్లో ఆరు విజయాలు సాధించిన చెన్నై సూపర్ కింగ్స్ ఇంకా నాకౌట్ ఆశలను సజీవంగా ఉంచుకుంది. మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో గెలిస్తేనే సీఎస్కే ప్లే ఆఫ్స్‌కు చేరే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో చెపాక్ స్టేడియం వేదికగా సోమవారం సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరగనున్న మ్యాచ్ అత్యంత కీలకంగా మారింది. ఇదే ఈ సీజన్‌లో చెన్నైకి చివరి హోం మ్యాచ్ కావడంతో, మహేంద్ర సింగ్ ధోని బరిలోకి దిగుతాడనే ప్రచారం సోషల్ మీడియాలో జోరుగా సాగుతోంది. కొందరు ఇదే మ్యాచ్‌లో ధోని రిటైర్మెంట్ ప్రకటించే అవకాశం ఉందంటూ ఊహాగానాలు చేస్తున్నారు. ఈ ప్రచారంపై భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ స్పందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. కండరాల గాయం కారణంగా ధోని ఈ సీజన్‌లో ఇప్పటివరకు ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదని గుర్తుచేశాడు. దాదాపు ఏడాది కాలంగా పోటీ క్రికెట్‌కు దూరంగా ఉన్న ధోని నేరుగా ఇలాంటి కీలక మ్యాచ్‌లో ఆడటం అంత సులభం కాదని అభిప్రాయపడ్డాడు. సీఎస్కేకు ఇది తప్పక గెలవాల్సిన మ్యాచ్ కావడంతో, పూర్తి ఫిట్‌నెస్ లేని ఆటగాడిని జట్టులోకి తీసుకోవడం ప్రమాదకర నిర్ణయం అవుతుందని పేర్కొన్నాడు. ధోని ప్రస్తుతం తీవ్రంగా సాధన చేస్తున్నప్పటికీ, మ్యాచ్ పరిస్థితుల్లో ఆడకపోవడం ఒక పెద్ద సమస్యగా మారుతుందని గావస్కర్ తెలిపాడు. అభిమానిగా తాను కూడా ధోని మైదానంలోకి దిగాలని కోరుకుంటానని, అతడిని ఆడుతుంటే చూడాలని ప్రతి ఒక్కరికీ ఉంటుందని చెప్పాడు. అయితే వాస్తవ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుంటే, సన్‌రైజర్స్‌తో మ్యాచ్‌లో ధోని ఆడకపోవడమే మంచిదని భావిస్తున్నట్లు వెల్లడించాడు. అదే సమయంలో సోషల్ మీడియాలో వినిపిస్తున్న వార్తలు నిజమై ధోని మైదానంలోకి దిగితే మాత్రం అది అభిమానులకు పెద్ద సర్‌ప్రైజ్ అవుతుందని వ్యాఖ్యానించాడు.

# బీసీసీఐకి ఆర్టీఐ వర్తించదు

## కేంద్ర సమాచార కమిషన్ కీలక తీర్పు




**న్యూఢిల్లీ, మే 18 :** భారత క్రికెట్ నియంత్రణ మండలి అయిన బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ఫర్ క్రికెట్ ఇన్ ఇండియా పై సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) వర్తించదని కేంద్ర సమాచార కమిషన్ కీలక తీర్పు వెలువరించింది. బీసీసీఐ ప్రభుత్వ నిధులు పొందే సంస్థ కాదని, ప్రభుత్వ ప్రత్యక్ష నియంత్రణలో కూడా పనిచేయడం లేదని స్పష్టం చేస్తూ కమిషన్ ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో ఆర్టీఐ చట్టం కింద బీసీసీఐ సమాచారాన్ని బహిర్గతం చేయాల్సిన బాధ్యత ఉండదని తేల్చిచెప్పింది. భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించే హక్కు బీసీసీఐకి ఎలా వచ్చిందన్న అంశంతో పాటు, జాతీయ-అంతర్జాతీయ క్రికెట్ టోర్నీలకు ఆటగాళ్ల ఎంపిక ఎలా జరుగుతుందనే వివరాలు కోరుతూ దాఖలైన అప్పీల్‌ను కమిషన్ తిరస్కరించింది. బీసీసీఐ తమిళనాడు సొసైటీస్ రిజిస్ట్రేషన్ చట్టం కింద నమోదైన ఒక ప్రైవేట్ సంస్థ మాత్రమేనని, అది పార్లమెంట్ చట్టం లేదా ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా ఏర్పడలేదని కమిషన్ పేర్కొంది. అయితే ఇదే అంశంపై 2018లో కేంద్ర సమాచార కమిషన్ భిన్న అభిప్రాయం వ్యక్తం చేసింది. భారత జట్టు ఆటగాళ్లు దేశం పేరుతో జెర్సీలు ధరించడం, వివిధ రూపాల్లో ప్రభుత్వ సహకారం లభించడం వంటి కారణాలతో బీసీసీఐని ప్రజా సంస్థగా పరిగణిస్తూ అప్పట్లో ఆర్టీఐ వర్తిస్తుందని తీర్పు ఇచ్చింది. దీనిని వ్యతిరేకిస్తూ బీసీసీఐ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించింది. అనంతరం సుప్రీంకోర్టు సూచనల మేరకు కేసును తిరిగి పరిశీలించిన కమిషన్ తాజా తీర్పును వెలువరించింది. కమిషన్ తన ఉత్తర్వుల్లో మూడు ప్రధాన కారణాలను ప్రస్తావించింది. ప్రభుత్వానికి బీసీసీఐ కార్యకలాపాలపై ప్రత్యక్ష నియంత్రణ లేదని, మీడియా హక్కులు, స్పాన్సర్‌షిప్‌లు, టికెట్ విక్రయాల ద్వారానే బీసీసీఐ భారీ ఆదాయం సంపాదిస్తోందని తెలిపింది. అలాగే పన్ను రాయితీలు లేదా చట్టపరమైన సౌకర్యాలను ప్రభుత్వ నిధులుగా పరిగణించలేమని స్పష్టం చేసింది. గతంలో సుప్రీంకోర్టు పారదర్శకత అవసరమని వ్యాఖ్యానించినప్పటికీ, బీసీసీఐని ప్రజా సంస్థగా ప్రకటించలేదని కమిషన్ గుర్తు చేసింది. ప్రస్తుతం ప్రపంచ క్రికెట్‌లో అత్యంత ధనిక బోర్డుగా ఎదిగిన బీసీసీఐ, ముఖ్యంగా ఇండియన్ ప్రీమియర్ లీగ్ విజయంతో ఆర్థికంగా మరింత బలపడింది. అయితే ప్రస్తుత చట్టాల ప్రకారం బీసీసీఐని ఆర్టీఐ పరిధిలోకి తీసుకురావడం సాధ్యం కాదని, అందుకోసం ప్రత్యేక చట్ట సవరణ లేదా ప్రభుత్వ నిర్ణయం అవసరమని కమిషన్ స్పష్టం చేసింది.



# డేటింగ్‌లో శ్రీలీల, తిలక్‌వర్మ

## రూమర్స్‌ను ఖండించిన తల్లి స్వర్ణలత



నటి శ్రీలీల, క్రికెటర్ తిలక్ వర్మ డేటింగ్‌లో ఉన్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. తాజాగా ఈ వార్తలు జోరందుకున్నాయి. దీంతో శ్రీలీల తల్లి స్వర్ణలత వాటిని ఖండిస్తూ శ్రీలీల పెళ్లికి ఇంకా సమయం ఉందని చెప్పారు. సోషల్ మీడియాలో వస్తోన్న వార్తలు పూర్తిగా అవాస్తవం, నిరాధారం. ఇలాంటి కథలు ఎలా పుట్టుకొస్తాయో తెలియట్లేదు. ఈ వార్తలలో అణువంత కూడా నిజం లేదు. శ్రీలీల ప్రస్తుతం తన చదువు, యాక్టింగ్‌లో బిజీగా ఉంది. ఏ మాత్రం విరామం దొరికినా నీట్-పీజీ ఎగ్జామ్‌కు ప్రిపేర్ అవుతోంది. ఇలాంటి వ్యక్తిగత విషయాల గురించి ఆలోచించడానికి ఆమెకు మరో ఐదారు సంవత్సరాల సమయం ఉందని స్పష్టతనిచ్చారు. 2025 డిసెంబర్‌లో శ్రీలీల-తిలక్ ఇద్దరూ తిరుమలను సందర్శించడం, వాంఖడే టీ20 మ్యాచ్‌లో నటి సందడి చేయడం.. ఇవి రెండూ ఉద్దేశపూర్వకంగా జరగలేదని ఆమె అన్నారు. వాటి ఆధారంగా కథలు అల్లుకుపోవద్దని కోరారు. గతంలో కూడా శ్రీలీలపై ఇలాంటి వార్తలు వచ్చినప్పుడు స్వర్ణలత ఖండించారు. బాలీవుడ్ నటుడు కార్తిక్ ఆర్యన్‌తో ఆమె రిలేషన్‌లో ఉన్నట్లు బీటౌన్‌లో కథనాలు రాగా వాటిని ఖండించారు. కార్తిక్ ఆర్యన్ తల్లి, నేనూ ఇద్దరం గైనకాలజిస్టులం. మా వైద్య నేపథ్యం కారణంగా వృత్తిపరంగా కలుసుకుంటాము. దురదృష్టవశాత్తూ.. అందరూ శ్రీలీల, కార్తిక్‌లకు రిలేషన్ ఉందని రాయడం మొదలుపెట్టారని ఖండించారు.



# 'టాక్సిక్' ఆలస్యంపై క్లారిటీ


**బెంగళూరు, మే 18:** కన్నడ సూపర్ స్టార్ యశ్ నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం టాక్సిక్ విడుదల ఆలస్యంపై గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో అనేక రకాల ప్రచారాలు జరుగుతున్న నేపథ్యంలో.. హీరో యశ్ తాజాగా అధికారికంగా స్పందించారు. టాలెంటెడ్ దర్శకురాలు గీతూ మోహన్ దాస్ తెరకెక్కిస్తున్న ఈ హై-వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను కేవలం భారతీయ సినిమాగా కాకుండా, అంతర్జాతీయ స్థాయిలో రూపొందిస్తున్నామని యశ్ వెల్లడించారు. మొదట ఈ చిత్రాన్ని జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని భావించినప్పటికీ.. ప్రాజెక్ట్ స్థాయిని మరింత పెంచాలని నిర్ణయించడంతో కొన్ని మార్పులు చేయాల్సి వచ్చిందని చెప్పారు. అదే కారణంగా సినిమా విడుదల తేదీని వాయిదా వేయాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. "భారత్‌లో సినిమా ప్రకటించగానే మార్కెటింగ్, బిజినెస్ ప్రక్రియలు మొదలవుతాయి. కానీ హాలీవుడ్‌లో మాత్రం సినిమా పూర్తయ్యాకే అసలు వ్యాపారం ప్రారంభమవుతుంది. పూర్తి అవుట్‌పుట్ చూసిన తర్వాతే అక్కడ పెట్టుబడిదారులు, డిస్ట్రిబ్యూటర్లు నిర్ణయాలు తీసుకుంటారు" అని యశ్ వివరించారు. ప్రస్తుతం 'టాక్సిక్' సినిమాను కూడా అదే తరహాలో అంతర్జాతీయ మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకుని ప్లాన్ చేస్తున్నామని ఆయన తెలిపారు. ప్రపంచ స్థాయి కంటెంట్‌ను అందించేందుకు ప్రీ-ప్రొడక్షన్ నుంచి మేకింగ్ వరకు ప్రతి విషయంలోనూ రాజీ పడకుండా పని చేస్తున్నామని చెప్పారు. "కొంచెం సమయం ఎక్కువ పడుతున్నా.. ఫలితం మాత్రం ప్రేక్షకుల అంచనాలకు మించి ఉంటుంది" అని యశ్ ధీమా వ్యక్తం చేశారు. అభిమానులు ఈ ఆలస్యాన్ని అర్థం చేసుకుని సహకరించాలని కూడా కోరారు. ఇప్పటికే కేజీఎఫ్ సిరీస్‌తో పాన్ ఇండియా స్థాయిలో భారీ గుర్తింపు తెచ్చుకున్న యశ్.. ఇప్పుడు 'టాక్సిక్' ద్వారా మరోసారి గ్లోబల్ మార్కెట్‌ను టార్గెట్ చేస్తున్నట్లు సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# అట్లీ-ప్రియకు కూతురు

## మియూగా నామకరణం చేసినట్లు వెల్లడి



తమిళ దర్శకుడు అట్లీ కుటుంబంలో ఇటీవల ఆనందం రెట్టింపైంది. స్టార్ దర్శకుడు అట్లీ, ఆయన భార్య ప్రియ దంపతులకు ఇటీవల పండంటి ఆడబిడ్డ జన్మించింది. ఇప్పుడు తమ చిన్నారి కుమార్తెకు పెట్టిన ప్రత్యేకమైన పేరు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. గత ఏప్రిల్‌లో జన్మించిన తమ కుమార్తెకు అట్లీ దంపతులు 'మియూ' అనే ప్రత్యేకమైన పేరును ఖరారు చేశారు. పాప పుట్టిన దాదాపు నెల రోజుల తర్వాత, ఆదివారం సోషల్ మీడియా ద్వారా ఈ పేరును అధికారికంగా వెల్లడించారు. ఈ సందర్భంగా చిన్నారి చేతిని ప్రేమగా పట్టుకున్న ఓ మధురమైన ఫోటోను అభిమానులతో పంచుకున్నారు. ఆ పోస్ట్‌లో వారు, మా హృదయాలకు ఒక కొత్త ఇల్లు దొరికింది. ఆమె పేరు మియూ. మా గుండెల్లో అత్యంత పెద్ద స్థానాన్ని సంపాదించుకున్న చిన్నారి దేవత అంటూ భావోద్వేగంగా రాసుకొచ్చారు. ఈ పేరును ప్రత్యేకంగా నిలబెట్టింది దాని అర్థమే. సాధారణంగా భారతీయ లేదా సంస్కృత మూలాల పేర్లు ఎక్కువగా కనిపిస్తుంటాయి. అయితే అట్లీ దంపతులు జపనీస్ సంస్కృతి నుంచి ఈ పేరును ఎంపిక చేసుకున్నారు. జపనీస్ భాషలో 'మియూ' అంటే అందం, ప్రేమ, పవిత్రమైన సౌమ్యత కలిగిన వ్యక్తి అనే అర్థం వస్తుంది. ఈ విభిన్నమైన పేరు నెటిజన్లను ఆకట్టుకుంటోంది. సినీ ప్రముఖులు, అభిమానులు సోషల్ మీడియాలో అట్లీ దంపతులకు అభినందనలు తెలియజేస్తున్నారు. కాగా, అట్లీ-ప్రియ దంపతులకు ఇప్పటికే ఒక కుమారుడు కూడా ఉన్నాడు. వారి పెద్ద కుమారుడు 'మీర్' జనవరి 2023లో జన్మించాడు. జవాన్ చిత్రంతో భారీ విజయాన్ని అందుకున్న ఆయన క్రేజ్ పాన్-ఇండియా స్థాయికి చేరుకుంది. ప్రస్తుతం అల్లు అర్జున్ హీరోగా తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ 'రాకా'పై అట్లీ దృష్టి సారించారు.



# రష్మిక టాటూ వెనుక అసలు కథ ఇదే..

# విజయ్ కోసమేమీ కాదు!

**హైదరాబాద్, మే 18:** టాలీవుడ్ స్టార్ హీరోయిన్, నేషనల్ క్రష్ రష్మిక మందన్న వ్యక్తిగత విషయాలపై సోషల్ మీడియాలో తరచూ పుకార్లు వైరల్ అవుతూనే ఉంటాయి. ముఖ్యంగా ఆమె కుడి చేతి మణికట్టుపై ఉన్న "ఇర్రీప్లేసబుల్" టాటూ గురించి చాలా కాలంగా చర్చ జరుగుతోంది. ఈ టాటూను హీరో విజయ్ దేవరకొండ కోసమే ప్రత్యేకంగా వేయించుకుందంటూ సోషల్ మీడియాలో అనేక కథనాలు ప్రచారంలోకి వచ్చాయి. అయితే తాజాగా ఓ ఇంటర్వ్యూలో స్పందించిన రష్మిక.. ఈ టాటూ వెనుక ఉన్న అసలు కారణాన్ని వెల్లడిస్తూ అన్ని పుకార్లకు చెక్ పెట్టారు. తనకు మొదట్లో టాటూలపై పెద్దగా ఆసక్తి లేదని రష్మిక చెప్పారు. కానీ కాలేజీ రోజుల్లో జరిగిన ఓ చిన్న సంఘటన తన ఆలోచనను పూర్తిగా మార్చేసిందని తెలిపారు. ఒకరోజు కాలేజీలో ఓ అబ్బాయి.. "ఆడపిల్లలు నొప్పిని అస్సలు భరించలేరు.. సూదులు, ఇంజెక్షన్లు అంటే చాలా భయపడతారు" అంటూ ఎగతాళి చేసినట్లు రష్మిక గుర్తుచేసుకున్నారు. ఆ మాటలను ఛాలెంజ్‌గా తీసుకున్న తాను.. ఆడవాళ్లు ఎంతటి నొప్పినైనా భరించగలరని నిరూపించాలనే ఉద్దేశంతో టాటూ వేయించుకోవాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. అయితే టాటూ వేయించుకోవాలని నిర్ణయించిన తర్వాత.. ఏ పదాన్ని రాయించుకోవాలా అని చాలా ఆలోచించానని చెప్పారు. "ఈ ప్రపంచంలో ప్రతి వ్యక్తి ప్రత్యేకమైనవాడు.. ఎవ్వరినీ మరొకరు భర్తీ చేయలేరు" అనే నమ్మకం తనకు చాలా బలంగా ఉందని తెలిపారు. ఆ భావనను ఎప్పటికీ గుర్తుంచుకోవడానికి "ఇర్రీప్లేసబుల్" అనే పదాన్నే టాటూగా ఎంచుకున్నట్లు రష్మిక స్పష్టం చేశారు. దీంతో ఈ టాటూ విజయ్ దేవరకొండ కోసం వేయించుకున్నారన్న ప్రచారానికి పూర్తిగా తెరపడినట్టైంది. ఇక సినిమాల విషయానికి వస్తే.. ప్రస్తుతం రష్మిక పలు పాన్ ఇండియా చిత్రాలతో బిజీగా ఉన్నారు. పుష్ప సినిమా తర్వాత ఆమెకు దేశవ్యాప్తంగా మరింత క్రేజ్ పెరిగిన విషయం తెలిసిందే.



# కాఫీకప్పులో తుఫాన్

## కురుప్పులో విజయ్ అంటూ..ప్రచారం

సూర్య, త్రిష ప్రధాన పాత్రల్లో ఆర్‌జే బాలాజీ తెరకెక్కించిన చిత్రం 'కరుప్పు' తెలుగులో వీరభద్రుడుగా తాజాగా ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా ఆదరణ సొంతం చేసుకుంటోంది. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ మూవీకి సంబంధించిన ఓ ఆసక్తికర విషయం వైరల్ అవుతోంది. ఇందులో విజయ్ నటించారంటూ ఓ వీడియో తెగ చక్కర్లు కొడుతోంది. ఈ చిత్రంలో లోకేశ్ కనగరాజ్ తెరకెక్కించిన సూపర్ హిట్ మూవీ 'లియో' చిత్రానికి సంబంధించిన రిఫరెన్స్ ఉన్నట్లు నెటిజన్లు గుర్తిస్తున్నారు. 'కరుప్పు'లో వచ్చే ఒక సన్నివేశంలో ఎవరో కాఫీ పెడుతున్నట్లు చూపిస్తారు. అయితే ఆ కాఫీ పెడుతున్న వ్యక్తి మరెవరో కాదు.. 'లియో' సినిమాలోని పార్థిబన్ (విజయ్) క్యారెక్టరేనని ఊహించుకుంటున్నారు. పైగా ఈ సన్నివేశానికి ముందు కాఫీ షాప్‌లో సర్వర్.. 'నీకు స్పెషల్ లియో కాఫీ తెస్తాను' అనడం.. అక్కడ కాఫీ పెడుతోన్న వ్యక్తిని వెనక నుంచి మాత్రమే చూపించడంతో అందరూ విజయ్ అతిథి పాత్రలో నటించారా! అని మాట్లాడుకుంటున్నారు. ఇక్కడ మరో ఆసక్తికర విషయం ఏమిటంటే.. కాఫీ షాప్ సన్నివేశంలో కనిపించిన శాండీ, జననీ ఇద్దరూ విజయ్ 'లియో'లోనూ కాఫీషాప్ సీన్‌లో నటించారు. ఈ సన్నివేశంపై నెటిజన్లు ఆసక్తికర కామెంట్స్ పెడుతున్నారు. 'ఈ సీన్ వచ్చినప్పుడు థియేటర్ అరుపులతో దద్దరిల్లింది' అని ఒకరు అనగా.. కరుప్పు' సినిమాలో ఆ కాఫీ కప్పు, ఆ మేకింగ్ స్టైల్ చూస్తుంటే కచ్చితంగా అది 'లియో' సినిమాలోని పార్థిబన్ కేఫ్ రిఫరెన్సే. ఆర్జే బాలాజీ నిజంగానే గట్టి ప్లాన్ చేశారు అని మరో నెటిజన్ కామెంట్ పెట్టారు.

PRINTED, PUBLISHED and OWNED BY **G.THIRUPATHI,** PRINTED AT **SRK PRINTERS,** (V) KOKKERAKUNTA, RAMADUGU MANDAL, KARIMNAGAR DIST. 505001, TELANGANA, PUBLISHED FROM H.NO.10-6-219, KISAN NAGAR, KARIMNAGAR 505001, TELANGANA, **RNI NO.TELTEL/2006/69862**, EDITOR: **BANDARI MARUTHI**




# బంగారం తగ్గే.. వెండి మండే

**హైదరాబాద్, మే 18 :** దేశంలో బంగారం ధరలు మరోసారి తగ్గుముఖం పట్టాయి. గత వారం చివరి రెండు రోజులుగా భారీగా తగ్గిన పసిడి ధరలు.. ఈ వారం ప్రారంభంలో కూడా అదే ధోరణిని కొనసాగిస్తున్నాయి. అయితే వెండి ధరలు మాత్రం ఒక్కసారిగా భారీగా పెరిగాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ వివరాల ప్రకారం.. నేడు ఉదయం 10:30 గంటల సమయానికి హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,56,220కు చేరుకుంది. క్రితం ముగింపు ధరతో పోలిస్తే రూ.710 మేర తగ్గింది. అదే సమయంలో 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర కూడా రూ.650 తగ్గి రూ.1,43,200 వద్ద కొనసాగుతోంది. విజయవాడలో కూడా ఇదే ధరలు నమోదయ్యాయి. ఇక వెండి ధర మాత్రం భారీగా పెరిగింది. హైదరాబాద్‌లో కిలో వెండి ధర ఏకంగా రూ.10 వేల మేర ఎగబాకి రూ.3 లక్షల మార్క్‌ను తాకింది. దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లో కూడా బంగారం ధరల్లో మార్పులు కనిపించాయి. చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,60,910గా కొనసాగుతుండగా.. ముంబైలో రూ.1,56,220, దేశ రాజధాని న్యూఢిల్లీలో రూ.1,56,370గా నమోదైంది. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర చెన్నైలో రూ.1,47,500గా ఉండగా.. ముంబైలో రూ.1,43,200, న్యూఢిల్లీలో రూ.1,43,550గా కొనసాగుతోంది. వెండి ధరల విషయానికి వస్తే.. చెన్నైలో కిలో వెండి ధర రూ.3 లక్షలకు చేరుకోగా.. దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లో రూ.2.90 లక్షల వరకు నమోదవుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరల మార్పులు, డాలర్ బలపడటం, గ్లోబల్ ఆర్థిక అనిశ్చితులు బంగారం ధరలపై ప్రభావం చూపుతున్నాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.

# ఐఫోన్ 18 ప్రోలో భారీ మార్పులు

**కుపర్టినో, మే 18 :** యాపిల్ సంస్థ నుంచి రానున్న తదుపరి తరం ఐఫోన్ 18 ప్రో సిరీస్‌కు సంబంధించిన లీకులు టెక్ ప్రపంచంలో భారీ చర్చకు దారితీస్తున్నాయి. డిజైన్, కెమెరా, ప్రాసెసర్, బ్యాటరీ విభాగాల్లో ఈసారి యాపిల్ భారీ మార్పులు చేయబోతున్నట్లు సమాచారం. ప్రస్తుతం వస్తున్న వివరాల ప్రకారం.. ఐఫోన్ 18 ప్రో మోడళ్లలో డిస్‌ప్లేపై ఉండే డైనమిక్ ఐలాండ్ పరిమాణాన్ని దాదాపు 35 శాతం వరకు తగ్గించనున్నట్లు తెలుస్తోంది. దీంతో ఫుల్ స్క్రీన్ అనుభవం మరింత మెరుగుపడనుంది. అలాగే ఫోన్ వెనుక గ్లాస్ బ్యాక్, మెటల్ ఫ్రేమ్ మధ్య ఎలాంటి గ్యాప్ కనిపించకుండా సీమ్‌లెస్ డిజైన్‌ను తీసుకురానున్నారు. ఈ సిరీస్‌లో డార్క్ చెర్రీ, స్కై బ్లూ, సిల్వర్, డార్క్ గ్రే వంటి కొత్త రంగులను కూడా ప్రవేశపెట్టే అవకాశముందని టెక్ వర్గాలు చెబుతున్నాయి. కెమెరా విభాగంలో మాత్రం యాపిల్ భారీ అప్‌గ్రేడ్ చేయనుంది. మొదటిసారిగా వేరియబుల్ అపెర్చర్ టెక్నాలజీని ప్రధాన కెమెరాలో అందించనున్నట్లు సమాచారం. దీని ద్వారా డీఎస్ఎల్ఆర్ కెమెరాల మాదిరిగా కాంతి ప్రవాహాన్ని నియంత్రించుకుని తక్కువ వెలుతురులో కూడా అద్భుతమైన ఫోటోలు తీసుకునే అవకాశం ఉంటుంది. అలాగే కొత్త స్టాక్డ్ ఇమేజ్ సెన్సార్, పెద్ద అపెర్చర్ లెన్స్‌లు, సుదూర ఫోటోగ్రఫీ కోసం ప్రత్యేక జూమ్ టెక్నాలజీ కూడా ఈ ఫోన్లలో ఉండే అవకాశముంది. డిస్‌ప్లే పరంగా కొత్త ఎల్‌టీపీఓ ప్లస్ టెక్నాలజీని ఉపయోగించనున్నారు. ఇది స్క్రీన్ క్వాలిటీని మెరుగుపరచడమే కాకుండా బ్యాటరీ వినియోగాన్ని కూడా తగ్గించనుంది. ఈ ఫోన్లలో యాపిల్ అత్యంత శక్తివంతమైన ఏ20 ప్రో చిప్‌ను అమర్చనుంది. ప్రపంచంలోనే తొలిసారిగా 2 నానోమీటర్ టెక్నాలజీతో తయారవుతున్న ఈ చిప్ వల్ల పనితీరు భారీగా పెరగనుండగా.. బ్యాటరీ సామర్థ్యం కూడా గణనీయంగా మెరుగుపడనుంది. ముఖ్యంగా ఐఫోన్ 18 ప్రో మాక్స్ మోడల్‌లో 5,000ఎంఏహెచ్ కంటే ఎక్కువ సామర్థ్యం గల భారీ బ్యాటరీని అందించే అవకాశముందని లీకులు సూచిస్తున్నాయి. ఇది ఇప్పటివరకు వచ్చిన ఐఫోన్‌లలోనే అతిపెద్ద బ్యాటరీ అవుతుంది. ఇక కనెక్టివిటీ విషయంలో కూడా యాపిల్ కొత్త టెక్నాలజీని జోడిస్తోంది. సెల్ సిగ్నల్ లేని ప్రాంతాల్లో కూడా శాటిలైట్ కమ్యూనికేషన్ ద్వారా అత్యవసర సందేశాలు పంపుకునే సదుపాయాన్ని మరింత విస్తరించనుంది. అయితే యాపిల్ నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన రాకపోయినా.. ప్రస్తుతం వస్తున్న లీకులు టెక్ ప్రియుల్లో భారీ అంచనాలను పెంచుతున్నాయి.





# రూపాయే

## చరిత్రలోనే కనిష్ఠానికి రూపాయి మార్కెట్లలో ఆందోళన

**న్యూఢిల్లీ, మే 18:** భారత రూపాయి విలువ సోమవారం చరిత్రలోనే కనిష్ఠ స్థాయికి పడిపోయింది. అమెరికన్ డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 0.2 శాతం క్షీణించి రూ.96.20 వద్దకు చేరుకుంది. దీంతో రూపాయి ఆల్‌టైమ్‌లో స్థాయిని నమోదు చేసింది. పశ్చిమా సియాలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు, అంతర్జాతీయ మార్కెట్లలో పెరిగిన అనిశ్చితి కారణంగా రూపాయిపై తీవ్ర ఒత్తిడి ఏర్పడింది. ఇప్పటికే గత శుక్రవారం తొలిసారిగా డాలర్‌తో పోలిస్తే రూపాయి రూ.96 మార్క్‌ను దాటగా.. సోమవారం మరింత బలహీనపడింది. ముఖ్యంగా అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు భారీగా పెరగడం రూపాయి పతనానికి ప్రధాన కారణంగా మారింది. యూ ఏఈలోని అణు విద్యుత్ కేంద్రంపై దాడి జరిగిందన్న వార్తలతో బ్రెం ట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 111 డాలర్లకు చేరుకుంది. అలాగే ఇరాన్ పై అమెరికా సైనిక చర్యలకు దిగే అవకాశాలు ఉన్నాయన్న సంకేతాలు ప్రపంచ మార్కెట్లలో భయాందోళనలు పెంచుతున్నాయి. ఈ పరిణామాలతో ప్రపంచవ్యాప్తంగా డాలర్‌కు డిమాండ్ పెరగడంతో.. అభివృద్ధి చెందుతున్న దేశాల కరెన్సీలు ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. అందులో భాగంగా భారత రూపాయి కూడా భారీ పతనాన్ని చవిచూ సింది. రూపాయి బలహీనత ప్రభావం దేశీయ స్టాక్ మార్కెట్లపైనా కనిపించింది. సోమవారం ప్రారంభ ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 808 పాయింట్లు, నిఫ్టీ 247 పాయింట్లు నష్టపోయాయి. పెట్టుబడిదారుల్లో ఆందోళన వాతావరణం నెలకొంది. ఇక రూపాయి పతనాన్ని అరిక ట్టేందుకు కేంద్ర ప్రభుత్వం, భారతీయ రిజర్వు బ్యాంక్ చర్యలు చేప ట్టాయి. వెండి దిగుమతులపై కొన్ని ఆంక్షలు విధించడంతో పాటు.. కరెన్సీ మార్కెట్‌లో ఆర్బీఐ జోక్యం చేసుకుంటున్నట్లు సమాచారం. అయితే పశ్చిమాసియా ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ వారమంతా రూపాయిపై ఒత్తిడి కొనసాగే అవకాశముందని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# అమెరికా-చైనా వ్యవసాయ ఒప్పందం

## ట్రంప్ వ్యూహానికి ఫలితం?

**వాషింగ్టన్, మే 18 :** అంతర్జాతీయ వాణిజ్య రంగంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మధ్య ఇటీవల జరిగిన కీలక చర్చల అనంతరం వైట్ హౌస్ ఒక ముఖ్య ప్రకటన విడుదల చేసింది. దీని ప్రకారం.. చైనా వచ్చే మూడు సంవత్సరాల్లో అమెరికా నుంచి భారీ స్థాయిలో వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేయడానికి అంగీకరించింది. ప్రతి ఏడాది కనీసం 17 బిలియన్ డాలర్ల విలువైన వ్యవసాయ ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటామని చైనా హామీ ఇచ్చినట్లు వెల్లడించింది. భారత కరెన్సీలో ఇది సుమారు రూ.1.4 లక్షల కోట్లకు సమానం. 2026, 2027, 2028 సంవత్సరాల్లో ఈ కొనుగోళ్లు నిరంతరాయంగా కొనసాగనున్నట్లు వైట్ హౌస్ స్పష్టం చేసింది. గత ఏడాది అక్టోబర్‌లో సోయాబీన్ కొనుగోళ్లకు సంబంధించిన ఒప్పందాలు దీనికి అదనమని తెలిపింది. గత కొంతకాలంగా అమెరికా-చైనా మధ్య కొనసాగుతున్న వాణిజ్య యుద్ధం కారణంగా అమెరికా రైతులు తీవ్రంగా నష్టపోయారు.



ఒకరిపై ఒకరు భారీ టారిఫ్‌లు విధించుకోవడంతో అమెరికా నుంచి చైనాకు జరిగే వ్యవసాయ ఎగుమతులు గణనీయంగా తగ్గిపోయాయి. 2025 నాటికి అమెరికా వ్యవసాయ ఎగుమతులు 65.7 శాతం పడిపోయి కేవలం 8.4 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. ముఖ్యంగా సోయాబీన్ ఎగుమతుల్లో భారీ ప్రభావం కనిపించింది. 2016లో చైనా తన సోయాబీన్ అవసరాల్లో 41 శాతం అమెరికాపై ఆధారపడగా.. 2024 నాటికి అది 20 శాతానికి పడిపోయింది. అయితే ఇప్పుడు ట్రంప్ ఒత్తిడి నేపథ్యంలో చైనా మళ్లీ అమెరికా వైపు మొగ్గుచూపినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో అమెరికా బీఫ్ కంపెనీలపై ఉన్న సస్పెన్షన్లను ఎత్తివేయడానికి చైనా అంగీకరించింది. అలాగే బర్డ్ ఫ్లూ ప్రభావం లేని అమెరికా రాష్ట్రాల నుంచి చికెన్ దిగుమతులను తిరిగి ప్రారంభించేందుకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ తాజా ఒప్పందం వల్ల అమెరికా వ్యవసాయ రంగానికి పెద్ద ఊరటనిచ్చే అవకాశముందని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. మరోవైపు, ప్రపంచ వాణిజ్య మార్కెట్లలో కూడా ఈ పరిణామం కీలక ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# ఖర్చుల కోతకు కేంద్రం కీలక ఆదేశాలు

## ప్రభుత్వ బ్యాంకులకు పొదుపు సూచనలు

**న్యూఢిల్లీ, మే 18:** పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ఆర్థిక ప్రభావాలను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలోని ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రభుత్వ బీమా సంస్థలు, ఆర్థిక సంస్థలు ఖర్చులను భారీగా తగ్గించుకోవాలని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఆర్థిక క్రమశిక్షణ, పొదుపు చర్యల్లో భాగంగా ప్రయాణాలపై పరిమితులు విధించడంతో పాటు.. దశలవారీగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగానికి మారాలని స్పష్టం చేసింది. ఈ ఆదేశాలు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఎల్ఐసీ వంటి ప్రభుత్వ రంగ దిగ్గజ సంస్థలతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న అనుబంధ సంస్థలకు కూడా వర్తించనున్నాయి. కేంద్ర ఆర్థిక సేవల విభాగం విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం.. అత్యవసర పరిస్థితులు తప్ప అన్ని సమావేశాలు, సమీక్షలు, చర్చలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారానే నిర్వహించాలని సూచించింది. అలాగే చైర్మన్లు, మేనేజింగ్ డైరెక్టర్లు, సీఈఓల విదేశీ ప్రయాణాలపై కూడా పరిమితులు విధించింది. వీలైనంత వరకు అంతర్జాతీయ సమావేశాలకు వర్చువల్ విధానంలోనే హాజరుకావాలని పేర్కొంది. ఇక ప్రధాన కార్యాలయాలు, బ్రాంచ్ కార్యాలయాల్లో ప్రస్తుతం అద్దెకు వినియోగిస్తున్న పెట్రోల్, డీజిల్ వాహనాల స్థానంలో క్రమంగా ఎలక్ట్రిక్ కార్లను వినియోగంలోకి తీసుకురావాలని కేంద్రం స్పష్టం చేసింది. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఉద్రిక్తతల కారణంగా ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటీవలే పొదుపు చర్యలు పాటించాలని పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల ప్రభావంతో చమురు ధరలు




పెరగడం, రూపాయి విలువ బలహీనపడటం, ద్రవ్యోల్బణ ఒత్తిడి పెరగడం వంటి పరిస్థితులు దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయి. ఇప్పటికే కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఖర్చులను తగ్గించుకునే దిశగా ఉద్యోగులకు వారంలో రెండు రోజుల పాటు 'వర్క్ ఫ్రమ్ హోమ్' సదుపాయాన్ని కల్పిస్తున్నాయి.

# సంచలన కేసుల విచారణకు ఫాస్ట్ కోర్టులు

- జాబ్ క్యాలెండర్ ద్వారా పోలీస్, జైళ్లు, ఫైర్ శాఖల్లో ఖాళీల భర్తీ
- తిరుపతి స్పెషల్ సబ్ జైలులో హోంమంత్రి ఆకస్మిక తనిఖీలు
- కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనిత



**తిరుపతి, మే 18:** రాష్ట్రంలో సంచలనమైన కేసులను త్వరితగతిన విచారించడానికి ఫాస్ట్ ట్రాక్ కోర్టులు పనిచేస్తున్నాయని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. అవసరమైతే మరిన్ని ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు. జైల్ సిబ్బంది, పోలీసులు వేరన్నారు. ఖైదీల్లో పరివర్తన కోసం జైల్ సిబ్బంది వారికి దగ్గరగా ఉంటూ.. మార్పులు తీసుకువస్తున్నారని తెలిపారు. జైల్ నుంచి పెరోల్‌పై వచ్చే వారిపై కూడా నిఘా ఉంచుతున్నామన్నారు. జైళ్ల శాఖలో ప్రక్షాళన చేపడతామని చెప్పారు. తిరుపతిలోని స్పెషల్ సబ్ జైల్లో హోంమంత్రి అనిత ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. సోమవారం ఉదయం సబ్ జైల్‌కు వెళ్లిన మంత్రి.. జైలులో ఖైదీలకు కల్పిస్తున్న వసతులను గురించి జైల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హోం మంత్రి మాట్లాడుతూ.. ఖైదీల్లో సత్ప్రవర్తన తీసుకురావడం కోసమే జైళ్లు అని చెప్పుకొచ్చారు. తిరుపతిలోని స్పెషల్ సబ్ జైల్ విస్తీర్ణం తక్కువగా ఉందని.. ఖైదీల సంఖ్య 120 ఉండాల్సింది.. 140 మంది ఉన్నట్లుగా తెలిసిందన్నారు. సబ్ జైల్ ప్రస్తుత విస్తీర్ణం 70 సెంట్లుగా ఉన్నట్లు జైలు అధికారులు చెప్పారన్నారు. దీన్ని పెంచాలా.. లేక మరోచోట నిర్మాణం చేయాలా అనేది పరిశీలిస్తామని తెలిపారు. ఖైదీల భద్రత తమ బాధ్యత అని.. ఖైదీల్లో కూడా పరివర్తన రావాలని హోంమంత్రి అన్నారు. రాజాబ్ క్యాలెండర్ ద్వారా పోలీసు, ఫైర్, జైల్ శాఖల్లో ఖాళీలు భర్తీ చేస్తున్నామని హోంమంత్రి అనిత పేర్కొన్నారు. అంతకుముందు తిరుమల శ్రీవారిని అనిత కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆమెకు స్వాగతం పలికిన టిటిడి అధికారులు దర్శనం చేయించి, శ్రీవారి తీర్థప్రసాదాలు అందించారు. వేదాశీర్వచనం చేశారు.

# ఎస్ఐఆర్‌పై వైఎస్సార్సీపీ అప్రమత్తం

**పార్టీ కీలక నేతలతో సజ్జల సమావేశం**

**ఓటర్ల జాబితా సవరణపై ప్రత్యేక దృష్టి**

**బీఎల్‌ఏలకు శిక్షణ, సమన్వయంపై సూచనలు**



**తాడేపల్లి, మే 18 :** ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంపై వైఎస్సార్సీపీ కీలక నేతలతో పార్టీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి సమావేశం నిర్వహించారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియపై పార్టీ నియమించిన పార్లమెంటరీ పరిశీలకులతో విస్తృతంగా చర్చించారు. ఓటర్ల జాబితా ప్రక్రియలో ప్రతి దశలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఈ సందర్భంగా సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం జూన్ పదిహేను నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. జూన్ పదిహేను నుంచి జులై పద్నాలుగు వరకు ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అనంతరం జులై ఇరవై ఒకటో తేదీన ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేస్తారని పేర్కొన్నారు. ఎఅభ్యంతరాల స్వీకరణ, పరిశీలన, పరిష్కార ప్రక్రియ పూర్తైన అనంతరం సెప్టెంబర్ ఇరవై రెండున తుది ఓటర్ల జాబితా విడుదల చేయనున్నట్లు వివరించారు. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు కొనసాగే ఈ ప్రక్రియ అత్యంత కీలకమని, అందువల్ల పార్టీ తరఫున నియమించిన కమిటీలు పూర్తి అప్రమత్తతతో వ్యవహరించాలని సూచించారు. ప్రత్యేక సవరణ ప్రక్రియలో బూత్ లెవల్ ఏజెంట్లు కీలక పాత్ర పోషిస్తారని సజ్జల పేర్కొన్నారు. బూత్ లెవల్ అధికారులతో సమన్వయం సమ-ర్థవంతంగా ఉండాలని, ఈలోపు ఏజెంట్లకు అవసరమైన శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పార్టీకి మద్దతుగా ఉన్న ఓటర్ల పేర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ జాబితా నుంచి తొలగించబడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ప్రారంభ దశలోనే అప్రమత్తంగా వ్యవహరిస్తే తర్వాత ఇబ్బందులు తలెత్తవని చెప్పారు. అవసరమైన పత్రాలు ముందుగానే సిద్ధం చేసుకునేలా ఓటర్లను చైతన్యపరచాలని సూచించారు. సెప్టెంబర్ వరకు ఈ ప్రక్రియలో పాల్గొనే అన్ని బృందాలు అప్రమత్తంగా ఉండాలని, పార్టీ సీనియర్ నాయకులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు కూడా నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. సమర్థంగా పనిచేసే బూత్ లెవల్ ఏజెంట్లకు రాబోయే రోజుల్లో పార్టీ తగిన గుర్తింపు ఇస్తుందని పేర్కొన్నారు.

# మరో ఫైనాన్స్ మోసం బట్టబయలు

**రాకెట్ ల్యాబ్ పేరుతో ప్రజలకు బురిడీ**

**కేసు నమోదు చేసిన పోలీసులు**

**పల్నాడు, మే 18:** పల్నాడు జిల్లాలో రాకెట్ ల్యాబ్ పేరుతో భారీ మోసం వెలుగులోకి వచ్చింది. తక్కువ మొత్తంలో డబ్బులు పెట్టుబడి పెడితే భవిష్యత్తులో విడతల వారీగా రూ.25 కోట్ల వరకు వస్తాయని నమ్మబలికి వందలాది మంది నుంచి డబ్బులు వసూలు చేసిన ఘటన స్థానికంగా సంచలనం సృష్టిస్తోంది. ముఖ్యంగా నరసరావుపేట, చిలకలూరిపేట ప్రాంతాల్లో ఈ మోసం పెద్ద ఎత్తున జరిగింది. ఈ ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రూ.3వేల నుంచి రూ.11 వేలు కడితే విడతల వారీగా రూ.25 కోట్లు వస్తాయని కేటుగాళ్లు బురిడీ కొట్టించారు. అత్యాశకుపోయి డబ్బులు కట్టి పలువురు బాధితులు మోసపోయారు. నరసరావుపేటలో 263 మంది సహా చిలకలూరిపేట మరికొందరు.. ఇలా మొత్తం సుమారు 500 మంది నుంచి కేటుగాళ్లు డబ్బులు వసూలు చేశారు. ప్రధాన నిందితుడు చిలకలూరిపేట మండలం గొట్టిపాడుకి చెందిన వెంకట్రావుతో సహా ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కేసానుపల్లి వీఆర్వో ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేశారు. నరసరావుపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో నిందితులపై కేసు నమోదైంది. నాగండ్ల వెంకట్రావు, అతని కుమారుడు వంశీ, భార్య, పీఏ నీరజలపై కూడా కేసు నమోదైంది. వీరు పలు ప్రాంతాల్లో కార్యాలయాలు ఓపెన్ చేసి మరీ దందా కొనసాగించినట్లు పోలీసులు తెలిపారు. నరసరావుపేట, చిలకలూరిపేటలో నిందితులపై కేసులు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.




# కొమ్మిపాడు@44.3

- మండిపోతున్న ఏపీ
- రాబోయే 3 రోజులు నిప్పుల కొలిమే..
- 47 డిగ్రీలకు చేరనున్న ఎండలు
- వరుసగా వడగాడ్పుల హెచ్చరికలు



**అమరావతి, మే 18:** రాబోయే మూడు రోజుల పాటు కోస్తాంధ్ర జిల్లాల్లో ఎండ తీవ్రత మరింత పెరిగి అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ వెల్లడించారు. పలు జిల్లాల్లో 45 నుంచి నుంచి 47 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని హెచ్చరించారు. సోమవారం నెల్లూరు జిల్లా కొమ్మిపాడులో అత్యధికంగా 44.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, కడపలో 42.9నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా ఎండలు తీవ్రరూపం దాల్చడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విజయనగరం, పార్వతీపురం మన్యం, పోలవరం, ఏలూరు, బాపట్ల, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 44 నుంచి - 46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, నెల్లూరు, నంద్యాల, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 42 నుంచి 44 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. విశాఖపట్నం, కర్నూలు, అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 40-42 ల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 45- 47 ల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం. నెల్లూరు, నంద్యాల, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 44- 45ల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం. కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 41 - 43ల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం. విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, నంద్యాల, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 45- 47ల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం. శ్రీకాకుళం, విశాఖపట్నం, కర్నూలు, అనంతపురం శ్రీసత్యసాయి, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 42-44ల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం. అలాగే రేపు 47 మండలాల్లో తీవ్రవడగాడ్పులు, 88 మండలాల్లో వడగాడ్పులు, ఎల్లుండి 177 మండలాల్లో తీవ్రవడగాడ్పులు, 255 మండలాల్లో వడగాడ్పులు ప్రభావం చూపే అవకాశంఉందని తెలిపారు. రేపు రాష్ట్రంలోని 47 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 88 మండలాల్లో వడగాడ్పులు ప్రభావం చూపే అవకాశం ఉందని హెచ్చరించారు. బుధవారం పరిస్థితి మరింత తీవ్రంగా ఉండొచ్చని, 177 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 255 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని తెలిపారు. అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం సమయంలో బయటకు రావద్దని సూచించారు. చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. ఎక్కువగా నీరు, మజ్జిగ, పండ్లరసాలు తీసుకోవాలని సూచించారు. ఎండలో పని చేసే వారు తలకు రక్షణగా టోపీ ఉపయోగించాలని వైద్య నిపుణులు సూచించారు.



# జోగి రమేష్ కార్ల తనిఖీ కలకలం

**తెనాలిలో మాజీ మంత్రి వాహనాల తనిఖీలు**

**మొక్కజొన్న రైతుల పోరాటానికి వెళ్తున్నారనే సమాచారం**

**కారులో లేకపోవడంతో ఆశ్చర్యపోయిన పోలీసులు**

**తెనాలి, మే 18:** మాజీ మంత్రి జోగి రమేష్‌కు చెందిన వాహనాలను పోలీసులు తనిఖీ చేసిన ఘటన తెనాలి ప్రాంతంలో చర్చనీయాంశంగా మారింది. పొన్నూరు నియోజకవర్గంలోని మామిళ్లపల్లిలో మొక్కజొన్న రైతుల పోరాటానికి మద్దతుగా జోగి రమేష్ వెళ్తున్నారనే సమాచారంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ క్రమంలో ఆయన కాన్వాయ్‌కు చెందిన కార్లను నిలిపివేసి తనిఖీలు నిర్వహించారు. మామిళ్లపల్లి ప్రాంతంలో రైతులు చేపట్టిన పోరాట కార్యక్రమానికి పలువురు నాయకులు సంఘీభావం ప్రకటిస్తున్న నేపథ్యంలో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టినట్లు సమాచారం. మాజీ మంత్రి జోగి రమేష్ అక్కడికి వెళ్లే అవకాశం ఉందన్న సమాచారంతో మార్గమధ్యంలో విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో తెనాలి పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేసి వాహనాలను ఆపి పరిశీలించారు. జోగి రమేష్‌కు సంబంధించిన కార్లు వస్తున్నాయని సమాచారం అందడంతో వాటిని పోలీసులు నిలిపివేసి తనిఖీలు చేశారు. అయితే తనిఖీల సమయంలో కారులో మాజీ మంత్రి జోగి రమేష్ లేకపోవడంతో పోలీసులు ఆశ్చర్యానికి గురైనట్లు సమాచారం. ఆయన ప్రయాణానికి సంబంధించి అందిన సమాచారంలో స్పష్టత లేకపోవడంతో కొంత గందరగోళ పరిస్థితి నెలకొన్నట్లు తెలుస్తోంది. మొక్కజొన్న రైతుల సమస్యలపై ప్రస్తుతం రాజకీయంగా కూడా చర్చ జరుగుతోంది. రైతుల ఆందోళనకు మద్దతుగా పలువురు నాయకులు ముందుకు వస్తుండటంతో పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని పోలీసులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. ఈ ఘటనతో తెనాలి ప్రాంతంలో కొంతసేపు ఉత్కంఠ వాతావరణం నెలకొంది. పోలీసుల తనిఖీలు, మాజీ మంత్రి వాహనాల నిలుపుదల స్థానికంగా రాజకీయ చర్చలకు దారితీసింది.

# కేరళ మరింతగా పురోగమించాలి

**సీఎం సతీషన్, మంత్రులకు పవన్ అభినందనలు**



**అమరావతి, మే 18:** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కేరళం కొత్త ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపారు. కేరళం ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వీడీ సతీశన్‌కు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. అలాగే మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన వారందరికీ శుభాకాంక్షలు చెప్పారు. ఈ మేరకు సోషల్ మీడియా ఎక్స్ వేదికగా పవన్ కల్యాణ్ పోస్టు పెట్టారు. కేరళం నూతన ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలని పవన్ కల్యాణ్ ఆకాంక్షించారు. పారదర్శకమైన, ప్రగతిశీలమైన పాలనను అందిస్తూ కేరళం రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలని పేర్కొన్నారు. దేవుని సొంత దేశంగా పేరుగాంచిన కేరళం మరింత అభివృద్ధి, సుసంపన్నత సాధించాలని పవన్ కల్యాణ్ ఆకాంక్షించారు.

# ఇంధన ధరలపై అంబటి వినూత్న నిరసన

**గుంటూరు, మే 18:** పెట్రోల్, డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంటూరులో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టింది. మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన స్వయంగా రిక్షా తొక్కుతూ వినూత్నంగా నిరసన తెలిపారు. ఇంధన ధరల పెంపు సామాన్య ప్రజలపై తీవ్ర భారం మోపుతోందని పేర్కొంటూ పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరసనలో పాల్గొన్నారు. నిరసన అనంతరం మీడియాతో మాట్లాడిన అంబటి రాంబాబు ప్రస్తుత కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోనే పెట్రోల్, డీజిల్ ధరలు అధికంగా ఉన్నాయని ఆరోపించారు. పెరుగుతున్న ధరల కారణంగా సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఇంధన ధరల భారం ఒకవైపు ప్రజలను ఇబ్బంది పెడుతుండగా మరోవైపు ప్రజా రంగ సంస్థలను ప్రైవేటుపరచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఆర్టీసీ, వైద్య కళాశాలల విషయంలో ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై కూడా ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించకపోతే రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని అంబటి రాంబాబు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

